

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 200 పేజీలు: 10+4 వెల: 6.50



సిజెపిపై పోలీసు చర్య.. విచారణ కమిటీ ఏర్పాటు
ఇమ్రాన్‌ను ఆస్పత్రికి తరలించాలి: పాక్ సుప్రీం
5


## ధనుష్ శ్రీకాంత్, పుల్లెల గాయత్రి సహా 17 మందికి 'అర్జున' అవార్డులు

ముగ్గురికి 'ద్రోణాచార్య'

ఈసారి కూడా లేని ఖేల్‌రత్న, జాతీయ పురస్కారాలు ప్రకటించిన కేంద్రం





**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో >>2

## ప్రతి నీటి చుక్కకూ ఓ లెక్క ఉండాలి

తాగునీటికే తొలి ప్రాధాన్యం

పంటలకూ భరోసా

కృష్ణా బేసిన్‌లో 76.6%, గోదావరిలో 68.1 % నిల్వలు

సమీక్షలో మంత్రి ఉత్తమ్



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు18:** ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు.. ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని నీటిపారుదల, పౌరసరఫరాల >>2

## సామాన్యుల ఓటు తొలగిస్తే చేటు!

తెలంగాణలో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకం

1.60 కోట్ల ఓట్లకు క్వశ్చన్ మార్క్ ఎందుకో?

బిజెపికి అనుబంధ సంస్థగా మారిన సిఇసి

నిప్పులు చెరిగిన పిసిసి చీఫ్ మహేష్ గౌడ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు18:** 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి >>2

# ఈ సారి 117 మావే

బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్

అమరవీరుల స్తూపంలా పాపన్న విగ్రహం

నేత, గీత కార్మికులకు ఫించన్ సౌకర్యం

తాటి, ఈత చెట్ల పెంపకానికి ప్రోత్సాహం

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణలో సిఎం రేవంత్



మంగళవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం కల్లుగీత కార్మికులతో కలిసి అభివాదం చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి మంత్రులు పొన్నం, పిసిసీ చీఫ్ మహేష్ తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు18:** హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు,గౌడ సంఘాల నేతల సమక్షంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం నిత్యం స్ఫూర్తి నింపేలా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలన్నారు. 2029లో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమావ్యక్తం చేశారు. నేత, గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ పొలాలు ఎక్కడున్నా ఈత, >>2

## ఢిల్లీ వెళ్లిన సిఎం రేవంత్

నేడు సిడబ్ల్యుసి సమావేశానికి హాజరు

20 నుంచి 30 దాకా బ్రిటన్, అమెరికా పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు18:** సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా, బ్రిటన్ పర్యటన షెడ్యూల్ ఖరారయ్యింది. ఈనెల 20 నుంచి 30 వరకు యూకే, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. మంగళవారం రాత్రి దిల్లీకి వెళ్లారు. బుధవారం ఢిల్లీలో జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం పాల్గొంటారు. బుధవారం రాత్రి దిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరనున్నారు. బుధవారం రాత్రి 12.30 గంటలకు విమానం ఎక్కుతారు. ఈ నేపథ్యంలో సీఎం రెండు దేశాల్లో ఉన్న పలు వర్సిటీలను సందర్శించనున్నారు. అలాగే అక్కడి వర్సిటీ బృందాలతో సమావేశం కానున్నారు. లండన్‌లో పర్యటన అనంతరం రేవంత్‌రెడ్డి అమెరికాకు >>2



## ఇందిరమ్మ ఇళ్లకు రూ.230కే సిమెంట్ బస్తా

పరిశ్రమల సామాజిక బాధ్యతకు మంత్రి పొంగులేటి ప్రశంస

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు18:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి >>2



మంగళవారం హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న కల్తీనెయ్యి రసాయనాలను పరిశీలిస్తున్న సిపి సజ్జనార్

## తినేదంతా నెయ్యేనా?

నగరంలో విస్తరిస్తున్న కల్తీనెయ్యి మాఫియా

130 చోట్ల దాడులు జరిపిన టాస్క్‌ఫోర్స్, హెచ్. ఫాస్ట్

36 టన్నుల కల్తీనెయ్యి, రసాయనాలు స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి భారీగా కల్తీ ఆహార ఉత్పత్తులు పట్టుబడ్డాయి. నగర టాస్క్‌ఫోర్స్ పోలీసుల తో పాటు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీం (హెచ్ ఫాస్ట్), బల్దియాలోని ఫుడ్ సేఫ్టీ విభాగం నగర వ్యాప్తంగా జరిపిన దాడుల్లో 36 టన్నుల కల్తీ నెయ్యితో పాటు దీని తయారీకి వాడే పాం ఆయిల్, డాల్డా సహా రసాయనాలను జప్తు చేశారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న వ్యాపారులు, వీటిని విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాయని పోలీసు కమి షనర్ వి.సి సజ్జన్నర్ తెలిపారు. మంగళవారం నాడు కమాండ్ కంట్రోల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ >>2



## మా స్కూళ్లు అధ్వాన్నం

కనీస వసతులు కల్పించండి

హైకోర్టు సిజెకు 20 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల లేఖలు

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న తీవ్రమైన మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల కొరతను నిరసిస్తూ రాష్ట్రంలోని సుమారు 20 వేల మంది విద్యార్థులు నేరుగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పోస్ట్‌కార్డులు రాసి తమ నిరసనను, ఆవేదనను వ్యక్తపరిచారు. భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21ఎ (విద్యా హక్కు) ప్రకారం తమకు న్యాయం చేయాలని ఈ చారిత్రాత్మక ప్రచార ఉద్యమం ద్వారా >>2

# 22ఎ ప్రకంపనలు!

యాదగిరిగుట్టలో 42 వేల ఎకరాలు నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చాయి?

3 నెలల క్రితమే సిఎం దృష్టికి తెచ్చినట్లు వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి

కుట్ర కోణంపై అనుమానాలు.. సమగ్ర విచారణకు సర్కార్ సిద్ధం





**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా నిషేధిత భూముల (22ఏ) జాబితా వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న వేళ యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట భూముల అంశం సంచలనంగా మారింది. యాదగిరిగుట్టలో ఏకంగా 42 వేల ఎకరాల భూమిని 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు జిల్లాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇంత భారీగా భూములు నిషేధిత జాబితాలోకి ఎలా వెళ్లాయన్న ప్రశ్న ఇప్పుడు జిల్లా ప్రజలు, భూ యజమానులు, రియల్ ఎస్టేట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో భూముల విలువలు భారీగా పెరిగిన నేపథ్యంలో 42 వేల ఎకరాల భూమి 22ఏ పరిధిలో ఉన్నట్లు మంత్రి పేర్కొనడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు తదితర లావాదేవీలపై ప్రభావం పడుతుందన్న ఆందోళన భూ యజమానుల్లో వ్యక్తమవుతోంది. ముందస్తు సమాచారం లేకుండా తమ భూములను 22ఏ జాబితాలో చేర్చారని పలువురు వాపోతున్నారు. ఈ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చినది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించిన వివరాలు స్పష్టం చేస్తున్నాయి. యాదగిరిగుట్టలో 22ఏ భూముల అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే మూడు నెలల క్రితమే తన దృష్టికి తీసుకొచ్చారని, అప్పుడే తాను ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. దీంతో ఇంతకాలం అధికార యంత్రాంగం పరిధిలో ఉన్న అంశం ఇప్పుడు రాష్ట్రస్థాయి చర్చగా మారింది. యాదగిరిగుట్టలో ఇంత భారీ విస్తీర్ణంలో భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక ఎవరో ఉద్దేశపూర్వకంగా వ్యవహరించి >>2




స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక సమగ్ర సవరణ)
జూన్ 25, 2026 నుండి
ఓటు V.O.T.E
ప్రధాన ఎన్నికల అధికారి తెలంగాణ

**భారత ఎన్నికల సంఘం** అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులు జాబితాలో లేకుండా చూసేందుకు **జూన్ 25, 2026** నుండి **స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)** నిర్వహిస్తుంది.

17.08.2026న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ పేరు లేనట్లయితే, బూత్ స్థాయి అధికారి (BLO) / AERO / ERO ను సంప్రదించండి.

17.08.2026 నుండి 16.09.2026 వరకు క్లెయిమ్‌లు & అభ్యంతరాలు తెలపవచ్చు.

ఫారమ్-6: మీకు అక్టోబరు 1, 2026 కి 18 సం॥లు నిండినట్లైతే, మరియు ఏదైనా శాసనసభ నియోజకవర్గాల్లో ఓటర్‌గా నమోదు కానట్లయితే లేటెస్ట్ ఫోటో, వయసు ధ్రువీకరణ పత్రం & డిక్లరేషన్ ఫారం మొ॥ జతచేసి అందచేయండి (నూతన ఓటర్‌గా)

ఫారమ్-7: చనిపోయిన లేదా డూప్లికేట్ ఓటర్ల పై అభ్యంతరాలు తెలియజేయుటకు (తొలగింపులు)

ఫారమ్-8: మీ మొబైల్ నెంబర్ అప్డేట్, చిరునామా మార్పులు, ఓటర్ గుర్తింపుకార్డులో వివరాల సవరణలకు (సవరణలు)



తుది ఓటర్ల జాబితా ప్రచురణ 19.10.2026

Scan here for ecinet.eci.gov.in

Website: https://voters.eci.gov.in / https://ecinet.eci.gov.in / https://www.eci.gov.in

వివరాలకు: బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించండి (BLO)/AERO/ERO

CEOTelangana CEOTelangana ChiefElectoralOfficerTelangana CEO_Telangana

వివరాలకు, టోల్‌ఫ్రీ 1950 ఉ॥ 10:30 - సా॥5:00 వరకు

మీ ఓటు.. మీ బాధ్యత. ఓటర్ల జాబితాలో మీ వివరాలను అప్‌డేట్ చేసుకోండి - పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి



న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులతో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# తినేదంతా నెయ్యేనా?

>> కొందరు వ్యక్తులు మాఫియాగా మారి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కల్తీ ఆహార వస్తువుల తయారీ కేంద్రాలతో పాటు వీటి వి క్రయ సంస్థల గురించి సమాచారం అందగానే దాడులు చేబట్టినట్లు ఆయన తెలిపారు. మొత్తం 130 ప్రాంగణాల్లో 39 తయారీ కేంద్రాలతో పాటు 91 విక్రయ కేంద్రాలలో దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో 36 టన్నుల కల్తీ నెయ్యి పట్టుబడిందని ఆయన తెలిపా రు. పట్టుబడ్డ కల్తీ నెయ్యి శాంపుల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామని ఆయన వెల్లడించారు. దీనిపై ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులు విచారిస్తున్నారని కమిషనర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యిలో 25,5 టన్నుల వివిధ రకాల నూనెతో పాటు 8.7 టన్నుల క్రీం వు ందని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యి తయారీ లో వాడేందుకు 1200 లీటర్ల పాం ఆయిల్, 600 లీటర్ల వనస్పతి, కృత్రిమ సువాసన కోసం ఆరు బాటిళ్ల రసాయనాలు, 30 కిలోల పిండి పదార్థం వుందని ఆయన వెల్లడించారు. కాగా కల్తీ నెయ్యి తయారీలో నేరగాళ్లు పక్కాగా వ్యవ హరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. నెయ్యి తయారీకి పాల నుంచి వచ్చిన వెన్న ముఖ్యం కాగా కల్తీ నెయ్యిలో దీనికి భిన్నంగా పాం ఆయిల్‌తో పాటు రసాయనాలు, కొద్దిపాటి పాల పౌడర్‌ను వాడుతున్నారని ఆయన తెలిపారు. ఇలా తయారు చేసిన కల్తీ నెయ్యి చూసేందుకు అసలైన నె య్యిలాగే వుండేలా చక్కగా ప్యాకింగ్ చేసి 100 గ్రాముల నుంచి ఒక్క కిలో వరకు డబ్బాలలో వుంచి అమ్ముతున్నారని ఆయన తెలిపారు. వీటికి ప్రీమియం నెయ్యి, ప్యూర్ నెయ్యి, పార్క్ ఫ్రెష్ నెయ్యి, నేచురల్ నెయ్యి అనే పేర్లను వాడుతున్నారని కమిషనర్ తెలిపారు. అయితే వీటిపై ఎ లాంటి లైసెన్స్ నంబర్, బ్యాచ్ నంబర్‌లు వుండడం లేదని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యిని ఎక్కువగా పూజ గదుల్లో వాడే దీపాలకు, రెస్టారె ంట్లకు, టిఫిన్ సెంటర్లకు, స్వీట్ షాపులకు, ఆయుర్వేద మందుల దుకాణాలకు, డెయిరీ షాపులు, స్టార్ హోటళ్లకు విక్రయిస్తున్నట్లు తేలిందని ఆయన తెలిపారు. కాగా కల్తీ నెయ్యి తయారీలో వాడుతున్న మిల్క్ క్రీంను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్నాటక, తమిళ నాడు రాష్ట్రాల నుంచి తయారీదారులు తెప్పిస్తున్నారని కమిషనర్ తెలిపారు. కల్తీ నెయ్యిని తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా అ మ్ముతున్నారని ఆయన వెల్లడించారు. కల్తీ నెయ్యి వాడడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం వుందని కమిషనర్ వెల్లడించారు. కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న వారు ఎప్పటి నుంచి వీటిని తయారు చేస్తున్నారు...? ఎంతమేరకు విక్రయించారు...? ఎక్కడెక్కడ అమ్మారు...? వీటిని వాడిన వారు ఎవరు...? అనే విషయాలపై సమాచారం సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యి తయారీదారులపై కఠినంగా వ్యవహరిస్తామని, వీటిని అమ్మేవారిని కూడా వదలబోమని ఆయన హెచ్చరించారు. ప్రజలు కూడా కల్తీ ఉత్పత్తుల విషయంలో జాగ్రత్తగా వు ండాలని, తక్కువ ధరకు లభించే వస్తువులను కొనవద్దని, నాణ్యమైన వాటినే కొనాలని సజ్జన్నర్ సూచించారు, కల్తీ ఆహార వస్తువులకు సంబం ధించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా వెంటనే 8712661212కు తెలపాలని ఆయన కోరారు. కల్తీ నెయ్యిని పట్టుకున్న పోలీసులను ఆ యన అభినందించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ స హా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఓటు తొలగిస్తే చేటు!

>> అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు.

దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వెచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బిఎల్ వోలు ఎవరి ఇంటికి వెళ్లలేదని, ఎన్నికల సంఘం నిర్లక్ష్యంగా ఓట్లు తొలగించిందని అన్నారు. పేదలు, వలస కూలీ ఓట్లనే ఎక్కువగా తొలగించారని, కేంద్రప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని తన జేబు సంస్థగా మార్చుకుందని విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు ఓటు హక్కు కల్పించాలని కోరారు. అకారణంగా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని, సిబిఐ, ఇడిలాగే ఇసి కూడా బిజెపికి జేబు సంస్థగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. మొత్తంగా రాష్ట్రంలో 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేసిందని, డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు వల్ల 2002 నాటి వివరాలు సరిగా లేవని మండిపడ్డారు. ఒకరు మందికి ఓటు తొలగించి..ప్రజాస్వామ్య దేశమంటే ఎలా? అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.

# స్కూళ్లు అధ్వాన్నం

>> విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులైన సురక్షి తమైన తాగునీరు, బాలబాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేకపోవడం, సైన్స్ లాబొరేటరీలు, లైబ్రరీలు, ఆట స్థలాలు మరియు క్రీడా సాగగ్రి అందుబాటులో లేకపోవడంపై విద్యార్థులు తమ సొంత చేతిరాతతో ఈ లేఖలను రాశారు. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక క్లాసులు ఖాళీగా ఉంటున్న విషయాన్ని కూడా వారు ఈ ఉత్తరాలలో ప్రస్తావించారు. విద్యార్థుల లేఖల నేపథ్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాసిన ఉత్తరాలకు సుమోటోగా స్పందించి, ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణించి విచారణ చేపట్టాలని ఆయా సంఘాల ప్రతినిధులు కోరారు. 20 వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ "పోస్ట్ కార్డ్ క్యాంపెయిన్" వివరాలను మంగళవారం ప్రెస్ క్లబ్‌లో మీడియాకు వెల్లడించారు. రవిప్రకాశ్ మేరెడ్డి (డయల్ యువర్ విలేజ్), యడ్మ మాధవరెడ్డి (వందేమాతరం ఫౌండేషన్). సాయికుమార్ (ఎమ్వీ ఫౌండేషన్), దిలీప్ రెడ్డి (పీపుల్స్ పల్స్) తదితరులు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాల విద్యార్థుల రాజ్యాంగ బద్ధమైన విద్యా హక్కును కాపాడుతూ, సర్కారు బడుల్లో వసతులు, విద్యాప్రమాణాలు పెరగాల్సి న అవసరాన్ని వారు నొక్కిచెప్పారు.

# 22ఎ ప్రకంపనలు!

>> ఉండవచ్చని మంత్రి అనుమానం వ్యక్తం చేయడం రాజకీయంగా కూడా ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకే కొందరు కావాలనే ఈ వ్యవ హారాన్ని తెరపైకి తెచ్చి ఉండవచ్చని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో కీలక బాధ్యతల్లో పనిచేసిన కొందరు అధికారుల పాత్ర కూడా ఉండొచ్చన్న అనుమానాలను వ్యక్తం చేశారు. 22ఏ జాబితాలో చోటుచేసుకున్న లోసుగులపై ప్రభుత్వం త్వరలో సమగ్ర విచారణ చేపడుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉన్నా, ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే ఉద్దేశంతో ఎవరైనా కుట్రలకు పాల్పడితే సహించబోమని తెలిపారు. మంత్రి ఇప్పటికే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించడంతో ప్రభుత్వం చేపట్టబోయే తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. 42 వేల ఎకరాల భూమి 22ఏ జాబితాలోకి చేరడానికి దారితీసిన పరిస్థితులు, సంబంధిత రికార్డుల్లో జరిగిన మార్పులు, నిర్ణయాల వెనుక ఉన్న అధికారుల పాత్ర వంటి అంశాలపై విచారణ జరిగితే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

**19-08-2026, బుధవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**శ్రావణం మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె**
తి.సప్తమి రా.7.23
న.స్వాతి ఉ.6.47
వ. మ.12.56-మ.2.42
దు.ఉ.11.45-మ.12.36
రాహు.మ.12.00-మ.1.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** ఇంటియందు శుభకార్యాలు దిగ్విజయంగా పూర్తి చేస్తారు. పుస్తక పఠనం యందు ఆసక్తిగా ఉంటారు. వస్త్ర లాభం.

**వృషభం :** పాలసీ రెన్యువల్ పట్ల అప్రమత్తత వహించండి. చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా పూర్తి చేస్తారు. సభలలో పాల్గొంటారు.

**మిథునం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. నూతన విద్యావకాశాలు లభిస్తాయి. కాంట్రాక్ట్‌లు దక్కుతాయి.

**కర్కాటకం :** ఇంటా బయటా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆప్తుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

**సింహం :** సంబంధాలు మెరుగుపడతాయి. మిత్రులతో ఏర్పడిన విభేదాలు తొలుగుతాయి. వాహన యోగం కలదు.

**కన్య :** అనుకోని అవకాశాలు దగ్గరకు వస్తాయి. దూరపు ప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. సోదరుల కలయిక.

**తుల :** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు. వృత్తి, ఉద్యోగాలు, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. వస్త్ర లాభం

**వృశ్చికం :** కుటుంబ పురోభివృద్ధి. సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి. స్పెక్యు లేషన్ లాభించదు.

**ధనుస్సు :** కార్యాలయంలో సెలవు కోసం మీరుచేసే యత్నాలు ఫలవంతం కాకపోవచ్చు ప్రయాణాలు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**మకరం :** మధ్యవర్తిత్వాలు చేయడం, మానుకోవడం చెప్పదగిన సూచన. శుభ ఆహ్వానాలు అందుకుంటారు. వాహన యోగం.

**కుంభం :** ప్రయాణాలలో వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. నూతన పదవీ ప్రాప్తి కలుగుతుంది. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆ పరిచయాలు మీకు అనుకూలంగా మారుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రతి నీటి చుక్కకూ ఓ లెక్క ఉండాలి

>> శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున "తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణే నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలి" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. సహజ ప్రవాహాలపై మాత్రమే ఆధారపడే జలాశయాల్లో నీటిని పొదుపుగా వినియోగించడం అవసరమేనని, కానీ నమ్మదగిన ప్రత్యామ్నాయ వనరుల నుంచి తిరిగి నింపుకునే అవకాశం ఉన్న చోట సాగునీటిని అనవసరంగా నిలిపివేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవవరం, పోచారం, రాజీవ్ సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టుల పరిధిలో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాగునీటి విడుదలకు అవకాశం ఉన్నచోట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ జలాలను కూడా సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీటి ప్రణాళికలు జలాశయంలోని వాస్తవ నిల్వలు, వస్తున్న ప్రవాహాలకు అనుగుణంగానే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు

# ఢిల్లీ వెళ్లిన సిఎం రేవంత్

>> వెళ్తారు. ఈనెల 21న లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను సీఎం సందర్శించనున్నారు. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఇపిఎల్ ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో సీఎం పాల్గొననున్నారు. 22న లండన్‌లో కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం సమావేశం కానున్నారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను సందర్శిస్తారు. ఆ తర్వాత సాయంత్రం లండన్ బిజినెస్ స్కూల్‌కువెళ్తారు. 23న లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరతారు.



ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్-హరిద్వార్ చిల్లా బ్యారేజ్ రోడ్డుపై మంగళవారం జరిగిన ప్రమాదంలో బిన్ నదిలో బోల్తా పడిన వాహనం

# 'అర్జున' అవార్డులు

>> తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17మంది క్రీడాకారులకుఅర్జున అవార్డులను ప్రకటించారు. ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సు ల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమై నాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి. అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది) తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్), ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్), నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్), విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్), లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ), సుర్జీత్, పూజ (కబడ్డీ), ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్, ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్), అరవింద్ సింగ్ (రోయింగ్), అఖిల్ షెయోరాన్ (షూటింగ్) అర్జున అవార్డు (జీవన సాఫల్యం), అరుమై నాయగం (ఫుట్‌బాల్). ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు) ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్) పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్) జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)వీరేందర్ కుమార్ (రెజ్లింగ్) రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే ఈ పురస్కారాలు వరించాయి.

# రూ.230కే సిమెంట్ బస్తా

>> చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా (హైదరాబాద్ మినహా) మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.

# ఈ సారి 117 మావే

>> తాటిచెట్లు పెంచాలని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని పెంచితే కల్తీ లేని కల్లు వస్తుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్ల వెంబడి నాటాలన్నారు. 'ఇది బహుజనుల తెలంగాణ. సామాజిక న్యాయం, జీవించడానికి స్వేచ్ఛ ఇందిరమ్మ పాలనలో ఉందని నిరూపించాం అని చెప్పారు.'ట్యాంక్ బండ్ పైన ఉన్న పర్యాటక కార్యాలయాన్ని కూల్చివేసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని సూచించాను' అని చెప్పారు.'పర్యాటకులు, సందర్శకులు ట్యాంక్ బండ్ పైకి వచ్చినప్పుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ దర్శనం జరిగి, ఆయన స్ఫూర్తి వారిలో నిండాలని కోరుకున్నాను.బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఆయన తన కులం, కుటుంబం కోసం మాత్రమే పనిచేయలేదు.బహుజనులతో కలిసి దండయాత్ర చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగురవేశారు. ఆయన స్ఫూర్తి ఎప్పటికీ తెలంగాణ ప్రజలకు ఉండాలి.మహారాష్ట్రలో శివాజీ విగ్రహానికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో, తెలంగాణలో బహుజనులు కూడా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి అంతే ప్రాధాన్యత ఇస్తారు.బ్రిటిష్ లైబ్రరీలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విశేషాలు ఉన్నాయి. అక్కడి నుంచే మనం ఆయన చరిత్రను తెలుసుకున్నాం. బహుజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు కాబట్టే ఆయనకు ఆ కీర్తి, గౌరవం దక్కింది' అని చెప్పారు. 'వందల ఏళ్లు గడిచినా ఆయనను తలుచుకుంటున్నామంటే ఆయన పోరాటం ఎంత అద్భుతమైనదో అర్థం చేసుకోవచ్చు. ఈ అద్భుతమైన విగ్రహాన్ని కాపాడుకునే బాధ్యత గౌడ సోదరులదే. నిత్యం స్ఫూర్తిని నింపేలా జాగ్రత్తగా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. విగ్రహం దగ్గర మంచి వెలుగుల ఏర్పాట్లతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు ఇస్తున్నాను. తెలంగాణ అమరవీరుల స్థూపం స్థాయిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ప్రాధాన్యత ఉంటుంది. పండుగ సాయన్న పోరాటం, పౌరుషం పాలమూరు జిల్లాలో అందరికీ తెలుసు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది' అని చెప్పారు. ఈ ప్రభుత్వం నాది కాదు. సామాజిక న్యాయం, సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం. ఈ ప్రభుత్వం అందరిది. బాలా గౌడ్, మల్లికార్జున్ గౌడ్ లాంటి నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఎదిగారు. మహేష్ గౌడ్ గాంధీభవన్‌లో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నప్పుడు నేను, భట్టి విక్రమార్క రాష్ట్రం అంతా పాదయాత్ర చేశాం' అని గుర్తు చేశారు. అర్హులైన నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా అందరికీ పింఛన్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాను. ప్రభుత్వ పొలాల్లో ఈత, తాటి చెట్లు నాటేలా చూస్తాం. కాలువ గట్లపైన కూడా ఈత, తాటి చెట్లు నాటాలి' అని చెప్పారు.'నల్గొండ జిల్లాలో గౌడలు రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థుల కోసం ఎన్ని కోట్లైనా కేటాయిస్తాం. నాణ్యమైన విద్యతో పాటు భోజనం కూడా ఇస్తాం. గతంలో సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టలేదు. మా ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యంతో భోజనం పెడుతున్నాం. నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నాం. పాలు, రాగిజావ పిల్లలకు ఇస్తున్నాం.మన పిల్లలు రాజ్యాలు ఏలాలంటే చదువు ఒక్కటే పరిష్కారం. కష్టమైనా, నష్టమైనా పిల్లలను బడికి పంపించాలి. వాళ్లను చదివించే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. ఏటీసీల్లో చేరేవాళ్లకు నెలకు రెండు వేల రూపాయల ఉపకార వేతనం ఇస్తున్నాం.గౌడ సోదరులకు యాభై వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశాం. ప్రమాదవశాత్తు గౌడ సోదరులు చనిపోతే ఐదు లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తున్నాం. ఈ ప్రభుత్వం మనది అని చెప్పండి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఆయన కొడుకు కేటీఆర్‌ను కార్యనిర్వాహక అధ్యక్షుడిని చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే మహేష్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని చేశాం. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే హరీష్ రావు, కేటీఆర్ ముఖ్యమంత్రులయ్యారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే పొన్నం, వాకిటి, సీతక్క, కొండా సురేఖ మంత్రులయ్యారు.

తెలంగాణ ప్రభుత్వం
కల్వకుర్తి మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, నాగర్‌కర్నూల్ జిల్లా
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండర్ ప్రకటన నెం : E1/KLKY/టెండర్ ప్రకటన-05/2026-27, తేది: 18.08.2026

కల్వకుర్తి మునిసిపాలిటీ కమిషనర్ వారి ఆదేశాల ప్రకారం, ఆ మునిసిపాలిటీ పనులు ప్రత్యేక అభివృద్ధి నిధుల క్రింద వివిధ పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై టెండర్‌లు పిలవబడుతున్నవి. పనుల యొక్క పేరు: 2025-26 ప్రత్యేక అభివృద్ధి నిధి క్రింద నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మునిసిపాలిటీ వివిధ స్థానాలలో హై మాస్ట్ దీపాల స్థాపన. 1. మొత్తం పనులు: 10నం.లు. 2. అంచనా విలువ: రూ.21.00 లక్షలు. 3. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ, సమయం: 19.08.2026 ఉ.11.30గం.వర్ధ. 4. బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 21.08.2026 సా.5.00గం. వద్ద. 5. బిడ్ దాఖలు యొక్క తెరమ తేదీ, సమయం: 21.08.2026 సా.05.01గం. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా "www.eprocurement.gov.in" వద్ద చూడవచ్చును. బిడ్స్ ఆహ్వానించు అధికారి: కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నం. 9110540243, 7330690590.

సం/-. కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ.

DIPR.NO. 8135-PP/CL/ADVT/1/2026-27, తేది: 18.08.2026

AU SMALL FINANCE BANK
A SCHEDULED COMMERCIAL BANK

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా)
(CIN:L36911RJ1996PLC011381)

2002 సెక్యూరిటైజేషన్ చట్టంలోని సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు

రుణ ఖాతా నిరర్థక ఆస్తి (NPA)గా మారినందున, "ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు చట్టం 2002"లోని సెక్షన్ 13(2) కింద అధీకృత అధికారి, పట్టికలో ఇవ్వబడిన విధంగా రుణగ్రహీతలు/సహరుణగ్రహీతలు/తాకట్టుదారులు/హామీదారులకు (వీరందరినీ కలిపి "రుణగ్రహీతలు"గా సూచిస్తారు) 60 రోజుల డిమాండ్ నోటీసు జారీ చేశారు. నోటీసు ప్రకారం, రుణగ్రహీతలు 60 రోజులలోపు పూర్తి మొత్తాన్ని జమ చేయకపోతే, క్రింద ఇవ్వబడిన విధంగా తాకట్టు ఆస్తులు/హామీ ఆస్తుల వేలం ద్వారా ఆ మొత్తం వసూలు చేయబడుతుంది. అందువల్ల, రుణగ్రహీతలైన మీరు డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు భవిష్యత్ వడ్డీ మరియు ఖర్చులతో పాటు పూర్తి రుణ మొత్తాన్ని జమ చేయాలని తెలియజేయడమైనది. లేకపోతే, సదరు చట్టంలోని 13(4) మరియు 14 నిబంధనల ప్రకారం, అధీకృత అధికారి క్రింద ఇవ్వబడిన విధంగా తాకట్టు ఆస్తులు/హామీ ఆస్తులను అమ్మకం కోసం స్వాధీనం చేసుకోవడానికి స్వేచ్ఛగా ఉంటారు.
రుణగ్రహీతలు గమనించవలసినది ఏమనగా, ఈ నోటీసు అందిన తర్వాత, 2002 చట్టంలోని సెక్షన్ 13(13) నిబంధనల ప్రకారం, హామీదారు రుణదాత యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, హామీగా ఉంచిన ఆస్తులలో దేనినీ అమ్మకం, లీజు లేదా మరే ఇతర మార్గంలోనైనా బదిలీ చేయడం మీకు నిషేధించబడింది మరియు నిరోధించబడింది.
2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ చట్టంలోని సెక్షన్ 13(8) మరియు రూల్ 3(5) ప్రకారం, వేలం నోటీసు ప్రచురణకు ముందు క్రింద పేర్కొన్న విధంగా పూర్తి బకాయిలను చెల్లించిన మీదట రుణగ్రహీతలు తమ హామీ ఆస్తిని విడిపించుకోవడానికి అర్హులు అని రుణగ్రహీతల దృష్టికి తీసుకురాబడమైనది; ఆ తర్వాత వేలం ఉనికిలో ఉండదు.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు పేరు/రుణ ఖాతా నం. | సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం |
|---|---|
| (Loan Ac/ No.) 9001220337712766, శ్రీ అదుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి S/o శ్రీ నర్సింహా రెడ్డి అదుదొడ్ల (రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు), Ms. గెలాఖా మాధవి D/o Mr. గెలాఖా సత్తిరెడ్డి (హామీదారు), Mr. పెరుగు భరత్ S/o Mr. పెరుగు దానరెడ్డి (హామీదారు). | 13/8/2026 రూ.53,81,565/- (యాభై మూడు లక్షల ఎనభై ఒక్క వేయి ఐదు వందల అరవై ఐదు రూపాయలు మాత్రమే) 12-ఆగస్టు-26 నాటికి |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ
తాకట్టు పెట్టిన స్థిరాస్తి వివరాలు:- తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ (గతంలో పెద్దఅంబర్‌పేట్ నగరపంచాయతీ పరిధిలో) పరిధిలోని ఉన్న హయత్‌నగర్ రెవెన్యూ మండలం, కుత్బుల్లాపూర్ రెవెన్యూ గ్రామంలో గల, సర్వే నెం. 2, 3 మరియు 4 భాగాలలో వేసిన లేఅవుట్‌లో భాగంగా ఉన్న, 1500 చదరపు అడుగుల బిల్టప్ ఏరియా వరుస ప్రాంతాలు మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో సహా కలిగిన "శ్రీ సాయి ఎన్‌క్లేవ్"లోని ఐదవ అంతస్తులో గల ఫ్లాట్ నెం. 502 నివాస ఆస్తి యొక్క మొత్తం అదంతా, మరియు 630 చదరపు గజాలలో 63 చదరపు గజాలు లేదా 52.66 చదరపు మీటర్ల విస్తీర్ణం గల భూమి యొక్క దామాషా అవిభక్త వాటా. యజమాని: శ్రీ అదుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి.
ఫ్లాట్ నెం. 502 యొక్క సరిహద్దులు:
తూర్పు: కారిడార్, మెట్లదారి-లిఫ్ట్, పడమర: బహిరంగం, ఉత్తరం: బహిరంగం, దక్షిణం : బహిరంగం
మొత్తం భూమి యొక్క సరిహద్దులు:
తూర్పు: పొరుగువారి భూమి, పడమర: 30' అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం. 9, దక్షిణం : ప్లాట్ నెం. 3

| | |
|---|---|
| (Loan Ac/ No.) 2306261253344128, M/S న్యూ హై పవర్ బ్యాటరీస్ దాని ప్రొప్రైటర్ శ్రీ అదుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి ద్వారా (రుణగ్రహీత (శ్రీ అదుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి S/o శ్రీ నర్సింహా రెడ్డి అదుదొడ్ల (తనఖాదారు), Ms. గెలాఖా మాధవి D/o Mr. గెలాఖా సత్తిరెడ్డి (హామీదారు) Mr. పెరుగు భరత్ S/o Mr. పెరుగు దానారెడ్డి (హామీదారు) | 13/8/2026 రూ.29,29,236/- (ఇరవై తొమ్మిది లక్షల ఇరవై తొమ్మిది వేల రెండు వందల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే) 12-ఆగస్టు-26 నాటికి |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ
హైపొథికేషన్ పట్టిక
ప్రస్తుత మరియు భవిష్యత్తుకు సంబంధించిన ఇన్వెంటరీ, బుక్‌డెట్స్ మరియు చర స్థిరాస్తులపై హైపొథికేషన్ ద్వారా మొదటి మరియు ప్రత్యేకమైన ఛార్జ్.
తాకట్టు పెట్టిన స్థిరాస్తి వివరాలు:-
తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ (గతంలో పెద్దఅంబర్‌పేట్ నగరపంచాయతీ పరిధిలోనిది) పరిధిలోని హయత్‌నగర్ రెవెన్యూ మండలం, కుత్బుల్లాపూర్ రెవెన్యూ గ్రామంలో ఉన్న, సర్వే నెం. 2, 3 మరియు 4 భాగాలలో వేసిన లేఅవుట్‌లో భాగంగా ఉన్న, 1500 చదరపు అడుగుల బిల్టప్ ఏరియా మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియా గల "శ్రీ సాయి ఎన్‌క్లేవ్"లోని ఐదవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెం. 502 నివాస ఆస్తి యొక్క మొత్తం అదంతా, దానితో పాటు 630 చదరపు గజాలలో 63 చదరపు గజాలు లేదా 52.66 చదరపు మీటర్ల భూమి యొక్క దామాషా అవిభక్త వాటా.
యజమాని: శ్రీ అదుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి. ఫ్లాట్ నెం. 502 యొక్క సరిహద్దులు: - తూర్పు: కారిడార్, మెట్లదారి & లిఫ్ట్, పడమర: ఆరుబయట, ఉత్తరం: బహిరంగం, దక్షిణం : బహిరంగం.
మొత్తం భూమి యొక్క సరిహద్దులు: తూర్పు: పొరుగువారి భూమి, పడమర: 30' అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం. 9, దక్షిణం : ప్లాట్ నెం. 3

| | |
|---|---|
| (Loan Ac/ No.) 9001220349524262, Mr. రాహుల్ పఠారే S/o. Mr. నాథ గజానంద్ పఠారే (రుణగ్రహీత/తాకట్టుదారు) | 12/8/2026 రూ.1,93,57,705/- (ఒక కోటి తొంభై మూడు లక్షల యాభై ఏడు వేల ఏడు వందల ఐదు రూపాయలు మాత్రమే) 12-ఆగస్టు-26 నాటికి |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ
తాకట్టు పెట్టబడిన స్థిరాస్తి వివరాల పట్టిక:
శ్రీ రాహుల్ పఠారే గారి యాజమాన్యంలోని ఆస్తి వివరాలు: తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, అల్వాల్ మండలం, మల్కాజిగిరి సర్కిల్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యాప్రాల్ గ్రామంలో ఉన్న "G.K.'s Alam Villas" ప్రాజెక్ట్‌లోని సర్వే నంబర్ 126లో ఉన్న ఆస్తి. ఇది 222.22 చదరపు గజాల విస్తీర్ణం మరియు 3296 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణం కలిగిన పాక్షికంగా పూర్తయిన స్వతంత్ర విల్లా నం.02 మరియు దానిపై ప్రస్తుతం ఉన్న లేదా భవిష్యత్తులో నిర్మించబడే నిర్మాణాలు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పరిధి మల్కాజిగిరి సబ్-రిజిస్ట్రార్ మరియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోకి వస్తుంది. సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి:
తూర్పు: రోడ్డు, పడమర: పార్క్, ఉత్తరం: విల్లా నం. 01, దక్షిణం : విల్లా నం. 03

తేది: 18/08/2026 ప్రదేశం : తెలంగాణ అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### మెటాకు కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పిల్లలపై అభ్యంతరకర, లైంగిక వీడియోలు విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే మెటాకు సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ ఉండదని కేంద్రం హెచ్చరించింది. ఈ విషయంలో ఎవరికైనా ఇదే రూల్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. సీఎస్ఏఎం అంశాన్ని మెటా తీవ్రంగా పరిగణిస్తుందని, తన ప్లాట్‌ఫామ్‌పై అక్రమ, చట్టవ్యతిరేక కంటెంట్‌ను నియంత్రించడానికి కృషి చేస్తుందని ప్రభుత్వం తెలిపింది. అలాగే, ఇండియాలోని భిన్న భాషలు, సంస్కృతికి అనుగుణంగా కంటెంట్ మోడరేషన్ చేయాలని మెటాకు సూచించింది. మెటా ప్లాట్‌ఫామ్‌లపై కంటెంట్‌ను అభివృద్ధి చేయడం, పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను నియంత్రించడంపై కేంద్రానికి, మెటాకు మధ్య చర్చలు జరుగుతున్నట్లు సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున మెటాకు పలు సూచనలు అందాయి. సీఎస్ఏఎం కంటెంట్‌ను అరికట్టే విషయంలో మెటా బాధ్యతగా వ్యవహరిస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. చట్ట వ్యతిరేక, అభ్యంతరకర కంటెంట్‌ను గుర్తించడానికి మెటా మరిన్ని జాగ్రత్తలు తీసుకోనుంది. ఒకవేళ సీఎస్ఏఎం విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే వారికి అరెస్టు నుంచి రక్షణ కల్పించే సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ కోల్పోతారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో వస్తున్న ఏ కంటెంట్‌పై కూడా కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ కంటెంట్ ఏవిధంగా రూపొందించిందా లేదా తెలుసుకు నేందుకు వీలుగా ఆ ఫొటోలు, వీడియోలపై లేబుల్ ఉండేలా చూడాలని ఆదేశించింది.

## ఏసిబికి పట్టుబడిన బల్దియా టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** బల్దియాలో మరో అవినీతి అధికారి ఎసిబికి పట్టుబడింది. భవన నిర్మాణ అనుమతి కోసం 20 వేల రూపాయలు లంచం తీసుకుంటూ సంతోష్‌నగర్ సర్కిల్‌లోని టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సిహెచ్ ప్రభావతి ఎసిబికి దొరికిపోయింది. వివరాలు ఇలావున్నాయి. సంతోష్‌నగర్ లో వుండే ఓ వ్యక్తి తన భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేయగా ఇందుకు 40 వేల రూపాయలు లంచం ఇస్తేనే ఫైల్‌పై సంతకం పెడతానని టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి చెప్పింది. దీంతో బాధితుడు మొదటి విడతగా 20 వేల రూపాయలు ఇస్తానని చెప్పగా అందు కు ఆమె అంగీకరించింది. అయితే బాధితుడు ఇదే విషయాన్ని ఎసిబి అధికారులకు సమాచారం అందించాడు. దీని తరువా త మంగళవారం ఉదయం ఎసిబి అధికారులు బాధితుడికి కలిసి ప్రభావతిని పట్టుకునేందుకు పథకం వేశారు. ఇందులో భాగంగా 20 వేల రూపాయలపై రంగు పల్లి, వాటిని బాధితుడి చేత ప్రభావతికి ఆమె పనిచేస్తున్న కార్యాలయంలో ఇచ్చేలా చేశారు. అనంతరం ఎసిబి అధికారుల ఆదేశాల మేరకు బాధితుడు ఆమెను అందజేసిన 20 వేల రూపాయలను ప్రభావతికి ఇచ్చారు. ఈ డబ్బులను ప్రభావతి తీసుకుని తన టేబుల్ సొరుగులో దాచగానే సమీపంలోనే వున్న ఎసిబి అధికారులు ఒక్కసారిగా దాడిచేసి ప్రభావతిని అదుపులోకి తీసుకున్నారు. అనంత రం ఆమె వద్ద వున్న 20 వేల రూపాయల లంచం సొమ్మును జప్తు చేశారు. దీని తరువాత ఆమెను అరెస్టు చేసి కార్యాలయంలో సోదాలు నిర్వహించి పలు పత్రాలను ఎసిబి అధికారులు జప్తు చేశారు. దీని తరువాత ఆమెను కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండుకు తరలించారు. కాగా సర్కారీ విభాగాల్లో లంచావతారుల గురించి 1064కు ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి చారుసిన్హా కోరారు.



బల్దియా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి

# సర్కారుపై సంక్షేమ భారం

### పింఛన్లకు రూ.7,309.49 కోట్లు ఖర్చు

### రూ.54,815.34 కోట్లకు చేరిన రెవెన్యూ వ్యయం

### రెవెన్యూ ఆదాయం రూ.42,525.96 కోట్లు

### తొలి క్వార్టర్‌లో ఆర్థిక అంశాలపై కాగ్ నివేదిక

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వంపై సంక్షేమ భారం పెరుగుతోంది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లోనే తెలంగాణ తన వార్షిక పింఛను కేటాయింపులో 49.6 శాతాన్ని ఖర్చు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 2026-27 మొదటి త్రైమాసికంలో తెలంగాణ పింఛను వ్యయం దాదాపు 60 శాతం పెరిగా, సబ్సిడీ వ్యయం 17 శాతం పెరిగిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్ నుండి జూన్ మధ్య తెలంగాణ పెన్షన్లపై రూ.7,309.49 కోట్లు ఖర్చు చేసింది. ఇది 2025-26లో ఇదే కాలంలో ఖర్చు చేసిన రూ. 4,572.91 కోట్లు కన్నా ఎక్కువ. సబ్సిడీ వ్యయం రూ.5,932.92 కోట్లు నుండి రూ.6,956.14 కోట్లకు పెరుగుదల నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వం 2026-27 సంవత్సరానికిగాను వార్షిక అం చనా బడ్జెట్‌లో పింఛన్ల కోసం రూ. 14,736.56 కోట్లు కేటాయించింది. ఇదే సమయంలో సబ్సిడీ వ్యయం కూడా ముందే ఎక్కువగా చోటు చేసుకుంది. జూన్ నాటికి ఖర్చు చేసిన రూ.6,956.14 కోట్లుతో వార్షిక కేటాయింపు అయిన రూ. 18,105.16 కోట్లలో 38.42 శాతంగా ఉంది. ఇక రెవెన్యూ వ్యయానికి సంబంధించి తొలి క్వార్టర్‌లో రూ.54,815.34 కోట్లు నమోదు కాగా, గత ఏడాది ఇదే కాలంలో రూ. 47,804.65 కోట్లుగా ఉండి భారీగా 7 వేల కోట్లకు పెరిగింది. రెవెన్యూ వసూళ్లకు సంబంధించి రూ.42,525.96 కోట్లుగా నమోదయ్యాయి. దీంతో గత ఏడాది ఇదే కాలంలో రూ.10,582 కోట్లుగా ఉన్న రెవె న్యూ లోటు జూన్ నెలాఖరు నాటికి రూ.12,289.38 కోట్ల కు చేరింది. దీంతోపాటు గతేడాది రూ. 20,268.09 కోట్లుగా ఉన్న ద్రవ్యలోటు రూ. 21,919.24 కోట్లుగా నమోదైంది. మరోవైపు మూల ధన వ్యయం కూడా పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.4,755.31 కోట్ల నుండి ఏప్రిల్-జూన్ కాలంలో ఇది రూ.6,579.44 కోట్లకు పెరుగుదల చోటు చేసుకుంది.

## పోలీస్ కస్టడీకి మెడికో ప్రియాంక హత్య కేసు నిందితులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18, ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లో మెడికో విద్యార్థిని ప్రియాంక హత్య కేసులో నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, నిందితుల పాత్ర, పరస్పర సంబంధాలు,సంఘటన లో ఉపయోగించిన వాహనం తదితర అంశాలపై పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు. నిందితుల నుంచి కీలక సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కేసులో మరెవరైనా ప్రమేయముందా అనే కోణంలోనూ విచారణ సాగుతోంది. దర్యాప్తులో వెలుగులోకి వచ్చేఅంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించినట్లు సమాచారం. ప్రియాంక కుటుంబ సభ్యులు మాత్రం ఘటనపై సమగ్రదర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# మేం అధికారంలోకొస్తే ప్రతి కుటుంబానికి ఎకరం ఇస్తాం

### మంత్రివర్గంలో ముగ్గురే బిసిలు ఉండటం సామాజిక న్యాయమా? : కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 18:** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే భూ లక్ష్మి పథకం కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచ ప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్య మంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన ట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు.



రేవంత్ రెడ్డి మేకవన్నె పులి లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శిం చారు. కేబినెట్‌తోపాటు ప్రభుత్వ సలహా దారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణా లకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడు స్తోందని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రి వర్గంలో కేవలం ముగ్గురే బిసిలు ఉండటం సామాజిక న్యాయమా? అని కవిత ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషనర్లలో ఒక్క బిసికి కూడా చోటు కల్పించలేదని, మంత్రుల కుటుంబ సభ్యులు, రాజ్యాంగేతర శక్తులు రాష్ట్ర పాలనను శాసిస్తున్నాయని కవిత విమర్శించారు. 22ఎను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నేతలు భూదోపిడీకి పాల్పడుతు న్నారని, ఎస్సిలు, బిసిల నుంచి 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం లాక్కుంటోందని మండిపడ్డారు. ధరణి, భూభారతి రికార్డులను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని కవిత ధ్వజమెత్తారు.

# భారత్ ఎన్నికల ప్రక్రియ భేష్

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కితాబు

### 'ట్రూత్' పోస్టులో సిఇసికి ప్రశంసలు

**వాషింగ్టన్, ఆగస్టు 18:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో జరిగిన ఓ సంభాషణను ప్రస్తావించిన ట్రంప్ అమెరికాలో తప్పనిసరి ఫొటో గుర్తింపు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారని ఆయన ప్రశ్నించినట్లు తెలి పారు. భారత్‌లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్ని కల్లో సుమారు 64.6 కోట్ల మంది ఓటర్లు పా ల్గొన్నారని వారిలో 1 శాతం కంటే తక్కువ మంది మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో అమెరికాలో కూడా ఓటర్ గుర్తింపు నిబంధనలను మరింత కఠినతరం చేయాలని పిలుపునిస్తూ సేవ్ యాక్ట్‌ను కాంగ్రెస్ ఆమోదించాలని కోరారు. ఈ మేరకు ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్టు చేశారు. భారత్లో ప్రతి ఓటరు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు పత్రాన్ని చూపించాల్సి ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో కూడా ఓటర్ల గుర్తింపు, పౌరసత్వానికి సంబంధించిన నిబంధనలను మరింత బలోపేతం చేయాల్సి న అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సేవ్‌యాక్ట్ ద్వారా ఫెడరల్ ఎన్నికల్లో ఓ టరుగా నమోదు చేసుకునే సమ యంలో చెల్లు బాటు అయ్యే గుర్తింపు పత్రంతో పాటు అమెరికా




పౌరసత్వానికి సంబంధించిన ఆ ధారాలను సమ ర్పించడం తప్పని సరి చేసే ప్రతిపా దనలు ఉన్నాయి. పోస్టల్ ఓటింగ్ను కొన్ని నిర్దిష్ట పరిస్థితులకు మాత్రమే పరిమితం చేయడం, ఫెడరల్ ఓటర్ జాబితాల నుంచి అమెరికా పౌరులు కాని వ్యక్తుల పేర్లను తొలగించేందుకు రాష్ట్రాలను ఆదేశించే నిబంధనలు కూడా ఈ చట్టంలో ఉన్నట్లు వైట్ హౌస్ తెలిపింది.


## AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

(ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా)

(CIN:L36911RJ1996PLC011381)

**2002 సెక్యూరిటైజేషన్ చట్టంలోని సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు**

రుణ ఖాతా నిరర్థక ఆస్తి (NPA)గా మారినందున, "ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు చట్టం 2002"లోని సెక్షన్ 13(2) కింద అధీకృత అధికారి, పట్టికలో ఇవ్వబడిన విధంగా రుణగ్రహీతలు/సహరుణగ్రహీతలు/తాకట్టుదారులు/హామీదారులకు (వీరందరినీ కలిపి "రుణగ్రహీతలు"గా సూచిస్తారు) 60 రోజుల డిమాండ్ నోటీసు జారీ చేశారు. నోటీసు ప్రకారం, రుణగ్రహీతలు 60 రోజులలోపు పూర్తి మొత్తాన్ని జమ చేయకపోతే, క్రింద ఇవ్వబడిన విధంగా తాకట్టు ఆస్తులు/హామీ ఆస్తుల వేలం ద్వారా ఆ మొత్తం వసూలు చేయబడుతుంది. అందువల్ల, రుణగ్రహీతలైన మీరు డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు భవిష్యత్ వడ్డీ మరియు ఖర్చులతో పాటు పూర్తి రుణ మొత్తాన్ని జమ చేయాలని తెలియజేయడమైనది. లేకపోతే, సదరు చట్టంలోని 13(4) మరియు 14 నిబంధనల ప్రకారం, అధీకృత అధికారి క్రింద ఇవ్వబడిన విధంగా తాకట్టు ఆస్తులు/హామీ ఆస్తులను అమ్మకం కోసం స్వాధీనం చేసుకోవడానికి స్వేచ్ఛగా ఉంటారు.

రుణగ్రహీతలు గమనించవలసినది ఏమనగా, ఈ నోటీసు అందిన తర్వాత, 2002 చట్టంలోని సెక్షన్ 13(13) నిబంధనల ప్రకారం, హామీదారు రుణదాత యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, హామీగా ఉంచిన ఆస్తులలో దేనినీ అమ్మకం, లీజు లేదా మరే ఇతర మార్గంలోనైనా బదిలీ చేయడం మీకు నిషేధించబడింది మరియు నిరోధించబడింది.

2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ చట్టంలోని సెక్షన్ 13(8) మరియు రూల్ 3(5) ప్రకారం, వేలం నోటీసు ప్రచురణకు ముందు క్రింద పేర్కొన్న విధంగా పూర్తి బకాయిలను చెల్లించిన మీదట రుణగ్రహీతలు తమ హామీ ఆస్తిని విడిపించుకోవడానికి అర్హులు అని రుణగ్రహీతల దృష్టికి తీసుకురాడమైనది; ఆ తర్వాత వేలం ఉనికిలో ఉండదు.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు పేరు/రుణ ఖాతా నం. | సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు తేదీ మరియు మొత్తం |
| --- | --- |
| (Loan Ac/ No.) 9001220337712766, శ్రీ అడుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి S/o శ్రీ నర్సింహా రెడ్డి అడుదొడ్ల (రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు), Ms. గెలాఖా మాధవి D/o Mr. గెలాఖా సత్తిరెడ్డి (హామీదారు), Mr. పెరుగు భరత్ S/o Mr. పెరుగు దాసరెడ్డి (హామీదారు). | 13/8/2026 రూ.53,81,565/- (యాభై మూడు లక్షల ఎనభై ఒక్క వేయి ఐదు వందల అరవై ఐదు రూపాయలు మాత్రమే) 12-ఆగస్టు-26 నాటికి |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ

తాకట్టు పెట్టిన స్థిరాస్తి వివరాలు:- తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ (గతంలో పెద్దఅంబర్‌పేట్ నగరపంచాయతీ పరిధిలో) పరిధిలోని ఉన్న హయత్‌నగర్ రెవెన్యూ మండలం, కాల్వంచ రెవెన్యూ గ్రామంలో గల, సర్వే నెం. 2, 3 మరియు 4 భాగాలలో వేసిన లేఅవుట్‌లో భాగంగా ఉన్న, 1500 చదరపు అడుగుల బిల్టప్ ఏరియా వరుస ప్రాంతాలు మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో సహా కలిగిన "శ్రీ సాయి ఎన్‌క్లేవ్"లోని ఐదవ అంతస్తులో గల ఫ్లాట్ నెం. 502 నివాస ఆస్తి యొక్క మొత్తం అదంతా, మరియు 630 చదరపు గజాలలో 63 చదరపు గజాలు లేదా 52.66 చదరపు మీటర్ల విస్తీర్ణం గల భూమి యొక్క దామాషా అవిభక్త వాటా. యజమాని: శ్రీ అడుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి.

ఫ్లాట్ నెం. 502 యొక్క సరిహద్దులు:

**తూర్పు: కారిడార్, మెట్లదారి-లిఫ్ట్, పడమర: బహిరంగం, ఉత్తరం: బహిరంగం, దక్షిణం : బహిరంగం**

మొత్తం భూమి యొక్క సరిహద్దులు:

**తూర్పు: పొరుగువారి భూమి, పడమర: 30' అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ఫ్లాట్ నెం. 9, దక్షిణం : ఫ్లాట్ నెం. 3**

| | |
| --- | --- |
| (Loan Ac/ No.) 2306261253344128, M/S న్యూ హై పవర్ బ్యాటరీస్ దాని ప్రొప్రైటర్ శ్రీ అడుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి ద్వారా (రుణగ్రహీత (శ్రీ అడుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి S/o శ్రీ నర్సింహా రెడ్డి అడుదొడ్ల (తనఖాదారు), Ms. గెలాఖా మాధవి D/o Mr. గెలాఖా సత్తిరెడ్డి (హామీదారు) Mr. పెరుగు భరత్ S/o Mr. పెరుగు దానారెడ్డి (హామీదారు) | 13/8/2026 రూ.29,29,236/- (ఇరవై తొమ్మిది లక్షల ఇరవై తొమ్మిది వేల రెండు వందల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే) 12-ఆగస్టు-26 నాటికి |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ

హైపోథికేషన్ పట్టిక

ప్రస్తుత మరియు భవిష్యత్తుకు సంబంధించిన ఇన్‌వెంటరీ, బుక్‌డెట్స్ మరియు చర స్థిరాస్తులపై హైపోథికేషన్ ద్వారా మొదటి మరియు ప్రత్యేకమైన చార్జ్.

తాకట్టు పెట్టిన స్థిరాస్తి వివరాలు:-

తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ (గతంలో పెద్దఅంబర్‌పేట్ నగరపంచాయతీ పరిధిలోనిది) పరిధిలోని హయత్‌నగర్ రెవెన్యూ మండలం, కాల్వంచ రెవెన్యూ గ్రామంలో ఉన్న, సర్వే నెం. 2, 3 మరియు 4 భాగాలలో వేసిన లేఅవుట్‌లో భాగంగా ఉన్న, 1500 చదరపు అడుగుల బిల్టప్ ఏరియా మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియా గల "శ్రీ సాయి ఎన్‌క్లేవ్"లోని ఐదవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెం. 502 నివాస ఆస్తి యొక్క మొత్తం అదంతా, దానితో పాటు 630 చదరపు గజాలలో 63 చదరపు గజాలు లేదా 52.66 చదరపు మీటర్ల భూమి యొక్క దామాషా అవిభక్త వాటా.

యజమాని: శ్రీ అడుదొడ్ల రాజ శేఖర్ రెడ్డి. ఫ్లాట్ నెం. 502 యొక్క సరిహద్దులు: - తూర్పు: కారిడార్, మెట్లదారి & లిఫ్ట్, పడమర: ఆరుబయట, ఉత్తరం: బహిరంగం, దక్షిణం : బహిరంగం.

మొత్తం భూమి యొక్క సరిహద్దులు: తూర్పు: పొరుగువారి భూమి, పడమర: 30' అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ఫ్లాట్ నెం. 9, దక్షిణం : ఫ్లాట్ నెం. 3

| | |
| --- | --- |
| (Loan Ac/ No.) 9001220349524262, Mr. రాహుల్ పఠారే S/o. Mr. నాథ గజానంద్ పఠారే (రుణగ్రహీత/తాకట్టుదారు) | 12/8/2026 రూ.1,93,57,705/- (ఒక కోటి తొంభై మూడు లక్షల యాభై ఏడు వేల ఏడు వందల ఐదు రూపాయలు మాత్రమే) 12-ఆగస్టు-26 నాటికి |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ

తాకట్టు పెట్టబడిన స్థిరాస్తి వివరాల పట్టిక:

శ్రీ రాహుల్ పఠారే గారి యాజమాన్యంలోని ఆస్తి వివరాలు: తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, అల్వాల్ మండలం, మల్కాజిగిరి సర్కిల్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యాప్రాల్ గ్రామంలో ఉన్న "G.K.'s Alam Villas" ప్రాజెక్ట్‌లోని సర్వే నంబర్ 126లో ఉన్న ఆస్తి. ఇది 222.22 చదరపు గజాల విస్తీర్ణం మరియు 3296 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణం కలిగిన పాక్షికంగా పూర్తయిన స్వతంత్ర విల్లా నం.02 మరియు దానిపై ప్రస్తుతం ఉన్న లేదా భవిష్యత్తులో నిర్మించబడే నిర్మాణాలు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పరిధి మల్కాజిగిరి సబ్-రిజిస్ట్రార్ మరియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోకి వస్తుంది. సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

తూర్పు: రోడ్డు, పడమర: పార్క్, ఉత్తరం: విల్లా నం. 01, దక్షిణం : విల్లా నం. 03

తేది: 18/08/2026 ప్రదేశం : తెలంగాణ అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.


# తెలంగాణ ఉద్యమకారులు మూడు వర్గాలుగా గుర్తింపు

### వర్గీకరణ ముసాయిదా, సంక్షేమ విధివిధానాలపై సమీక్ష

### త్వరలో ముఖ్యమంత్రికి నివేదిక

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశంలో ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదాతోపాటు సంక్షేమ విధివిధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన మంగళవారం కమిటీ సభ్యుల అత్యున్నత స్థాయి భేటీ జరిగింది. కేశవరావు నివాసంలో జరిగిన సమావేశంలో కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్ కోదండరామ్, మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్ రాములునాయక్ పాల్గొన్నారు. అమరదీపం వేదికగా 16 రోజుల పాటు 13,000 మందికి పైగా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, వివిధ జేఏసీలతో నిర్వహించిన విస్తృత సంప్రదింపుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన చర్చలపై ఒక ముసాయిదా నోట్‌పై ఈ సమావేశంలో చర్చించారు. సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం ఉద్యమకారులను గ్రూపులుగా గుర్తించే విధానాన్ని కమిటీ ప్రాథమికంగా పరిశీలించింది. మొదటి కేటగిరీలో అమరుల కుటుంబాలు ఉండనున్నాయి. ఉద్యమ క్రమంలో అమరులైన వారు (సుమారు 1400 మంది వరకు సమాచారం ఉండగా, గతంలో కొందరికి మాత్రమే సహాయం అందింది) మిగిలిన అర్హులైన అమరుల కుటుంబాలను గుర్తించి పూర్తి న్యాయం చేయడం. రెండవ కేటగిరీలో గాయపడిన ఉద్యమకారులు ఉంటారు. పోలీసు కాల్పుల్లో, లాఠీచార్జీల్లో శాశ్వత అంగవైకల్యం పొందిన వారు, ఆత్మహత్యాయత్నాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు ఉంటారు. మూడవ కేటగిరీలో జైలు జీవితం గడిపిన వారు ఉంటారు. తొలిదశ (1969), మలిదశ ఉద్యమాల్లో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, తీవ్ర జైలు శిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమకారులు ఉంటారు. ఇక నాల్గవ కేటగిరీలో కేసులు నమోదైన వారు ఉంటారు. ఉద్యమ సమయంలో క్రిమినల్ కేసులు, బెయిలబుల్/నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు ఎదుర్కొన్న శ్రేణులు ఉంటారు. ప్రత్యేక కేటగిరీలుగా సంస్థాగత క్రియాశీలక శ్రేణులు ఉంటారు. వారిలో కేసులు నమోదు కానప్పటికీ.. ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్‌ధామ్ కళాకారులు, వివిధ సంస్థల సభ్యులు ఉంటారు. ఉద్యమకారులకు ఈ మూడు విధానాల్లో గౌరవం దక్కాలని కమిటీ స్పష్టం చేసింది. ఉద్యోగులు, వసతి కలిగిన వారు కేవలం గుర్తింపు కార్డు, ప్రశంసా పత్రం ఆశిస్తుండగా.. నిరుపేద, నిరుద్యోగ యువత 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు కోరుతున్నారు. జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో సంక్షేమ పథకాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడంతో పాటు శాశ్వత కమిషన్ లేదంటే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్ష అనంతరం చైర్మన్ కేకే కమిటీ సభ్యులు తదుపరి చేపట్టవలసిన చర్యలను ఖరారు చేశారు. వాటిలో ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోవడానికి త్వరలోనే అధికారిక వెబ్‌సైట్, పోర్టల్ ద్వారా అవకాశం కల్పించడం. పారదర్శకమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమూనాను సిద్ధం చేయడం. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో విస్తృత స్థాయి చర్చలు జరపడం. మిగిలి ఉన్న ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులతో సంభాషణలు పూర్తి చేయడంతోపాటు ఇప్పటివరకు జరిగిన అన్ని చర్చల సమగ్ర నివేదికను, మినిట్స్‌ను రూపొందించి త్వరలోనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి సమర్పించనున్నట్టు తెలిపారు.

## శ్రావణమాసం, రక్షాబంధన్ వేడుకలకు రాష్ట్ర పోస్టల్ సర్కిల్ ప్రత్యేక సేవలు

### పవిత్ర 'గంగాజలం', 'ప్రత్యేక రాఖీ కవర్లు' అందుబాటులోకి

### స్పీడ్‌పోస్ట్ ఛార్జీలపై 10 శాతం రాయితీ

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ప్రస్తుత పండుగల సీజన్‌ను పురస్కరిం చుకుని రాష్ట్ర పోస్టల్ సర్కిల్ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక ఉత్ప త్తులు, సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు సహాయ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె. సుధీర్‌బాబు తెలిపారు. శ్రావణ మాసం, రక్షాబంధన్ వేడు కలను పురస్కరించుకుని భక్తులు, వినియో గదారుల సౌకర్యార్థం ఈ సేవలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గంగోత్రి నుంచి నేరుగా సేకరించిన స్వచ్ఛమైన పవిత్ర గంగాజలాన్ని తపాలా కార్యాలయాల ద్వారా విక్రయిస్తున్నారు. 250 మి.లీ. గంగాజలం సీసా ధర రూ. 30గా నిర్ణయిం చారు. దీనిని నేరుగా సమీ పంలోని హెడ్‌పోస్ట్ ఆఫీసులు, ఎంపిక చేసిన తపాలా కార్యా లయాల్లో పొందేందుకు లేదా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఈపోస్ట్ఆఫీస్. జిఓవి. ఇన్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా ఆర్డర్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా రక్షాబంధన్ సందర్భంగా సోదరులకు రాఖీలను సురక్షి తంగా పంపేందుకు రూ. 15లకే ప్రత్యేకంగా రూపొం దించిన రాఖీపోస్ట్ కవర్లను అందుబాటులో ఉం చారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న తపాలా నెట్‌వర్క్ ద్వారా రాఖీ మెయిల్స్ పం పేందుకు ఉపయోగించే స్పీడ్‌పోస్ట్ ఛార్జీలపై పదిశాతం ప్రత్యేక రాయితీని అందిస్తున్నారు. ప్రజలందరూ పోస్టల్ శాఖ అందిస్తున్న ఈ పండుగ ప్రత్యేక సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ట్రైనీ డిప్యూటీ తహశీల్దార్ బలవన్మరణం

**మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లాలో శిక్షణ డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మహబూ బాబాద్‌కు చెందిన డోలి సంధ్య (28) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మానుకోటలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన డోలి వెంకటేశ్వర్లు-పద్మ దంపతుల చిన్న కుమార్తె సంధ్య ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం సాధించి శిక్షణ ఉద్యోగం చేస్తున్నారు. సోమ వారం సాయంత్రం ఆమె తల్లి దండ్రులు బయటకు వెళ్లి వచ్చి చూసేసరికి సంధ్య ఫ్యాన్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో కుటుంబసభ్యుల రోద నలు మిన్నంటాయి.



సంధ్య(ఫైల్)

సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసు పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పలువురు చర్చించు కుంటున్నారు.





**భారత ఎన్నికల సంఘం** అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులు జాబితాలో లేకుండా చూసేందుకు **జూన్ 25, 2026** నుండి **స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)** నిర్వహిస్తుంది.

**17.08.2026**న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ పేరు లేనట్లయితే, బూత్ స్థాయి అధికారి (BLO) / AERO / ERO ను సంప్రదించండి.

**17.08.2026** నుండి **16.09.2026** వరకు క్లెయిమ్‌లు & అభ్యంతరాలు తెలపవచ్చు.

**ఫారమ్-6**: మీకు అక్టోబరు 1, 2026 కి 18 సం॥లు నిండినట్లైతే, మరియు ఏదైనా శాసనసభ నియోజకవర్గాల్లో ఓటర్‌గా నమోదు కానట్లయితే లేటెస్ట్ ఫోటో, వయసు ధ్రువీకరణ పత్రం & డిక్లరేషన్ ఫారం మొ॥ జతచేసి అందచేయండి (నూతన ఓటర్‌గా)

**ఫారమ్-7**: చనిపోయిన లేదా డూప్లికేట్ ఓటర్ల పై అభ్యంతరాలు తెలియజేయుటకు (తొలగింపులు)

**ఫారమ్-8**: మీ మొబైల్ నెంబర్ అప్డేట్, చిరునామా మార్పులు, ఓటర్ గుర్తింపుకార్డులో వివరాల సవరణలకు (సవరణలు)

తుది ఓటర్ల జాబితా ప్రచురణ **19.10.2026**

Scan here for — ecinet.eci.gov.in

Website: https://voters.eci.gov.in / https://ecinet.eci.gov.in / https://www.eci.gov.in

వివరాలకు: బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించండి (BLO)/AERO/ERO

CEOTelangana | CEOTelangana | ChiefElectoralOfficerTelangana | CEO_Telangana

వివరాలకు, టోల్‌ఫ్రీ **1950** ఉ॥ 10:30 - సా॥5:00 వరకు

మీ ఓటు.. మీ బాధ్యత. ఓటర్ల జాబితాలో మీ వివరాలను అప్‌డేట్ చేసుకోండి - పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

వార్త


మారణాయుధాలు మనల్ని నాశనం చేయకముందే మనం వాటిని నాశనం చేయడం మంచిది.

- జాన్ కెనడీ

# కలగూరగంపలో కాలకూటం!


సంపూర్ణ ఆరోగ్యానికి బాసటగా ఉంటాయనుకున్న ఆకు కూరల్లో పురుగు మందుల్లోని రసాయనిక అవశేషాలున్నాయంటే ఒకేసారి గుండె గుభేల్‌మంటుంది. రోజువారీ భోజనంలో వండి వడ్డించుకునే ఆధరువుల్లో ఏదో ఓ కూరగాయ ఉడికించి తాళింపు వేసేవే. ఏ కూరగాయ ఎలా వండినా శరీరానికి పుష్టిచేకూర్చేవని నమ్ముతాం. టమోటాలు, వంకాయలు, క్యారెట్, క్యాబేజి, కేరట్, బీట్‌రూట్ ఏవి తిన్నా ఎన్నో పోషకాలున్న పౌష్టికాహారాన్ని తింటున్నామని భుక్తాయాసంతో తృప్తిపడతాం. తీరా వాటిల్లో పురుగు మందుల తాలూకు రసాయనిక అవశేషాలున్నాయని తెలిస్తే ఆరోగ్య బెంగ తప్పదు. తాజాగా లోక్‌సభలో తెలుగు రాష్ట్రాల్లో భారీగా పురుగు మందుల వాడకం, అదే మాదిరిగా ఇక్కడ పండించే కూరగాయల్లో రసాయనిక అవశేషాలను గురించి వివరించారు. పంట ఏదైనా, శాస్త్రజ్ఞులు వాటితో నిమిత్తం లేకుండా 'అధిక పురుగు మందు వాడకంతో అత్యధిక దిగుబడి' వస్తుందన్న ఆశతో ఎక్కువ మోతాదులో ఎరువులు,పురుగుమందులు వాడతారని అపప్రధ ఉండనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 2,104 నమూనాల పరిశీలనలో 134 నమూనాల్లో అధిక రసాయనిక అవశేషాలున్నాయి. అంటే 6.36 శాతం. తెలంగాణ నమూనాలు 8198లో 486 శాంపిళ్లలో అధిక మోతాదు పురుగుమందులు కనిపించాయి. 5.92శాతం అని గణాంకాలు చెబుతున్నాయి. వీటితోపాటు హరియాణ నమూనాల్లో 6.41 శాతం అవశేషాలున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఒక్కదానిలో కూడా ఎలాంటి అవశేషాలు లేవు. 2005 నుంచి జాతీయ స్థాయిలో పురుగుమందుల అవశేషాల అన్వేషణ ప్రాజెక్టు ఉంది. ఏటా తమకు అందిన నమూనాల్లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో సంస్థ ఏ మేరకు పురుగుమందుల అవశేషాలున్నాయో పరిశోధనల్లో తెలుస్తోంది. నమూనాలను సేకరించి అవశేషాలను బట్టబయలు చేయడం ఒక ఎత్తయితే పంటలకు పట్టిన తెగుళ్లను అక్కడికక్కడ విశ్లేషించి వ్యవసాయ సూచనలు చేసే ఒక ప్రత్యేక యంత్రాంగమూ ఉంటుంది. 2023 నుంచి 2026 వరకు దేశం మొత్తం మీద 70,652 పండ్లు కూరగాయల నమూనాలను పరీక్షించగా 2223 నమూనాల్లో మాత్రమే ఎఫ్‌ఎస్‌ఎఎస్‌ఐఎస్ ప్రమాణాల సంస్థ నిర్దేశిత పరిమితి కన్నా అధిక పురుగుమందుల అవశేషాలున్నట్లు గుర్తించింది. అంతేకాదు దీర్ఘకాలికంగా నిలువ ఉండిపోయే సేంద్రియ కాలుష్య కారకాలు, కొన్ని సందర్భాల్లో భారీలోహాలు ఉన్నట్లు బయటపడింది. ఇలాంటివే 'ఆహార భద్రత, ఆరోగ్య రక్షణ' వంటిఅంశాల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఒక వ్యక్తి ప్రతిరోజూ ఏదో విధంగా తక్కువ మోతాదులో వచ్చి చేరే కలుషిత ఆహారం దీర్ఘకాల దుష్ప్రయోజనం గురించి తప్పనిసరిగా తెల్సుకోవాలి. అప్పుడే మంచి ఆరోగ్యాన్ని పొందగలుగుతాడు. పరిస్థితులు చెయ్యిదాటక ఎవరూ ఏమీచేయలేరు. పురుగుమందుల్లో అవశేషాల వలన నాడీవ్యవస్థ, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులపై చెడు ప్రవాహం కన్పిస్తుంది. ఆ తర్వాత వైద్యచికిత్సలకు శరీరం లొంగకపోతే ఇక మంచమే గతి. కొన్ని రసాయనాలు కేన్సర్, హార్మోన్‌ల అసమతుల్యత, రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీయడం వంటి అనారోగ్య సమస్యలు తెచ్చిపెట్టవచ్చు. అందుకే అన్ని సందర్భాల్లోనూ సురక్షిత వ్యవసాయానికి ఆర్థిక ప్రోత్సాహకాలతోపాటు, రసాయనిక అవశేషాలు మిగలకుండా చూసే శాస్త్రీయ విధానాలను అనుసరించాల్సి ఉంది. విత్తనం నుంచి వినియోగదారునికి సాగు ఉత్పత్తులు చేరేవరకు ప్రజారోగ్య విశ్లేషణ ప్రణాళికలు ఉండాలి. రసాయన కాలుష్యం కేవలం పురుగుమందుల పిచికారీ వల్లనేరాకపోవచ్చు. కలుషిత నీటితో సాగుకూడా మంచిది కాదు. భూమిలోకి పారిశ్రామిక వ్యర్థాలుచేరడం, మురుగునీటి వాడకం, కాలుష్యభరిత మట్టిలో పంటలు పండించడం వలనకూడా కూరగాయలపై కలుషిత ప్రభావం ఉంటుంది. పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకోవడానికి రైతులు విచక్షణారహితంగా వాడే సింథటిక్ పురుగు మందులు కూడా వాడడంతో కలుషిత అవశేషాలు ఉండే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం అవశేషపు నమూనాల్లోసగం దక్షిణ భారతంలోని ఐదురాష్ట్రాల నుంచే కావడం ఆందోళనకరం.ఉండాల్సిన గరిష్ట పురుగు మందు పరిణామం (ఎం.ఆర్.ఎల్) ఎక్కువగా ఉంటే మానవ ఆరోగ్యానికి తీవ్రహాని కలిగిస్తుంది.ఆంధ్ర, తెలంగాణ మార్కెట్‌లలో విరివిగా లభించే వంకాయ, బెండ, టమాటా, క్యాప్సికం, ద్రాక్షలలో మోనోక్రోటోఫాస్, క్లోరోపైరిఫాస్, ప్రొఫెనోఫాస్‌లుంటాయి. ఇలాంటి అవశేషాలు తరచు మనం తినే కూరగాయల్లో ఉంటే, పది పదిహేనేళ్లలో దాని చెడు ప్రభావం 'స్లో పాయిజన్' రూపంలో శరీరానికి చేరుతుంది. సాధారణంగా నిర్దిష్ట గడువులో మందులు వాడాక పంటకోత కోస్తే, సమయంచూసుకుని కోతకు దిగాలి. అవేమీ పాటించకుండా మందు కొట్టిన వెంటనే కోతలు కోస్తే తప్పనిసరిగా అవశేష నమూనాలు వాటిని ఆశించి ఉంటాయి. దేశం ఆహార భద్రతలోనే కాకుండా విషరహిత ఆహారాన్ని వినియోగదారునికి అందించడంలోకూడా ముందడుగు వేయాలని లేకుంటే ఆరోగ్యానికి అన్నీ అనర్థాలేనని చెప్పడం తప్పదు. విషయం ఈనాటి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మార్కెట్ నుంచి వచ్చిన కూరగాయలను వంట కోసం స్వీకరించినప్పుడు ఆ కూరలను ఉప్పునీళ్లలో లేదా బేకింగ్ సోడా నీళ్లలో పదినిమిషాలు నానబెట్టి ఆ తరువాత కడిగి వంటకు ఉపక్రమించడం ముఖ్యం. తోటల్లో స్ప్రే చేసే రైతులు కూడా దాని ప్రభావం మీద పడి కేన్సర్ వంటి రోగాలకు గురవకుండా చూసుకోవాలి. అప్పుడే రైతుకు, రైతు పండించే ఉత్పత్తులకు, వాటిని వండుకునే వినియోగదారులకు ఆరోగ్య రక్ష కాగలదు.

రచయిత మేధావిలా ఆలోచించాలి కానీ సగటు మనిషికి అర్థమయ్యేంత సులువుగా రాయాలి.



అరిస్టాటిల్

గొప్ప గొప్ప వివాదాలను పరిష్కరించగలిగేది సమర్థులు లేదా వ్యతిరేకులు మాత్రమే, తటస్థులు కాదు.



సిసిరో

# ప్రజావాక్కు



### ప్రత్యక్ష పెట్టుబడులు రావాలి

భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, దాని పూర్తి సామర్థ్యాన్ని అందిపుచ్చుకోవడానికి కొన్ని నిర్మాణాత్మక అడ్డంకులను తొలగించాల్సిన అవసరం ఉంది. 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ ప్రస్తావించిన నియంత్రణ పరమైన అవరోధాలు,వాణిజ్య విధానసవాళ్లు, పెట్టుబడులకు ఎదురవుతున్న ఇబ్బందులు ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విదేశీ సంస్థలు భారత్‌లో భౌతికంగా వ్యాపారాలను స్థాపించేందుకు ఇంకా అనేక అనుమతులు, నిబంధనలు దాటాల్సి వస్తోంది. విదేశీ పెట్టుబడులు అధికంగా ప్రైవేట్ ఈక్విటీ రూపంలోకి మళ్లడం కంటే ఉత్పాదక రంగాల్లో ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగేలా వాతావరణాన్ని సులభతరం చేయాలి. ఇందుకోసం వ్యాపార నిబంధనలను సరళీకరించడం, అనవసరమైన అనుమతులను తగ్గించడం అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కృత్రిమ మేధ ఎగతాళి కాకూడదు!

ఈ మధ్య కాలంలో సామాజిక మాధ్యమాలు సమాజ శ్రేయస్సును నాశనంచేసే వేదికగామారుతుండటం చాలా దురదృష్టకరం.మహాత్మాగాంధీ సిగరెట్‌పట్టుకుని నాట్యం చేస్తున్నట్లుగా ఒక కృత్రిమ మేధ వీడియోను ప్రచారం చేసి జాతిపితను అవమానిస్తున్నారు.గణేష్ చతుర్థి, రాఖీ పండుగ, ఆయుధపూజ,క్రిస్మస్, స్వాతంత్య్ర దినోత్సవం వంటి ప్రతి మత, జాతీయవేడుకను ఎగతాళి చేస్తూ అవమానిస్తున్నట్లుగా రకరకాలుగా వీడియోలు వైరల్ అవుతున్నాయి. ప్రతి వేడుకకు, సంప్రదాయానికి దానికంటూ ఒక చరిత్ర ఉంటుంది. దానిని ఎగతాళి చేసి వికృతమైన ఆనందాన్ని పొందడం ఎంతవరకు సబబు? ఈ ధోరణిని అరికట్టడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### మనశ్శాంతిలో ఆత్మానుభూతి

మనశ్శాంతి అనేది బయట ఎక్కడో దొరికేది కాదు. మన ఆలోచనల్లో,మన దృక్పథంలో, మననిర్ణయాల్లో ఉంటుంది. అందుకే కొన్నిమార్చుకోవాలి. కొన్ని మర్చిపోవాలి. కొన్ని వదులుకోవాలి. కొన్ని వదిలేయాలి. అప్పుడు మనసు తేలికఅవుతుంది. జీవితం ప్రశాంతంగా మారుతుంది. గతం పాఠంగా మిగులుతుంది. వర్తమానం ఆనందంగా మారుతుంది. భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తుంది. ఇదే నిజమైన మనశ్శాంతి.

- డా.దన్నాన అప్పలనాయుడు,విజయనగరం

### ఇదేనా పారదర్శక పాలన?

ఏపీ అసెంబ్లీ సమావేశాలలో దొంగ బాబాల ప్రభుత్వ భూ ఆక్రమణలపై చర్చజరపాలి.గాలిరకాలు, పోరంబోకు వెధవలు బాబాలుగా, స్వాములవార్లుగా వేషాలు వేసినవాళ్లకు మన వాళ్ళు సాష్టాంగపడుతున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా మంత్రులు అధికారులు పట్టించుకోవటం లేదు. క్విడ్ ప్రోకోనాఏమో. అసెంబ్లీలో చర్చించాలి. మంత్రాలు మహిమలు అనేవి ఈ విశ్వంలో లేవు.ఈబాబాలు తమ మహిమల వలన మన జీవితాలు బాగుపరుస్తారని చాలామంది వీరీ వద్దకు వెళ్ళి దాసోహం అంటారు. వీరి బలహీనతలను ఆధారం చేసుకొని ఈ దొంగలు రకరకాలుగా మోసం చేస్తుంటారు. ఇలాంటివారిని ది డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీ యాక్ట్ 1954 కింద అరెస్ట్ చెయ్యాలి.కానీ చెయ్యరు. ఎందుకంటే 'క్విడ్ ప్రోకో' నేను నీకు ఇది ఇస్తాను నువ్వు నాకు అది ఇవ్వు. జగన్ తెచ్చిన కొత్త పదం.అసెంబ్లీ సమావేశాలలో దొంగ బాబా భూ ఆక్రమణలపై చర్చలు జరపాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య,ప్రకాశం జిల్లా

### తీరు మారాలి

హోటల్‌లో రుచికరమైన ఆహారంతినాలని అందరికీ ఉంటుంది.కానీ ఆ ఆహారం ఎంతపరిశుభ్రంగా తయారవుతోంది, ఉపయోగించే పదార్థాలు తాజాగా ఉన్నాయా అనే విషయాలను కూడా గమనించాలి. కొన్ని చోట్ల అపరిశుభ్ర వాతావరణంలో, నిల్వ చేసిన పదార్థాలతో ఆహారం తయారవుతోంది. ఆహార తనిఖీలు జరుగుతున్నా, మంచినాణ్యమైన ఆహారాన్ని అందించాలని చెబుతున్నా, కొందరి తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. కల్తీ పూర్తిగా తగ్గాలంటే హోటళ్ల, రెస్టారెంట్ల యాజమాన్యాలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. వంట గదిని శుభ్రంగా ఉంచి,నాణ్యమైన తాజాపదార్థాలతో ఆహారం తయారు చేయాలి. ప్రజలు హోటల్‌కు వెళ్లినప్పుడు పరిసరాలతో పాటు పరిశుభ్రతను గమనించాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### పేదరికాన్ని జయిద్దాం

మన నిత్య జీవితంలో బాల్య జీవితం నుండి మొదలుకొని ఒక వయస్సు అనుకోని ఆటుపోట్లు నిరంతరం ఎదురవుతూనే ఉంటాయి. అనుకున్న లక్ష్యంపై ఏకాగ్రతతో కూడిన కఠోర సాధన చేస్తేనే జీవితం మెరుగ్గా ఉంటుంది. ఎలాంటి ఆటుపోట్లు ఎదురైనావెనకడుగు వేయకుండా ముందుకు సాగుతూ కుటుంబానికి అండగా ఉంటూ పది మందికి సాయం చేసే జీవితం గడపాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# భారత్ ఆచితూచి అడుగులు వేయాలి

**పొరుగునున్న నేపాల్‌లో ప్రభుత్వాలు మారినప్పుడల్లా భారత్‌పై వాటి విదేశాంగ విధానం కూడా మారుతున్నది. ఇస్లామిక్ దేశాల్లో చాలావరకు మనకు అనుకూలత ఉన్నా, ఇతర దేశాల కుట్రలతో ఆయా దేశాలు ఎప్పుడెలా మారతాయో తెలియదు. ఇస్లామిక్ నాటో పట్ల కూడా భారత్ ఆచితూచి అడుగులు వేయాలి. మన చుట్టూ ముప్పుపొంచి ఉంది. సరికొత్త వ్యూహాలతో, భారత్‌ను రక్షణపరంగా శత్రు దుర్భేద్యంగా మార్చాలి.భారత్ సాంకేతికంగా, ఆయుధపరంగానూ బలీయమైన శక్తిగా ఎదిగినప్పటికీ మధ్య ప్రాచ్యంలో గతకొన్ని నెలలుగా జరుగుతున్న యుద్ధ పరిణామాలు, ఆయిల్ సంక్షోభం వలన ఆర్థికంగా నష్టపోతున్న విషయం విదితమే. యుద్ధాల అంచుల్లో పయనిస్తున్న ప్రపంచంలో ఎప్పుడు ఏ సంక్షోభం తలెత్తుతుందో ఊహించలేం. వర్తమాన అంతర్జాతీయ పరిణామాలను బట్టి భారత్ ఆచితూచి అడుగులువేయాలి.**



సుంకవల్లి సత్తిరాజు

బలూచిస్తాన్ స్వాతంత్య్రం ప్రకటించుకుంది. ఇక ఇతర దేశాల గుర్తింపే మిగిలి ఉంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ కల్లోలంగా మారింది.పిఓకే పాక్ నుండి విడిపోవడానికి సిద్ధంగా ఉంది. పాక్ పాలకుల పట్ల,మిలటరీ వ్యవస్థ పట్ల అక్కడి ప్రజల్లో కోపాగ్ని కట్టలు తెంచుకుంది. ఇవన్నీ భారత దేశానికి సానుకూల అంశాలైనప్పటికీ, ఈ అవకాశాలను ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ వినియోగించుకుంటుందా? లేక మరికొంత కాలం వేచిచూస్తుందా అనే విషయంలో స్పష్టత రావలసి ఉంది. జంతర్ మంతర్‌లో సిజెపి సాగించిన ఉద్యమం తర్వాత భారత ప్రభుత్వంఎఫ్‌సిఆర్‌ఏ, మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను లోక్‌సభలో ప్రవేశ పెట్టకుండా వాయిదా వేసింది. విదేశీ విరాళాలకు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఏ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించాలని నిర్ణయించింది. ఒకవైపుఅంతర్జాతీయ ఒత్తిళ్లు, మరోవైపు ప్రతిపక్షాల నిరసనలు, ఇంకోవైపు జన్ జి హెచ్చరికలతో కేంద్రప్రభుత్వం కొంత ఇరకాటంలో పడింది. ఈ పరిస్థితుల దృష్ట్యా పాక్ విషయంలో సంయమనం పాటిస్తుందా?అనే అంశం ప్రస్తుతానికి సందిగ్ధంలోనే ఉంది. ఒకవైపు ఇరాన్ యుద్ధం వలన ఏర్పడిన ఇంధన కొరత వలన దేశం ఆర్థికంగా సవాళ్లను ఎదుర్కొంటున్నది. దేశం అనేక బాలారిష్టాలను అధిగమించి,వివిధ రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. విద్య,వైద్య,శాస్త్ర,సాంకేతిక,అణు, ఆయుధ, రక్షణ రంగాలు బలోపేతమైనాయి. అయితే శత్రుశేషం మిగిలేఉంది.అమెరికా, చైనా, పాక్, బంగ్లాదేశ్ వంటి దేశాల వైఖరి వలన భారత్ అనేక అవరోధాలు ఎదుర్కొంటున్నది. దేశంలో ఇంకా పేదరికం పోలేదు. ఆర్థిక అంతరాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఉపాధి అవకాశాల కోసం యువత నానా అగచాట్లు పడుతున్నది. చమురు రంగం భారత్ ఆర్థిక పరిస్థితిని శాసిస్తున్నది. అమెరికా భారత్‌పై అసూయా ద్వేషాలతో రగిలిపోతున్నది. డ్రాగన్ తన రణవ్యూహాలకు పదును పెడుతున్నది. అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న దాయాది దేశం తన భూభాగాలను చైనాకు విక్రయించడానికి ప్రయత్నిస్తుందన్న వార్తలు వెలువడుతున్నాయి. తాచెడ్డ కోతి వనమెల్ల చెరిచిన చందంగా పాక్ వైఖరి దారుణంగా మారింది. సీమాంతర ఉగ్రవాదం ప్రోత్సహిస్తూ, కాశ్మీరంలో కల్లోలం సృష్టించిన పాక్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తగిన గుణపాఠం చెప్పడం ద్వారా ప్రపంచ దేశాలకు భారత్ ఆయుధ సామర్థ్యం తెలియవచ్చింది.అమెరికా,చైనా ఆయుధాల పేలవమైన ప్రదర్శన కూడా ఆయా దేశాల ఆయుధాలు కొనుగోలు చేసే దేశాలను పునరాలోచనలో పడేశాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అమెరికా వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. పాకిస్థాన్‌కు అండగా నిలబడుతూ, వివిధ రకాలుగా భారత్ వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తున్నది. ట్రంప్ భారత్‌పై ప్రదర్శిస్తున్నఅక్కసు వలన భారత్ ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లవలన భారత వాణిజ్యం గందరగోళంలో పడింది. ట్రంప్ ట్రేడ్ పాలసీ, టారిఫ్‌లు,వీసా నిబంధనలను పరిశీలించి, విశ్లేషించిన తర్వాత భారత్ ఇక ఏ మాత్రం అమెరికాపై ఆధారపడకూడదన్న ఆలోచనభారత ప్రభుత్వానికి స్ఫురించే ఉంటుంది. ఇంధన రంగంలో ఏర్పడిన సంక్షోభం దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా భారత్ స్వయం సంమృద్ధి సాధించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.భారత్‌కు రష్యాతోగల వాణిజ్య, స్నేహ సంబంధాలు అమెరికాకు ఇష్టం లేదు. రష్యా ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధానికి అమెరికా,నాటో దేశాలే కారణం. అయితే



అమెరికా ఈ విషయంలో భారత్‌పై అకారణ నింద మోపడం హాస్యాస్పదం. రష్యా, ఉక్రెయిన్ల మధ్య గత నాలుగున్నరేళ్లుగా యుద్ధం కొనసాగడానికి అమెరికాతో పాటు, ఇప్పుడు అమెరికాను విమర్శిస్తున్న నాటో కూటమి అందించిన ఆయుధ, ఆర్థిక సహకారమే కారణం. ఈ విషయాన్ని పక్కదారి పట్టించి రష్యానుండి భారత్ అధిక మొత్తంలో క్రూడాయిల్ దిగుమతి చేసుకుని, రష్యాకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందని, అందువలనే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేయగలుగుతున్నదని అమెరికా వితండవాదం చేయడమే కాకుండా భారత్ ఉత్పత్తులపై 100శాతం సుంకాలు విధిస్తూ అమెరికా సెనేట్ భారీ మెజారిటీతో తీర్మానం ఆమోదించడం విడ్డూరం. ట్రంప్, మోడీలు మంచి స్నేహితులు కాబట్టి ఈటారిఫ్‌లపై వారే మాట్లాడుకుంటారని ట్రంప్ సలహాదారులు వ్యాఖ్యానించడం కొసమెరుపు.భారత్ అమెరికాల మధ్య ట్రేడ్‌డీల్ అమల్లోకి వస్తే సెనేట్ ఆమోదించిన తీర్మానానికి విలువ ఉంటుందా? ఇరాన్ పై యుద్ధం ప్రకటించి, తమకు గల ఆయుధ నిల్వలను ఖాళీచేస్తూ, ఆర్థికంగా దివాలా తీసిన అమెరికాకు ఇతర దేశాల వ్యవహారాల్లో తలదూర్చితే ఏం జరుగుతుందో ఇరాన్ యుద్ధ ఫలితాలు నిరూపించాయి. ఇరాన్ చేతిలో భంగపడి, చేతులు కాల్చుకున్న అమెరికా ఒకవైపు మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ, మరో వైపు ఇరాన్‌ను బుజ్జగించి, శాంతి ఒప్పందానికి పాక్ లాంటి దేశాల మధ్యవర్తిత్వం కోసం ఆర్థికసహాయం చేస్తూ, అంతర్జాతీయంగా అపకీర్తి మూటగట్టుకుంది. భారత్ పై అమెరికా పగబట్టి, ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తుంటే, భారత్‌కు చైనా మరోవైపు పొగబెడుతున్నది.చైనా బ్రహ్మపుత్ర నదిపై 14 లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రపంచంలో అతిపెద్ద డ్యామ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి భారత్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నది. జల విద్యుత్ ప్రాజెక్టు పేరుతో చైనా నిర్మిస్తున్న ఈ డ్యామ్ వలన భారత్ ఈశాన్య రాష్ట్రాలకు నీటి సరఫరా చేయకుండా నిలిపి వేయడం, వరదలు సంభవిస్తే ఈ ప్రాంతాలను ముంపుకు గురిచేసే దురుద్దేశ్యం ఇందులో దాగివుంది. భారత్ పాక్‌కు సింధు జలాలను నిలిపివేయడం వలన పాక్‌లో నీటి సంక్షోభం ఏర్పడగా మరోవైపు,పాక్‌ఆక్రమిత కాశ్మీర్, బలుచిస్తాన్ ప్రాంతాల్లో అంతర్యుద్ధం చెలరేగింది. త్వరలో బ్రిక్స్‌దేశాల సమావేశం భారత్‌లో జరగనున్న దృష్ట్యా భవిష్యత్ అవసరాలదృష్ట్యా చైనా దేశం భారత్ పట్ల సానుకూల వైఖరి ప్రదర్శిస్తుందా? అమెరికాకు వ్యతిరేకంగా భారత్‌తో చేతులు కలుపుతుందా? అనే విషయంలో ఒక స్పష్టమైన సంకేతం వెలువడే అవకాశముంది. ఏదిఏమైనప్పటికీ పొరుగు దేశాల వలన భారత్‌కు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.'యు కెన్ ఛేంజ్ ఫ్రెండ్స్ బట్‌నాట్ నైబర్స్' అంటూ అప్పటి మన ప్రధాని వాజ్ పేయి చెప్పిన మాటలు అక్షరసత్యాలు. ఈ వాస్తవం వర్తమాన భారతంలో జరుగుతున్న పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.ఒకప్పుడు పాక్ ఆగడాలు,అలసత్వం,నియంతృత్వం భరించలేక భారత్ శరణు జొచ్చి,తూర్పు పాకిస్థాన్‌ను 'బంగ్లాదేశ్' ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడంలో భారత్ చేసిన కృషిని నేడుఅక్కడి పాలకులు,యువత మరచిపోవడం దురదృష్టకరం. చైనా, పాకిస్తాన్, ఆఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్ దేశాలతో భూ సరిహద్దులను పంచుకుంటున్నభారత్‌కు చైనా, పాక్, బంగ్లాదేశ్‌లతో ప్రస్తుతం బద్ధవైరం నెలకొని ఉంది. భారత్‌తో సముద్ర సరిహద్దులు గల శ్రీలంక, మాల్దీవులతో గతంలో కొన్ని విబేధాలుతలెత్తి ప్రస్తుతం సద్దుమణిగాయి. ఇప్పుడు శ్రీలంక భారత్‌తో సఖ్యంగానే ఉంటున్నా భారత్‌కు జరగవలసిన అనర్థ ఇప్పటికే జరిగిపోయింది. ఇక పొరుగునున్న నేపాల్‌లో ప్రభుత్వాలు మారినప్పుడల్లా భారత్ పై వాటి విదేశాంగ విధానం కూడా మారుతున్నది. ఇస్లామిక్ దేశాల్లో చాలా వరకు మనకు అనుకూలత ఉన్నా, ఇతర దేశాల కుట్రలతో ఆయా దేశాలు ఎప్పుడెలా మారతాయో తెలియదు. ఇస్లామిక్ నాటో పట్ల కూడా భారత్ ఆచితూచి అడుగులువేయాలి. మన చుట్టూ ముప్పుపొంచిఉంది. సరికొత్త వ్యూహాలతో, భారత్‌ను రక్షణపరంగా శత్రు దుర్భేద్యంగా మార్చాలి.భారత్ సాంకేతికంగా, ఆయుధపరంగానూ బలీయమైన శక్తిగాఎదిగినప్పటికీ మధ్య ప్రాచ్యంలో గతకొన్ని నెలలుగా జరుగుతున్న యుద్ధ పరిణామాలు, ఆయిల్ సంక్షోభంవలన ఆర్థికంగా నష్టపోతున్న విషయంవిదితమే.యుద్ధాల అంచుల్లో పయనిస్తున్న ప్రపంచంలో ఎప్పుడు ఏసంక్షోభం తలెత్తుతుందో ఊహించలేం. వర్తమాన అంతర్జాతీయ పరిణామాలనుబట్టి భారత్ ఆచితూచి అడుగులువేయాలి.


# కోర్టులలో 5.74 కోట్లు దాటిన పెండింగ్ కేసులు!



శిరందాసు నాగార్జున

దేశంలోని న్యాయస్థానాలలో కోట్ల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పెండింగ్ కేసుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. 2022 జూన్ నెలాఖరు నాటికి దేశవ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో దాదాపు4.83 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వంవెల్లడించింది. ప్రస్తుతం దేశం మొత్తం కోర్టులలో పెండింగ్ కేసులు 5.74 కోట్లు దాటిపోయాయి. ఒక్క సుప్రీంకోర్టులోనే పెండింగ్ కేసులసంఖ్య 95 వేలు దాటింది.సాక్షుల గైర్హాజరు కావడం,సరైన సమయానికి ఆధారాలు అందకపోవడంతో కేసుల విచారణ ప్రక్రియ క్లిష్టంగా మారింది. లోక్ అదాలత్‌ల నిర్వహణ ద్వారా రాజీ పడదగిన కేసులను త్వరగా పరిష్కరించడం, ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయడం, ఈకోర్టుల ప్రాజెక్ట్ ద్వారా డిజిటల్ విధానంలో స్పీడ్ పెంచడం వంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయినా కేసుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నాయి.జడ్జిల పోస్టులు ఖాళీగా ఉండటం కూడా ఒక కారణం. నేషనల్ జ్యుడిషియల్ డేటా ప్రకారం ఈ ఏడాది ఆగస్ట్ 17వ తేదీనాటికి దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు, హైకోర్టులు, రాష్ట్రాలలోని ఇతర కోర్టులలో సివిల్ కేసులు 1,58,54,896ఉండగా, క్రిమినల్ కేసులు 4,15,76,022ఉన్నాయి.మొత్తం 5,74,30,918 పెండింగ్ కేసులున్నాయి. ఇందులో 30ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం సుప్రీం కోర్టులో సివిల్ కేసులు 73,915,క్రిమినల్ కేసులు 21,653,మొత్తం 95,568 పెండింగ్ కేసులున్నాయి. రిజర్వ్ చేసిన తీర్పుల వెల్లడిలో కూడా హైకోర్టులలో తీవ్ర జాప్యం జరగడం పట్ల సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టుల్లో విచారణలు,తీర్పుల వెల్లడిలో జాప్యం నివారించేందుకు సుప్రీం కోర్టు చర్యలు చేపట్టింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కల్పించిన విశేషఅధికారాలను ఉపయోగించి న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేలా, జాప్యం తగ్గించేలా పలు అంశాలపై అన్ని హైకోర్టులకు సుప్రీం కోర్టు కొన్ని సూచనలుచేసింది. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బగ్చిలతో కూడిన ధర్మాసనం మే 29న కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఝార్ఖండ్‌కు సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ సూచనలు చేసింది. రిజర్వ్‌చేసిన తీర్పులు గరిష్ఠంగా 3నెలల్లోపు వెలువరించాలి. తీర్పు ధృవీకరించిన కాపీలో తీర్పును రిజర్వ్ చేసిన తేదీ, తీర్పును ప్రకటించిన తేదీ, తీర్పును అప్‌లోడ్ చేసిన తేదీని పేర్కొనాలి. సవివరమైన తీర్పును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినప్పుడు, పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదులకు ఇమెయిల్/ ఎస్‌ఎంఎస్ ద్వారా పంపాలి. బెయిల్ పిటిషన్లపై ఉత్తర్వులు అదే రోజు ప్రకటించి, అప్‌లోడ్ చేయాలి. బెయిల్ ఉత్తర్వులు రిజర్వ్‌చేస్తే మరుసటి రోజే ప్రకటించాలి. బెయిల్ లేదా శిక్ష సస్పెన్షన్ ఉత్తర్వులు వెంటనే అధికారులకు తెలపాలి. ఖైదీల విడుదల సాధ్యమైనంత వరకు అదేరోజు, లేకపోతే మరుసటిరోజు జరగాలి. బెయిల్ ఉత్తర్వుల అమలుపై ట్రయల్ కోర్టు హైకోర్టుకు నివేదిక ఇవ్వాలి. కస్టడీలో ఉన్న అప్పిలెంట్ల కేసుల్లో 7 రోజుల్లోపే అదనపు వివరణలు కోరవచ్చు. ఇక అత్యవసర కేసు (కూల్చివేతలు, బహిష్కరణలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలు, బెయిల్ తదితరాలు)ల్లో కేవలం ప్రధాన నిర్ణయం (ఆపరేటివ్ ఆర్డర్) ముందుగా ఓపెన్ కోర్టులో ప్రకటించినా, దానికిగల పూర్తికారణాలతో తీర్పును సాధారణంగా 7రోజుల్లోపు, అసాధారణ పరిస్థితుల్లో 15రోజుల్లోపు వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయాలి. ప్రకటించిన తీర్పు 24గంటల్లోపు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. పెండింగ్ రిజర్వ్ తీర్పులపై ప్రతి నెల ఆటోమేటెడ్ ఇమెయిల్ పంపాలి.2 నెలలు దాటిన పెండింగ్ తీర్పులను జడ్జిల దృష్టికి తీసుకెళ్లాలని లాయర్లకు సూచన చేశారు.3 నెలల్లో తీర్పురాకపోతే కేసు చీఫ్ జస్టిస్ దృష్టికి వెళ్లాలి. మరో 2 వారాలు ఆలస్యమైతే కేసును వేరే బెంచ్‌కు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.3 నెలలైనా తీర్పురాకపోతే పక్షాలు దరఖాస్తు చేసుకోవచ్చు. 4 నెలలు గడిచినా తీర్పురాకపోతే బెంచ్ మార్పు కోరే హక్కు పక్షాలకు ఉంటుంది.రిజర్వు చేసిన తీర్పులు వెలువరించడంలో జరిగే జాప్యాన్ని తగ్గించి న్యాయ ప్రక్రియలో వేగం పెంచాలన్నది సుప్రీంకోర్టు భావన.హైకోర్టు, దిగువ కోర్టులలో ఈసూచనలు పాటిస్తే, తీర్పుల వెల్లడిలో జాప్యం జరగదు. విచారణ ప్రక్రియ వేగంగా జరిగేలా నూతన ఆలోచనలతో,సుప్రీంకోర్టు రూపొందించవలసిన అవసరంఉంది.

# యుపిఐ ఉచిత సేవల నుండి సుస్థిర భవిష్యత్తు వైపు



రామ కిష్టయ్య సంగన భట్ల

భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఆధునిక సాంకేతిక సౌధంగామలిచి, నగదు రహిత లావాదేవీలలో ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వ్యవస్థ నేడు ఒక కీలక చారిత్రక ఘట్టానికి చేరింది. దేశంలోని కోట్లాది మంది ప్రజల దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిన ఈ డిజిటల్ మౌలిక వసతిని మరింత సమగ్రంగా నియంత్రించేందుకు, అవసరమైతే నామమాత్రపు సేవా రుసుములు లేదా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే చట్టబద్ధమైన అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పిస్తూ లోక్‌సభ ఇటీవల కీలక చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం ఆర్థిక వర్గాల్లోనూ, సామాన్య ప్రజానీకంలోనూ విస్తృత చర్చకు తెరలేపింది. అయితే, ఈ చట్ట సవరణ ఆమోదం పొందినంత మాత్రాన తక్షణమే యూపీఐ ద్వారా జరిగే ప్రతి లావాదేవీపై ఛార్జీలు అమల్లోకి వస్తాయనుకోవడం పూర్తిగా అపోహమాత్రమే. 2016 ఏప్రిల్ మాసంలో భారత జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ) కేవలం 21 భాగస్వామ్య బ్యాంకులతో, అత్యంత సాధారణ డిజిటల్ వేదికగా యూపీఐ వ్యవస్థను ప్రారంభించింది. అప్పట్లో ఇది బ్యాంకుల మధ్య నగదు బదిలీ చేసే ఒక సరళమైన సాధనంగా మాత్రమే పరిగణించబడింది. కానీ, 2016నవంబర్‌లో జరిగిన నోట్లరద్దు, అనంతరం వేగవంతమైన స్మార్ట్‌ఫోన్, చౌకైన ఇంటర్నెట్ విప్లవం యూపీ ఐకి అపారమైన ప్రాచుర్యాన్ని తెచ్చిపెట్టాయి. క్రమంగా కూరగాయల విక్రేతలు, తేనీటి కొట్టు యజమానుల నుంచి మొదలుకొని బహుళజాతి కార్పొరేట్ సంస్థలు, సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకులు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఆసుపత్రి ఖర్చులు,ప్రభుత్వ పన్నుల చెల్లింపుల వరకు సమస్త ఆర్థిక వ్యవహారాలకు యూపీఐ ప్రాథమిక చోదక శక్తిగా మారింది. నేడు నెలకు సుమారు 1,300 కోట్లకు పైగా లావాదేవీలు రూ. 20లక్షల కోట్లకు పైబడిన విలు వతో జరుగుతుండటం, ప్రపంచవ్యాప్తంగా నమోదు అవు తున్న మొత్తం రియల్‌టైమ్ డిజిటల్ చెల్లింపులలో ఏకంగా 46శాతానికి పైగా వాటాతో భారతదేశం అగ్రస్థానంలో నిల వడం యూపీఐ సాధించిన అనన్యసామాన్యమైన విజయా నికి అద్దం పడుతోంది. యూపీఐ ఈ స్థాయిలో ప్రజాదరణ పొందడానికి విశ్వవ్యాప్త వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణం వినియోగదారులు, వ్యాపారులపై ఎటువంటి ప్రత్యక్ష సేవా రుసుములు లేకపోవడమే. డిజిటల్




లావాదేవీలను ప్రోత్స హించడం, పారదర్శక ఆర్థిక వ్యవస్థను నిర్మించడం నగదు చలామణిని తగ్గించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం2020 జనవరి 1వ తేదీ నుండి యూపీఐ రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై 'జీరోఎండీఆర్' విధానాన్ని అమల్లోకితెచ్చింది. సాధారణంగా క్రెడిట్ లేదా డెబిట్ కార్డ్ స్వైపింగ్ మెషిన్ల ద్వారా జరిగే చెల్లింపులపై వ్యాపారులు 1 నుండి 2 శాతం వరకు ఎండీఆర్ రుసుమును బ్యాంకులకు చెల్లించాల్సి ఉండేది. కానీ,యూపీఐ విషయంలో ఈ రుసుమును పూర్తిగా రద్దు చేయడంతో చిన్నవ్యాపారులు సైతం ఎలాంటి ఆర్థిక భారం లేకుండా క్యూఆర్ కోడ్‌లను స్వీకరించారు. ఈ ఉచిత సేవల వల్ల వ్యవస్థకు కలిగిన నష్టాన్ని భర్తీ చేసేం దుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా బడ్జెట్‌లో రూ. 1,500కోట్ల నుండి రూ.3,000కోట్ల వరకు ప్రోత్సాహక నిధులను బ్యాంకులకు, ఫిన్‌టెక్ సంస్థలకు కేటాయిస్తూ వస్తోంది. అయితే, లావాదేవీల సంఖ్య పరిమాణం ఏటికేడు ఊహించని రీతిలో పెరిగిపోవడంతో, ఈవ్యవస్థను నడపడానికి అయ్యే నిర్వహణ వ్యయం కూడా ఊహకందని స్థాయికి చేరింది. సురక్షితమైన సాంకేతిక మౌలికవసతులు, భారీ సామర్థ్యం కలిగిన డేటాసర్వర్లు, సైబర్ భద్రతాప్రమాణాలు, మోసాల నివారణ వ్యవస్థలు, నిరంతర నెట్‌వర్క్ విస్త రణ కోసం బ్యాంకులు, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి చెల్లింపు సేవల సంస్థలు,వేలకోట్ల రూపాయలను నిరంతరం వెచ్చించాల్సి వస్తోంది. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, ప్రతి సంవత్సరం యూపీఐ వ్యవస్థ సాంకేతిక నిర్వహణకు రూ.12,000 కోట్లకు పైగా వ్యయం అవుతోంది.ప్రభుత్వం అందించే అరకొర ప్రోత్సాహకాలు ఈ వ్యయాలకు ఏమాత్రం సరిపోకపోవడంతో, తీవ్రమైన ఆర్థిక ఒత్తిడికి గురవుతున్న బ్యాంకులు,ఫిన్‌టెక్ సంస్థలు మర్చంట్ లావాదేవీలపై తిరిగి పరిమిత స్థాయిలో ఎండీఆర్‌ను ప్రవేశపెట్టాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని, రిజర్వు బ్యాంకును పదే పదే కోరుతూ వస్తున్నాయి. ఈ తీవ్రమైన ఆర్థిక భారాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే లోక్‌సభ ఈ చట్ట సవరణకు ఆమోద ముద్ర వేసింది.ఈ చట్టం ఆమోదం పొందిన నేపథ్యాన్ని లోతుగా పరిశీలిస్తే, భవిష్యత్తులో ప్రభుత్వం నిబంధనలు తీర్చిదిద్దినప్పటికీ సామాన్య ప్రజలపై లేదా చిన్న లావాదేవీలపై ఎలాంటి భారం పడే అవకాశం లేదని స్పష్టమవుతోంది. చిన్న మొత్తాల లావాదేవీలు (ఉదాహరణకు రూ. 2,000 లోపు ఉన్నవి), వ్యక్తుల మధ్య జరిగే వ్యక్తిగత నగదు బదిలీలు,వీధి వ్యాపారుల చెల్లింపులను ఈ రుసుముల నుండి పూర్తిగా మినహాయించే అవకాశాలే మెండుగా ఉన్నాయి. కేవలం పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహించే కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి ఈకామర్స్ వేదికలు మరియు పరిమితికి మించి భారీ లావాదేవీలు జరిపే వర్తకులపై మాత్రమే పరిమిత రీతిలో సేవా రుసుములు విధించే ఛాన్స్ ఉంది.

## సిజెపి నిరసనలో పోలీసు చర్యలపై

# విచారణ కమిటీ



### రిటైర్డ్ జడ్జి నాయకత్వంలో ఏర్పాటు: సుప్రీంకోర్టు

### ఆందోళనల్లో 2,873 మంది పాత నేరస్తులు: ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలో జులై 20న జరిగిన విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసులు అతిక్రమించారన్న ఆరోపణలను పరిశీలించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి, మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి తదితరులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ప్రతిపాదిత ఉన్నత స్థాయి కమిటీలో చేర్చాల్సిన ఇతర సభ్యులపై వివిధ పార్టీల నుంచి సూచనలు కోరుతూ, ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నిరసన సందర్భంగా తాము అధిక బలప్రయోగం చేయలేదని ఢిల్లీ పోలీసులు ఖండించినప్పటికీ, జాతీయ రాజధానిలో జులై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసకు సంబంధించిన వీడియో ఫుటేజ్, సిసిటివి రికార్డింగ్‌లను పరిశీలన కోసం కమిటీకి అప్పగించాలని ఆదేశిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈ కమిటీ, మార్చ్ సందర్భంగా జరిగిన హింసకు సంబంధించిన వీడియో ఫుటేజ్, సిసిటివి రికార్డింగ్‌లను, పోలీసుల ప్రతిస్పందనను పరిశీలించి, సుప్రీంకోర్టుకు తగిన చర్యలను సిఫార్సు చేస్తుంది. లైంగిక వేధింపులకు గురయ్యామని ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళా నిరసనకారుల ఫిర్యాదులను కూడా ఈ ప్యానెల్ పరిశీలిస్తుంది.

జులై 20న జరిగిన నిరసనలో 240 మంది పోలీసులు గాయపడ్డారని, ఆ నిరసనలోకి 'చరిత్ర నేరగాళ్లు చొరబడ్డారని ఆరోపిస్తూ, హత్య, అత్యాచారం, అపహరణలు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన 2,873 మంది వ్యక్తులు మినహా, మిగిలిన వారిపై ఉన్న కేసులను కొట్టివేయవచ్చని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. 'చలో సంసద్' నిరసన సందర్భంగా బలప్రయోగం చేయడాన్ని ఢిల్లీ పోలీసులు గట్టిగా సమర్థించుకున్నారు. ఈ ఆందోళనను 'అసాంఘిక శక్తుల్లు', 'చరిత్ర నేరస్తుల్లు హైజాక్ చేశారని, దీని ఫలితంగా శాంతిభద్రతల విఘాతం ఏర్పడి 240 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడ్డారని వారు ఆరోపించారు. సంఘటనా స్థలంలో ఉన్న 92 మందిపై 10కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో 47 మంది 'చరిత్ర నేరస్తుల్లు అని వారు తెలిపారు.

నిరసనకారులపై మితి మీరిన బలప్రయోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్లకు ప్రతిస్పందనగా న్యూఢిల్లీ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ దాఖలు చేసిన అఫిడవిట్‌లో, తమ చర్యలను కోర్టు నియమించిన కమిటీ ద్వారా పరిశీలించు కోవడానికి ఢిల్లీ పోలీసులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్లమెంటు వైపు నిరసనకారులు ముందుకు సాగకుండా నిరోధించడానికి పదేపదే చేసిన హెచ్చరికలు, ప్రయత్నాలను పోలీసులు పట్టించుకోక పోవడంతోనే బలప్రయోగానికి పాల్పడ్డారని ఢిల్లీ పోలీసులు సమర్పించారు. "పోలీసులు బలప్రయోగం చేసిన విషయాన్ని న్యాయస్థానం నియమించిన కమిటీ పరిశీలించవచ్చు. ఢిల్లీ పోలీసులు అటువంటి కమిటీకి పూర్తి సహకారం అందించి, అవసరమైన అన్ని వివరాలను అందిస్తార్లు అని శర్మ అన్నారు.

## పిఎంకేర్స్ ఫండ్ నిధులు రూ.8452.07 కోట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పీఎం కేర్స్ ఫండ్ నిధులు సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ నిధి మొత్తం విలువ రూ. 8,452.07 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడి వ్యూహాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగానే ఈ స్థాయిలో వృద్ధి నమోదైందని తాజా ఆడిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 7,173.03 కోట్లుగా ఉన్న నిధులు, ఏడాది ముగిసే సమయానికి గణనీయంగా పెరిగాయి. గతంలో నిధులన్నీ అధికంగా సేవింగ్స్ ఖాతాల్లోనే ఉండగా, ఇప్పుడు మెరుగైన రాబడి కోసం వాటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించారు. ప్రస్తుతం మొత్తం నిధుల్లో రూ. 6,641 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, కేవలం రూ. 605.41 కోట్లు మాత్రమే సేవింగ్స్ ఖాతాల్లో ఉన్నాయి. అంటే పీఎం కేర్స్ మొత్తం నిధుల్లో దాదాపు 92.8 శాతం ఎఫ్‌డీలలోనే ఉన్నాయి. గడిచిన ఏడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ. 469.38 కోట్ల వడ్డీ లభించగా, సేవింగ్స్ ఖాతాల ద్వారా కేవలం రూ.5.77 కోట్లు మాత్రమే సమకూరింది.వీటితో పాటు స్వదేశీ విరాళాల రూపంలో రూ.479.04 కోట్లు, విదేశీ విరాళాల రూపంలో రూ.92.83లక్షలు అందాయి. వివిధ ఏజెన్సీల నుంచి మరో రూ.324.66కోట్ల రీఫండ్‌లు కూడా ఈ ఖాతాలోచేరాయి. కొవిడ్19 మహమ్మారి విజృంభించిన తరుణంలో, 2020 మార్చి 27న పీఎం కేర్స్ ఫండ్‌ను ఒక పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విపత్కర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశం.

## వందేమాతరం వివాదం: బిజెపిపై ఖర్గే ధ్వజం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వందేమాతరం వివాదంపై తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేయడాన్ని ప్రశ్నించారు. తాము పాడిన వందే మాతరం కొత్తది కాదని చెప్పారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ పాడినదే తాము పాడామని స్పష్టం చేశారు. అది నేరమైతే వారిపైనా కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారు. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం ఆలాపనపై వివాదం మొదలైంది. ఖర్గే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత వందేమాతరం ఆలపించారు. అయితే పార్టీ నిర్ణయం ప్రకారం తొలి రెండు చరణాలతో ముగించాల్సిన గేయాన్ని పూర్తిగా ఆలపించారు. గాయకులు కొనసాగించడాన్ని సోనియా గాంధీ గమనించి వారిని ఆపేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు అందింది. వందేమాతరం ఆలాపనను అడ్డుకునేందుకు ప్రయత్నించారంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదుదారు కోరారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ గత 18 ఏళ్లుగా కాంగ్రెస్ పాడుతున్న వందేమాతరం గీతాన్నే తాజాగా కూడా ఆలపించామని చెప్పారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే గేయాన్ని ఆలపించిందని గుర్తుచేశారు. వందేమాతరం విషయంలో కాంగ్రెస్ ఎప్పుడో తీర్మానం చేసిందని ఖర్గే తెలిపారు. భవిష్యత్తులో మరో ప్రభుత్వం వస్తే, వారు ఏ నిర్ణయం తీసుకుంటే అది అందరూ పాటించాలా అని ప్రశ్నించారు.

## జార్ఖండ్‌లో కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల ఆందోళన

**రాంచి,ఆగస్టు 18:**జార్ఖండ్‌లోని రాంచీలో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు మంగళవారం రాష్ట్ర సచివాలయంఎదుట ఆందోళనకు దిగారు. ఓవక్క జెపిఎస్‌సిని రద్దు చేయాలంటూ ఉద్యోగార్థుల నిరసనతో పరీక్షలను మొత్తం రద్దుచేసిన జార్ఖండ్‌ప్రభుత్వం నిర్ణయంతో ఇపుడు జెపిఎస్‌సిలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఆందోళనకు దిగారు. దీనితో జార్ఖండ్ ఉద్యమంలో రివర్స్ గేర్‌ప్రారంభం అయినట్లు తెలుస్తోంది.జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షతో పాటు 2014 నుంచి నిర్వహించిన అన్ని ఔట్‌సోర్సింగ్ పరీక్షలను రద్దు చేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి.

## విద్యార్థులపై ఎకె47తో కాల్పులు నిజమే!



### సుప్రీంకోర్టులో బీహార్ ప్రభుత్వం అఫిడవిట్

### శివాన్ జిల్లా ఎస్పీని బదలీ చేసిన సర్కార్

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** నీట్ యుజి పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా నిరసనల్లో భాగంగా బీహార్‌లో విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరపడం నిజమేనని మంగళవారం సుప్రీంకోర్టుకు బిహార్ ప్రభుత్వం తెలిపింది. జులై 25న సివాన్‌లో జరిగిన ఈ కాల్పుల్లో ఎవరూ తీవ్రంగా గాయపడలేదని స్పష్టం చేసింది. ఆందోళనకారుల మధ్య కానిస్టేబుల్ చిక్కుకుపోవడంతో ఎకె47తో కాల్పులు జరపాల్సి వచ్చిందని కోర్టు దృష్టికి తెచ్చింది. ఈ మేరకు అఫిడవిట్ ద్వారా సుప్రీంకోర్టుకు కీలక విషయాలను వెల్లడించింది. ఈ సందర్భంగా జులై 25న నిరసనల్లో సివాన్‌లోని జెపి చౌక్ వద్ద నిరసనకారుల మధ్య కానిస్టేబుల్ అభిషేక్ కుమార్ చిక్కుకున్నాడని బిహార్ ప్రభుత్వం పేర్కొంది. వారి నుంచి తప్పించు కునేందుకు కానిస్టేబుల్ ఎకె47తో గాలిలోకి నాలుగు రౌండ్ల కాల్పులు జరిపాడని తెలిపింది. మరోవైపు, నిరసనకారులను చెదరగొట్టేందుకు హతి చౌక్ సమీపంలో అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నిలేశ్ కుమార్ సింగ్ కూడా 9ఎంఎం పిస్టల్‌తో రెండురౌండ్లు కాల్పులు జరిపారని చెప్పుకొచ్చింది. పోలీసుల చర్యలో ముగ్గురు ఆందోళనకారులకు చిన్నపాటి తుపాకీ గాయాలయ్యాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, వారు ఎకె47 బుల్లెట్లతో గాయపడలేదని తేల్చిచెప్పింది. అలాగే, కానిస్టేబుల్ కాల్పులు జరిపిన ప్రదేశంలో ఎవరూ గాయపడలేదని పేర్కొంది. మరోవైపు, కానిస్టేబుల్ అభిషేక్ కుమార్‌ను సస్పెండ్ చేశామని, అతను శాఖా పరమైన విచారణను ఎదుర్కొంటున్నాడని అఫిడవిట్‌లో బిహార్ ప్రభుత్వం తెలిపింది. ఆరోజు భద్రతా దళాలు సంయమనం పాటించాయని, నిరసనకారులకు ఎలాంటి హాని కలిగించేందుకు ప్రయత్నించలేదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులపై విపరీతమైన బలప్రయోగం చేయలేదనీ వివరించింది. ప్రభుత్వ ఆస్తుల నష్టం, అధికారులపై దాడులకు నిరసనల్లో చేరిన అసాంఘిక శక్తులే కారణమని ప్రభుత్వం ఆరోపించింది. అలాగే నిరసనలకు సంబంధించిన జిల్లాల వారీ వివరాలనూ సుప్రీంకోర్టుకు సమర్పించింది.

**జిల్లా ఎస్పీ బదలీ:**
విద్యార్థులపై ఎకె47తో గాల్లో కాల్పుల జరిపిన ఉదంతం కలకలం రేపుతున్న నేపథ్యంలో బీహార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శివాన్ జిల్లాలో ఈ ఘటన జరిగిన నేపథ్యంలో ఎస్పీ పురన్ కుమార్‌ను జిల్లా బాధ్యతల నుంచి తప్పించింది. ఎకె47తో కాల్పులు జరిపిన కానిస్టేబుల్‌పై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడింది. పురన్ కుమార్ ఝా స్థానంలో భరత్ సోనీ శివాన్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. భోజ్‌పూర్‌లో మరో కార్యకర్త ఎన్‌కౌంటర్‌తో కలకలం రేగడంతో జిల్లా ఎస్పీపై కూడా వేటు పడింది. భోజ్‌పూర్ బాధ్యతలను మరో అధికారి అవధేశ్ దీక్షిత్‌కు ప్రభుత్వం అప్పగించింది.

## 'హార్ముజ్' కొత్త అమెరికా ప్రాంతం!

### ట్రూత్‌లో ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్, ఆగస్టు 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హార్ముజ్ జలసంధిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో హోర్ముజ్ జలసంధిని న్యూ యూఎస్ టెరిటరీగా పేర్కొంటూ ఓ మ్యాప్‌ను పోస్ట్ చేశారు. వాషింగ్టన్–టెహ్రాన్ మధ్య శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు నిర్ణయించిన 60 రోజుల చర్చల గడువు ముగిసిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది.ట్రంప్ షేర్ చేసిన మ్యాప్‌లో పర్షియన్ గల్ఫ్ ప్రవేశద్వారం వద్ద ఇరాన్, ఒమన్ మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధి చుట్టూ ఓ వృత్తాన్ని గీసి, దానిపై కొత్త యుఎస్‌ప్రాంతం అని పేర్కొన్నారు.ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ మాట్లాడుతూ హార్ముజ్ జలసంధిపై ట్రంప్‌కు ఉన్న భ్రమ త్వరలో తొలగిపోతుందని హెచ్చరించారు. త్వరలో హార్ముజ్ జలసంధిపై ట్రంప్ భ్రమ తొలగిపోతుంది లేదంటే ఆ భ్రమలో ఉన్న వ్యక్తి భ్రమలను మేమే సరిదిద్దుతామని ఘాటుగా వ్యాఖ్యానించారు. హార్ముజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని ట్రంప్ గతంలోనూ ప్రకటించారు. పోలీస్ అకాడమీ సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఇంటెలిజెన్స్‌లో మాట్లాడుతూ త్వరలోనే హార్ముజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని అన్నారు. అంతకు ముందు కూడా హార్ముజ్‌పై అమెరికాకు పూర్తి నియంత్రణ ఉందని ట్రంప్ పేర్కొన్నారు. వారికి నియంత్రణ లేదు. పూర్తి నియంత్రణ మనదే. అది మనదే అని విలేకరులతో అన్నారు. అమెరికా నౌకాదళం జలసంధిలోని మైన్లను తొలగించేందుకు చర్యలు చేపట్టిందని కూడా వెల్లడించారు.ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది.హార్ముజ్ జలసంధి ఇరాన్‌కు చెందినదే, ప్రస్తుతం కూడా ఇరాన్‌దే, భవిష్యత్తులోనూ ఇరాన్‌దేనని ఘరీబాబాదీ స్పష్టం చేశారు. జలసంధిని ఎప్పుడు మూసివేయాలి, ఎప్పుడు తెరవాలన్నది ఇరాన్ ఆదేశాల ప్రకారమే జరుగుతుందన్నారు. ప్రపంచ చమురు సరఫరాకు కీలక మార్గంహోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన సముద్ర రవాణా మార్గాల్లో ఒకటి. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం ప్రారంభమయ్యే ముందు ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో దాదాపు 20 శాతం ఈ జలసంధి గుండా రవాణా అయ్యేది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇక్కడ నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి.ఇరాన్ ఈ జల మార్గంలో రవాణాను పరిమితం చేస్తూ యుద్ధంలో ఒత్తిడి పెంచేందుకు దీనిని వ్యూహాత్మక సాధనంగా ఉపయోగిస్తోంది. ట్రాన్సిట్ మార్గంపై ఇరాన్–ఒమన్ ఒప్పందంఇదిలా ఉండగా హార్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలకు సంబంధించిన ట్రాన్సిట్ మార్గం మ్యాప్‌పై ఇరాన్, ఒమన్ మధ్య అవగాహన కుదిరింది. దీనిపై సంయుక్త ప్రకటనతో కూడిన తుది ఒప్పందాన్ని రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది.

## మూడు రాష్ట్రాలకు పార్టీ కొత్త ఇన్‌ఛార్జిలు: బిజెపి ఎన్నికల గేమ్ ప్లాన్ షురూ..

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:**రాబోయే అసెంబ్లీ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది భారతీయ జనతా పార్టీ. గెలుపే లక్ష్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులు చేసింది. ఇప్పటికే జాతీయ కార్యవర్గాన్ని పూర్తిగా ప్రక్షాళణ చేసింది. పలు కొత్త ముఖాలకు ఇందులో చోటు కల్పించింది. సీనియర్లకు కీలక బాధ్యతలను అప్పగించింది. రాష్ట్రాల వారీగా సమీకరణాలను బేరీజు వేసుకుని పాత, కొత్త నేతల కలయికతో ఈ నూతన కార్యవర్గాన్ని పునర్నిర్మించుకుంది. దీనికి కొనసాగింపుగా మరిన్ని నిర్ణయాలను తీసుకుంటోంది బీజేపీ హైకమాండ్. ఇందులో భాగంగా మూడు రాష్ట్రాలకు నూతన ఇన్‌ఛార్జీలను నియమించింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్‌కు ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటన విడుదల చేశారు. ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రధాన ఇన్‌ఛార్జ్ పదవి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వినోద్ తావ్డేకు లభించింది. తోడుగా జగదీష్ ఈశ్వర్‌భాయ్ పటేల్ కో ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులు అయ్యారు. యూపీలో క్షేత్రస్థాయి సమీకరణాలను సమన్వయం చేయడంలో వినోద్ తావ్డే అనుభవం పార్టీకి ఉపయోగపడుతుందని భావిస్తోన్నారు. వ్యవస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న పంజాబ్ లో రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు సతీష్ పూనియా అపాయింట్ అయ్యారు. అదే సమయంలో.. బీజేపీకి తిరుగులేని కోటగా ఉంటూ వస్తోన్న గుజరాత్ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు తరుణ్ చుగ్‌ను రంగంలోకి దించారు. గుజరాత్‌లో సుదీర్ఘకాలంగా ఉన్న పట్టును మరింత పటిష్ఠం చేయడానికి ఆయన నాయకత్వాన్ని ఎంచుకుంది పార్టీ హైకమాండ్. ఇక నుంచైనా పార్టీ జాతీయ నూతన కమిటీలో కూడా పలు మార్పులు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు ఇవ్వగా, ఆర్ఎస్ఎస్ మాజీ నేత రామ్ మాధవ్‌ను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియా మరోసారి జాతీయ ఉపాధ్యక్షురాలిగా తన స్థానాన్ని నిలుపుకొన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ జాతీయ కోశాధికారిగా నియమితులయ్యారు.



## సిఎం విజయ్ వందరోజులపాలనపై అసెంబ్లీకి నివేదిక

**చెన్నై,ఆగస్టు 18:** తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన విజయ్ విజయవంతంగా 100 రోజుల పాలనను పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పరిపాలనా శైలి, పనితీరుపై మంత్రి ఆధవ్ అర్జున పలు విషయాలను వెల్లడించారు. అసెంబ్లీలో పబ్లిక్ వర్క్స్ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. విజయ్ పనితీరు, క్రమశిక్షణ తమను ఆశ్చర్యపరుస్తోందని కొనియాడారు. సాధారణంగా నటుల నుంచి రాజకీయ నాయకులుగా మారినవారు నెమ్మదిగా పరిపాలనను అలవాటు చేసుకుంటారని, విజయ్ మాత్రం దీనికి భిన్నమని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుంచే పూర్తి స్థాయి పాలకుడిగా మారిపోయారని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఊహించని పరిణామం విజయ్ ప్రస్తుతం రోజుకు సుమారు 18 నుంచి 20 గంటల పాటు అవిశ్రాంతిగా పని చేస్తోన్నారని, ప్రజా సేవలో తీరిక లేకుండా గడుపుతున్నారని ఆధవ్ అర్జున వెల్లడించారు. విజయ్ దినచర్య ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకే ప్రారంభమవుతుందని చెప్పారు. ఆ సమయంలోనే వివిధ శాఖల మంత్రులకు స్వయంగా ఫోన్లు చేస్తూ, ఆయా విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి పథకాల పురోగతిని, తాజా పరిస్థితులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు.





## కొందరు ఔట్.. కొందరికి ప్లేస్‌మెంట్

# కేబినెట్ ప్రక్షాళన!

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేబినెట్ ప్రక్షాళనకు సిద్ధమైన ప్రధాని మోడీకి ఆ అవకాశం లభించలేదు. దీనికి బిజీ షెడ్యూల్ తో పాటు మరికొన్ని ఇతర కారణాలు కూడా ఉన్నాయి. దీంతో పార్లమెంట్ సమావేశాల తర్వాత కేబినెట్ ప్రక్షాళన వాయిదా పడింది. అయితే ఊహించిన విధంగానే ఇప్పుడు కేబినెట్ మార్పులకు పావులు కదులుతున్నాయి. కానీ పార్లమెంట్ సమావేశాలకు ముందు అనుకున్న మార్పులే కాదు, అనుకోని మార్పులు కూడా ఇందులో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాక్రోచ్ ఉద్యమం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, పీయూష్ గోయల్‌కు బీజేపీలో కోశాధికారి పదవి, అంతకు ముందే మరో ఇద్దరు కేంద్రమంత్రులు రవ్‌నీత్ బిట్టూ, జార్జికురియన్‌ల రాజీనామాలు ఇలా ఈ మధ్య కాలంలో చాలా మార్పులు జరిగాయి. ఇప్పుడు బీజేపీ జాతీయ కార్యవర్గం ఏర్పాటు సందర్భంగా పలువురు కేంద్రమంత్రులకు రాష్ట్రాల ఇన్ చార్జ్ బాధ్యతలు కూడా దక్కాయి. దీంతో ఇప్పుడు కేబినెట్ ప్రక్షాళన మరింత ఉత్కంఠ భరితంగా మారింది. ఇందులో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్‌కు కూడా అవకాశం దక్కబోతోందన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన నిన్న ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. దీంతో ఉద్ధవ్ శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఈ ప్రచారాన్ని మరోమారు ముమ్మరం చేశారు. దీంతో ఫడ్నవీస్ స్పందించక తప్పలేదు. తాను ఢిల్లీకి వచ్చినప్పుడల్లా ఇలాంటి ఊహాగానాలు మొదలవుతాయని, కానీ వాటిలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యత మేరకు మహారాష్ట్రలోనే ఉన్నానని, ఇకపైనా ఇక్కడే ఉంటానని ఫడ్నవీస్ తేల్చేశారు. మరోవైపు కేంద్రమంత్రి వర్గంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్థాన చలనం తప్పదని తెలుస్తోంది. ఆమె స్థానంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను నియమించేందుకు ప్రధాని మోడీ సిద్ధమవుతున్నారు. దీంతో పాటు యూపీ, పంజాబ్ వంటి ఎన్నికలు జరిగే రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది ఎంపీల్ని కేబినెట్లోకి తీసుకునే ఛాన్స్ ఉంది. వీరిలోనూ సామాజిక సమీకరణాల వారీగా అవకాశాలు దక్కుతాయని భావిస్తున్నారు. ఇక ఈసారి కేబినెట్ విస్తరణలో తెలుగు రాష్ట్రాలకు అవకాశం ఉండబోదని తెలుస్తోంది.

## ఇమ్రాన్‌ను తక్షణమే ఆస్పత్రికి తరలించండి


### పాకిస్థాన్ సుప్రీంకోర్టు ఆదేశం



**ఇస్లామాబాద్, ఆగస్టు 18:**పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు భారీ ఊరట లభించింది. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించాలని అక్కడి అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ వైద్య నివేదికలను ఉటంకిస్తూ కుటుంబసభ్యులు, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ (పిటిఐ) నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాన్ని పిటిఐ అధికార ప్రతినిధి జుల్ఫికర్ బుఖారీ స్వాగతించారు. ఈ చర్యలు ముందే తీసుకుని ఉంటే ఆయన ఆరోగ్యం ఇంతగా క్షీణించి ఉండేది కాదని పేర్కొన్నారు. ఇమ్రాన్ పూర్తిగా కోలుకునే వరకు ఆయనను ప్రైవేట్ వైద్యుల సంరక్షణలోనే ఉంచాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్ వైద్య నివేదికలను తాను నిపుణులతో కలిసి పరిశీలించానని, ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోందని వారు చెప్పారని పేర్కొన్నారు. మూడేళ్ల జైలు జీవితం, ఒంటరితనం వల్ల ఆయన తీవ్రమైన ఒత్తిడి, మానసిక, శారీరక సంబంధమైన సమస్యలను ఎదుర్కొంటున్నార న్నారు. గత ఏడు నెలలుగా తన కుటుంబం, పార్టీనేతలు ఎలా ఉన్నారనే విషయాలతో పాటు.. బయట కూడా అసలేం జరుగుతుందో ఆయనకు తెలియదు. అందుకే ఇమ్రాన్ రోజురోజుకు మరింత కుంగిపోతున్నారు' అని పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై దాడి: ఒకరు మృతి



**టెహ్రాన్, ఆగస్టు 18:** హార్ముజ్ జలసంధిలో ఓ వాణిజ్య నౌకపై మంగళవారం దాడి జరిగింది. గుర్తు తెలియని క్షిపణి లేదా డ్రోన్ నౌకను ఢీకొట్టడంతో ఇంజిన్ రూమ్ పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఒక మృతి చెందినట్లు బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సంస్థ వెల్లడించింది. నౌకలోని మిగతా సిబ్బందిని కాపాడేందుకు ఒమర్ కోస్ట్‌గార్డ్ సిబ్బంది రంగంలోకి దిగినట్లు తెలిపింది. దాడి ఎవరు చేశారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని పేర్కొంది. ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగు తున్న వేళ ఈ దాడి చోటుచేసుకోవడం గమనార్హం.

## ప్రధాని కార్యాలయంపై డ్రోన్ల దాడి



**బాగ్దాద్, ఆగస్టు 18:** ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతీయ ప్రభుత్వ ప్రధాని మస్రూర్ బర్జానీ కార్యాలయంపై సోమవారంరాత్రి డ్రోన్ల దాడి జరిగింది. ఈ దాడులకు ఇరానే కారణమని కుర్దిస్థాన్ భద్రతా సంస్థ ఆరోపించింది. ప్రధాని కార్యాలయంతోపాటు కుర్దిస్థాన్ భద్రత, నిఘా సంస్థ 'పరా స్తిన్' అధిపతి నివాసాన్ని కూడా డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయని తెలిపింది. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. కీలక ప్రభుత్వ, భద్రతా వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగించే పరిణామమని తెలిపింది. కుర్దిస్థాన్ ప్రధాని మస్రూర్ బర్జానీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

## కేంద్రమంత్రి జెపినడ్డాకు యాంజియోప్లాస్టీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో చేరిన ఆయనకు వైద్యులు యాంజియోప్లాస్టీ నిర్వహించారు. ముందురోజు ఈ చికిత్స జరగ్గా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిమ్స్ వర్గాలు నేడు ఒక అధికారిక ప్రకటనలో తెలిపాయి. ఆయనను కార్డియాలజీ విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు పేర్కొన్నాయి. ఈనెల 13వ తేదీ సాయంత్రం జేపీ నడ్డాకు కాస్త నలతగా అనిపించడంతో కుటుంబ సభ్యులు ఆయనను ఎయిమ్స్‌కు తరలించారు.

## బీహార్‌లో భారీగా ఐపిఎస్‌ల బదలీలు..


**పాట్నా,ఆగస్టు 18:** బీహార్‌ప్రభుత్వం మంగళవారం భారీస్థాయిలో పోలీసు అధికారుల బదిలీలు చేపట్టింది. మొత్తం 17మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. పోలీసుల చర్యలపై తీవ్ర వివాదాలు చెలరేగిన భోజ్‌పూర్, సివాన్ జిల్లాల ఎస్పీలను కూడా బదిలీ చేయడం గమనార్హం.రాష్ట్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సివాన్ ఎస్పీ పూరణ్‌కుమార్ ఝాను బదిలీ చేశారు.గతనెల 25న సివాన్‌లో విద్యార్థుల ఆందోళన సందర్భంగా పోలీసు బలగాల ఆధ్వర్యంలో ఏకే47 రైఫిల్‌ను వినియోగించిన ఘటన తీవ్ర దుమారం రేపింది.

## డంపర్‌ను ఢీకొన్న వాహనం: 8 మంది కూలీలు మృతి, 32 మందికి గాయాలు



**గ్వాలియర్,ఆగస్టు 18:** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై ఉన్న ఆవులను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న డంపర్ ట్రక్కును ఢీకొట్ట డంతో ఎనిమిదిమంది కూలీలు మృతి చెందారు. మరో 32 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన భిండ్‌గ్వాలియర్ జాతీయ రహదారిపై చిమ్కా గ్రామం సమీపంలో రాత్రి సుమారు 1 గంటకు ఈ ప్రమాదం జరిగింది.

## చంపత్‌రాయ్, మిశ్రాలకు క్లీన్‌చిట్



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** అయోధ్యరామాలయంలో విరాళాలను చోరీ చేసిన కేసులో సిట్ తన నివేదికను రిలీజ్ చేసింది. రామ జన్మభూమి ట్రస్టు మాజీ చీఫ్ చంపత్ రాయ్‌తో పాటు మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు ఆ కేసులో సిట్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో 8 మందిని యూపీ సర్కారు అరెస్టు చేసింది. వాస్తవానికి విరాళాలు చోరీ అయినట్లు తెలిసిన కొన్ని రోజులకే చంపత్ రాయ్ తన రాజీనామాను సమర్పించారు. రామాలయ ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు స్పెషల్ ఇన్‌వెస్టిగేటింగ్ టీమ్ క్లీన్ చిట్ ఇచ్చింది. ట్రస్టులో సభ్యుడిగా ఉన్న అనిల్ మిశ్రాకు కూడా సిట్ క్లియరెన్స్ ఇచ్చింది.



మంగళవారం హైదరాబాద్‌లోని అబిడ్స్ ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు

## ఘనంగా 'ఇస్కాన్' 50 వసంతాల ఉత్సవాలు

### పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్ (గోషామహాల్), ఆగస్టు 18, ప్రభాతవార్త:** అబిడ్స్‌లోని ఇస్కాన్ రాధా మధనమోహన మందిరం 50 వసంతాల ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ముగిసాయి. అబిడ్స్‌లోని ఇస్కాన్ మందిరంలో నిర్వహించిన స్వర్ణోత్సవాల ముగింపు ఉత్సవాలకు గవర్నర్ శివప్రతాప్‌శుక్లా దంపతులు ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరం పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మందిరం లోని రాధా కృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇస్కాన్ భక్తులను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్‌శుక్లా ప్రసంగిస్తూ భక్తి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా కొనసాగం పట్ల నిర్వా హకులను అభినందించారు. మందిరంలో గవర్నర్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కాగా నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తి ఉద్యమానికి శ్రీలప్రభుపాదులు చేసిన సేవలను వివరించారు. మైదానంలో నీటితో నింపిన కృత్రిమ కొలనులో పూలతో ఆలకరించిన తేలియాడే మండపంపై రాధాకృష్ణుల విగ్రహాలను భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వాగతం ద్వారం నుంచి మొదలుకుని ప్రధాన వేదిక వరకు ఇరువైపులా రాధాకృష్ణుల చిత్రపటాలు ఎంతో ఆకుట్టకున్నాయి.

## ప్రైవేటుకు భూమి లీజుపై వ్యతిరేకత

### జిఓ రద్దు చేసిన మైనార్టీ సంక్షేమ శాఖ

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** సరైన విధానాన్ని పాటించకుండా, హైదరాబాద్ రైదుర్గ్ సమీపంలో ఒక ఎకరం పైగా ఉన్న విలువైన భూమి లీజుకు సంబంధించిన జీవోను రద్దు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉర్దూ ఘర్‌కమ్‌షాదీఖానా, వాణిజ్య సముదాయం నిర్మాణం కోసం ఒక ప్రైవేట్ డెవలపర్‌కు 30 ఏళ్ల లీజుకు ఎకరం పైగా భూమిని కేటాయించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపధ్యంలో మైనారిటీ సంక్షేమ శాఖ, ఆ ప్రభుత్వ ఉత్తర్వును రద్దు చేసింది. 20 సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం, సెరిలింగంపల్లిలోని షేక్‌పేట్, దర్గా హుస్సేన్ షా వలీ గ్రామంలోని సర్వే నంబర్ 29లో ఒక ఎకరం పైగా భూమిని ఉర్దూ అకాడ మీకి కేటాయించింది. 10 సంవత్సరాల క్రితం ఒక షాదీఖానా నిర్మించాలని ప్రతిపాదించి, దానికోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు కూడా కేటాయించింది. అయితే, గత నెల జూలై మొదటి వారంలో మైనారిటీ సంక్షేమ శాఖ అకస్మాత్తుగా ఒక జీవో జారీ చేసింది. దాని ప్రకారం, బిల్డ్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (బిఓటి) పద్ధతిలో ఉర్దూ ఘర్‌కమ్‌షాదీఖానా, ఒక వాణిజ్య సముదాయం నిర్మించడం కోసం, ఆ భూమిని ఇన్ఫ్రా అండ్ కన్స్ట్రక్షన్స్ అనే సంస్థకు 30 సంవత్సరాల లీజుకు కేటాయించింది. ప్రైవేటు సంస్థకు ఈ భూమి కేటాయింపుపై ముస్లిం నాయకులు కూడా తీవ్ర అభ్యంత రాలు వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం చివరకు జీవోను రద్దు చేసింది.

## పోలీసు కస్టడీకి ట్రైనీ ఐపిఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిని లైంగికంగా వేధించిన కేసులో అరెస్టయి మూడు వారాలు గా చంచల్‌గూడ జైల్లో వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని అత్తాపూర్ పోలీసులు మంగళవారం ఉదయం కోర్టు ఆదేశాల మేరకు కస్టడీలోకి తీసుకున్నారు. ఉదయ్ కృష్ణారెడ్డిని ఉప్పర్‌పల్లి కోర్టు రెండు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ సోమవారం ఆదేశాలు ఇవ్వడం తెలిసిందే. ఈ ఆదేశాల మేరకు ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై నమోదైన కేసును విచారిస్తున్న అత్తాపూర్ పోలీసులు చంచల్‌గూడ జైలుకు ఉ దయం పది గంటల సమయంలో వెళ్లి అతన్ని కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి. తద నంతరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీని తరువాత రాజేంద్రనగర్ ఎసిపి కార్యాలయంలో విచారించినట్లు సమాచారం. ఈ విచారణలో అ త్తాపూర్ పోలీసులతో పాటు మహిళా భద్రతా విభాగం అధికారులు కూడా వున్నారని తెలిసింది. ఇదివరకు ఒకసారి రెండు రోజులపాటు కస్టడీలో వున్న ఉదయ్ కృష్ణారెడ్డికి ఇది రెండవ దఫా పోలీసు కస్టడీ. బుధవారం ఇతన్ని తిరిగి జైలుకు తరలించనున్నారు. మొదటి రోజు కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు ఆరు గంటల పాటు విచారించినట్లు తెలిసింది.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి డా.సి.లక్ష్మారెడ్డి

## ఇకనైనా దుష్ప్రచారం ఆపండి

### టిమ్స్ భూసేకరణ, స్థలాల గుర్తింపు బిఆర్ఎస్ హయాంలోనే

### మీడియా సమావేశంలో మాజీమంత్రి డా.సి.లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 18, ప్రభాతవార్త :** సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవం సందర్భంగా పదేళ్ల కేసీఆర్ పాలన పై సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని, ఇపుడే కాంగ్రెస్ పార్టీ పుట్టింది గతం లో ఎన్నడూ రాష్ట్రాన్ని పాలించలేదు అన్నట్టుగా రేవంత్ రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 80 యేళ్లలో 55 యేండ్లకు పైగా కాంగ్రెస్ పాలించి కనీసం మంచి నీళ్ల కూడా సరిగా ఇవ్వలేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము పాలించింది తొమ్మిదన్నరేళ్ళే అని అందులో రెండేళ్లు కరోనా సమయమే ఉందన్నారు. ఏడున్నరేళ్లలో కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ఒక ప్రణాళిక ప్రకారం రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. టిమ్స్ ఆలోచన, స్థలాల గుర్తింపు, భూసేకరణ, సమస్యల పరిష్కారం అన్నీ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేశామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐదు వైద్య కళాశాలలు ఉంటే బీఆర్ఎస్ హయాంలో 34కు పెరిగాయని చెప్పారు. మెడిసిన్ చదవాలన్న పేద విద్యార్థులకలను సాకారం చేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. మెడికల్ సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇపుడు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా వైద్య విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. జిల్లా ఆసుపత్రుల్లో ఐసీయూ లేని పరిస్థితి కాంగ్రెస్ హయాంలో ఉండేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ చర్యలతో ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు మాయమయ్యాయని, కోవిడ్ కంటే ముందు రాష్ట్రంలో 1400 ఆక్సిజన్ పడకలు ఉంటే బీఆర్ఎస్ హయాంలో 34 వేలకు పెంచామన్నారు. బీఆర్ఎస్ అన్నీ సిద్ధం చేసిన, పనులు చేసిన వాటిని పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండేళ్ల పాటు పట్టిందన్నారు. ఏడాదిలోనే సనత్ నగర్ టిమ్స్ పూర్తి కావాల్సి ఉంది కానీ, కేసీఆర్‌కు పేరు వస్తుందని ఆలస్యం చేశారని విమర్శించారు. బస్తీ దవాఖానాలను కేసీఆర్ హయంలోనే ప్రారంభించుకున్నామన్నారు.

# ఎన్ఎండిసికి రూ.2,007 కోట్లకు పెరిగిన లాభం

### ఉత్పత్తిలో 26 శాతం వృద్ధి నమోదు

### రూ.6,795 కోట్లకు చేరిన టర్నోవర్

### సిఎండి అమితావా ముఖర్జీ

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ప్రభుత్వరంగ మైనింగ్ సంస్థ, భారత్ అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తి దారు అయిన జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండిసి) వృద్ధి దిశగా దూసుకుపోతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జూన్ 30తో ముగిసిన మొదటి త్రైమాసికంలో వచ్చిన రూ.1,969 కోట్ల నుండి ప్రస్తుత 2026-27లోని అదే సమయానికి పన్ను అనంతర లాభం 2 శాతం పెరిగి రూ.2,007 కోట్లకు వృద్ధి సాధించిందని ఎన్ఎండిసి సిఎండి అమితావా ముఖర్జీ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రూ.6,634 కోట్లుగా ఉన్న సంస్థ టర్నోవర్ గత నెలాఖరుకు 2 శాతం పెరిగి రూ.6,795 కోట్లకు చేరిందని తెలిపారు. అలాగే ఎన్ఎండిసి తొలి క్వార్టర్‌లో 15.12 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేసిందన్నారు. ఇది గత ఏడాది ఇదే సమయానికి నమోదైన 11.99 మిలియన్ టన్నుల కంటే 26 శాతం ఎక్కువ అని వివరించారు. అదే సమయంలో అమ్మకాలు గత ఏడాదితో పోలిస్తే 2 శాతం పెరిగి 11.52 మిలియన్ టన్నుల నుండి 11.73 మిలియన్ టన్నులకు చేరుకున్నాయన్నారు.
అధిక ఉత్పత్తి, మెరుగైన లాభదాయకతతో కార్యాచరణ స్థితి స్థాపకత, వ్యూహాత్మక క్రమశిక్షణను ప్రదర్శిస్తూ, నవరత్న పీఎస్‌యూ అయిన తమ సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరాన్ని పటిష్టమైన పునాదిపై ప్రారంభించిందని చెప్పారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 60 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని 2030 నాటికి 100 మిలియన్ టన్నులకు పెంచే దిశగా సంస్థ పురోగమిస్తోందన్నారు. ప్రస్తుతం తమ దృష్టి అంతా ఉత్పత్తి పరిమాణాన్ని పెంచడం, ఉత్పాదకతను మెరుగుపరచడం, ఖనిజ వనరుల నుండి మరింత విలువను రాబట్టడంపై ఉందని స్పష్టం చేశారు. దేశం మరింత పెద్ద, స్వయం సమృద్ధిగల పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థ వైపు పయనిస్తున్న తరుణంలో దేశ తదుపరి వృద్ధి దశకు అవసరమైన ఇనుప ఖనిజాన్ని సమకూర్చడంలో ఎన్ఎండిసి కీలక పాత్ర పోషిస్తోందని సిఎండి అమితావా వెల్లడించారు.

## సాగుతోనే భవిష్యత్తు: మంత్రి తుమ్మల

### ఉద్యాన కళాశాలలో రీసెర్చ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, వైస్‌ఛాన్సలర్ డా. రాజిరెడ్డి, డైరెక్టర్ షేక్‌యాష్మిన్ బాషా తదితరులు

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 18, ప్రభాతవార్త :** సాగుతోనే భవిష్యత్తు అని, ఆ దిశగా రైతు నిలదొక్కుకునే పద్ధతులు రావాలి, అదే సందర్భంలో ప్రయోగ శాలలో జరిగిన పరిశోధన ఫలితాలు రైతులకు చేరాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లో కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన కళాశాలలో రూ. 10 కోట్లతో నిర్మించ నున్న హార్టికల్చర్ రీసెర్చ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. అదే విధంగా సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ కూరగాయల ఎగ్జిబిషన్ తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామీణ యువత ఆవిష్కరణలు భేష్ అని అన్నారు. వ్యవసాయంలో అవసరాలే ఆవిష్కరణలకు దారి తీస్తున్నా యన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాలు లాభసాటిగా ఉండాలంటే ప్రతి ఆధునిక టెక్నాలజీ రైతుకు చేరాలి అని, చిన్న, సన్న కారు రైతులకు ఆధునాతన సాగు పద్ధతులు చేరాలి, రైతులు సొంతంగా విత్తనోత్పత్తి చేసుకునే రకాలు శాస్త్రవేత్తలు రూపొందించి రైతులకు అందించాలిఖి అని అన్నారు.
కరోనా టైంలో అన్ని ఇతర బిజినెస్ లు బంద్ అయితే కేవలం వ్యవసాయమే సాగింది అని గుర్తు చేశారు. పామ్ ఆయిల్ సాగులో తెలంగాణ నెంబర్ వన్ స్థానానికి ఎదిగిందని, 2, 3 సంవత్సరాలలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగు చేరుకుంటున్నదన్నారు. రాష్ట్రంలో 70శాతానికిపైగా కూరగాయల కొరత ఉందని, బీహార్ నుండి కూరగాయలు దిగుమతి చేసుకోవటం మంచి పరిణామం కాదని అన్నారు. వర్సిటీ ల్యాండ్ కాపాడుకుంటెనే భవిష్యత్తు ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. ఎల్ నినో పరిస్థితులు ఎదుర్కొనేందుకు ముందుగానే ఏప్రిల్ నుండే కంటెన్జెన్సీ ప్రణాళిక సిద్ధంగా ఉంచా మని వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్ర మోహన్ అన్నారు.
అధిక దిగుబడినిచ్చే, చీడ, పీడలను తట్టుకునే ఉద్యాన పంట రకాలను రూపొం దించాలని ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాష్మిన్ బాషా అన్నారు. కూరగాయలు, పూలు, ఔషధ మొక్కలు, విత్తనాల పై సమగ్ర పరిశోధనలు చేపట్టేందుకు హార్టికల్చర్ రీసెర్చ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నామని వర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. డి. రాజిరెడ్డి అన్నారు. కార్య క్రమంలో విత్తన ధృవీకరణ అథారిటీ డైరెక్టర్ డా. ఏ. కిరణ్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ డా. చీనా, రీసెర్చ్ డైరెక్టర్ డా. లక్ష్మీ నారా యణ, పీజీ డీన్ డా. సురేష్, బోర్డు సభ్యులు పంకజ్ రెడ్డి, శిఖామణి, అనిల్ ఈపూర్, డా. పి.ప్రశాంత్, డా. అనిత కుమారి, డా.మురళి, డా. వీరాంజ నేయులు, డా. సునందిని, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పునఃప్రారంభం

### రేపు సాయంత్రం 6 గంటల వరకు అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పునఃప్రారంభించారు. రాష్టంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కెఎన్ఆర్‌యుహెచ్‌ఎస్) తిరిగి ప్రారంభించింది. అభ్యర్థుల నుంచి వచ్చిన పలు అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు మరో అవకాశం కల్పించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. నీట్ యూజీ-2026లో నిర్ణీత కటాఫ్ స్కోర్ అంతకంటే ఎక్కువ మార్కులు సాధించి అర్హత పొందిన అభ్య ర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ప్రక్రియ ఈ నెల 20 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే తమ దరఖాస్తులను సమర్పించిన అభ్యర్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని యూనివర్సిటీ స్పష్టం చేసింది. అభ్యర్థులు ఇతర వివరాల కోసం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్, ప్రాస్పెక్టస్‌ను పరిశీలించాలని సూచించింది. అర్హులైన అభ్యర్థులు టిఎస్ఎంఇడిఎడిఎం.టిఎస్‌సిహెచ్ఇ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు.

### వృద్ధులు, బీడీ కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల నుండి

## చేయూత పింఛన్ దరఖాస్తులను స్వీకరించాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వృద్ధులు, బీడీ కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల నుండికొత్తగా చేయూత పింఛన్ దరఖాస్తులను స్వీకరించాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం చేపట్టిన చేయూత(సామాజిక భద్రతా) కొత్త పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియలో అత్యంత కీలకమైన పేద వర్గాలను విస్మరించడం పట్ల సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తోందన్నారు. వృద్ధులు, లక్షలాది మంది బీడీ కార్మికులతోపాటు, హెచఐవీ,ఎయిడ్స్ బాధితులు, ఫైలేరియా (బోదకాలు) బాధితులు, తలసేమియా, సికిల్‌సెల్ డిసీజ్, హీమోఫీలియా రోగులనుండి ప్రస్తుతం సేకరిస్తున్న కొత్త పింఛన్ల దరఖాస్తులను స్వీకరించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి దరఖాస్తులను కూడా స్వీకరించి, పెన్షన్లు అందజేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా ప్రతి అర్హుడికి సామాజిక భద్రత కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం, నేడు క్షేత్ర స్థాయిలో వారి దరఖాస్తులను స్వీకరించకపోవడంతో వారు ప్రభుత్వ సహాయం అందక రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం స్వీకరించే చేయూత కొత్త పింఛన్ల దరఖాస్తులు స్వీకరించేలా పోర్టల్‌లో, ఆఫ్‌లైన్‌లో వెసులుబాటు కల్పించాలని, దరఖాస్తులకు విధించిన ఆగస్టు 31 తుది గడువును పెంచాలని డిమాండ్ చేశారు. దరఖాస్తుల స్వీకరణను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా తక్షణమే పింఛన్ల మొత్తాన్ని పెంపుదల చేసి, అర్హులం దరికీ కొత్త పెన్షన్లు అందించాలని జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రైతుల భూములను లాక్కుంటే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు

### భూభారతి పేదల పాలిట భూహారతిగా మారింది

### బిజెపి ఎంపి ఈటల రాజేందర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు18:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల భూములను కాపాడాల్సింది పోయి, రియల్ ఎస్టేట్ బ్రోకర్ తరహాలో వ్యవహరిస్తూ లక్షల కోట్ల రూపాయల భూదందాకు తెరతీసిందని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ధరణి పోయినా ధోరణి మారలేదు - భూభారతితో పేదలకు తీరని అన్యాయం:తెలంగాణ వస్తే భూ సమస్యలన్నీ తీరి పారదర్శకమైన చట్టం వస్తుందని ప్రజలు ఆశిస్తే, గత కేసీఆర్ ప్రభుత్వం ధరణి పేరుతో పేద రైతుల హక్కులను కాలరాసిందని ఈటల విమర్శించారు. ధరణి రాకముందు పహాణీలలో ఉన్న 13 కాలమ్స్ (ముఖ్యంగా కబ్జా, కాస్తు కాలమ్స్) తొలగించడం వల్ల 5070 ఏళ్లుగా భూములను సాగుచేసుకుంటున్న దళితులు, గిరిజనులు, బీసీ పేద రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పి, ఇప్పుడు భూభారతి పేరుతో మరింత దారుణంగా పేద రైతాంగాన్ని అగాధంలోకి నెట్టిందని..ధరణి పోయినా ధోరణి మారలేదు, భూభారతి కాస్త పేదలకు భూహారతిగా మారింది అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి పది అడుగులు ముందుకేసి భూముల వేలం ద్వారా దాదాపు రూ.10 లక్షల కోట్లు సమకూర్చుకోవాలనే దుర్మార్గపు ఆలోచనతో ఉన్నారని ఈటల మండిపడ్డారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని నగర విస్తరణ ప్రాంతాల్లో వేల ఎకరాల పేదల భూములను హైడ్రా, వందల మంది పోలీసుల పహారాతో రాత్రికి రాత్రే ఫెన్సింగ్‌లు, గోడలు కట్టి డీల్స్‌కు అప్పగిస్తున్నారని ఆరోపించారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు గ్రామాలపై పడి కీచకుల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ భూముల్లో 12 ఏళ్ల కౌలు ఉంటే సెక్షన్ 38ని కింద హక్కులు వస్తుంటే.. బడంగ్‌పేట్‌లో ఐదు తరాలుగా (78 సంవత్సరాలుగా) 46 మంది రైతులు సాగు చేసుకుంటున్న 45 ఎకరాల 16 గుంటల భూమిని ప్రభుత్వ భూమి పేరుతో లాక్కుంటున్నారు. దుండిగల్ సర్వే నం. 452, 453లలోని 400 ఎకరాల్లో 500 మంది రైతులు, బోరంపేట సర్వే నం. 166లోని 440 ఎకరాల్లో 150 మంది రైతులు 80 ఏళ్లుగా సాగు చేసుకుంటుంటే బలవంతంగా గుంజుకుంటున్నారు. బోరంపేట సర్వే నం. 472లోని 30 ఎకరాలకు ప్రీకాస్ట్ గోడలు నిర్మించారు.
1965 నాటి 1,049 ఎకరాల భూమి ధరణి లోపాల వల్ల వివాదంలోకి వెళ్లగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక 24 గంటల్లోనే పేర్లు మార్చి రియల్ ఎస్టేట్ మాఫియాకు అప్పగించారు. సర్వే నం. 57లోని 333 ఎకరాల్లో పేదలు, జర్నలిస్టులకు ఇచ్చిన 176 ఎకరాలు కాకుండా మిగిలిన 90 ఎకరాల భూమిని (విలువ సుమారు రూ.3,000 కోట్ల నుండి రూ.4,000 కోట్లు) కోర్టు కేసులను అడ్డం పెట్టుకుని ప్రైవేట్ వ్యక్తులతో సెటిల్‌మెంట్ చేసుకుని దోచుకుంటున్నారు. 70-80 ఏళ్లుగా గులాబీ తోటలు సాగుచేసుకుంటున్న రైతుల నుంచి 650 ఎకరాలను హైడ్రా బలగాలతో లాక్కోవాలని చూస్తే, ప్రజలు కారప్పొడి చల్లి తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు.

## నేటి నుంచి లాసెట్-2026 సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్

### 23 నుంచి 25 వరకు వెబ్‌ఆప్షన్లు

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే లా సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా రెండో విడత కౌన్సెలింగ్ నేటి నుంచి(బుధవారం) నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 22 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న సర్టిఫికెట్ వెరిఫికేషన్ల అనంతరం అర్హుల జాబితాను ప్రకటించనున్నారు. ఈ నెల 23 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 26న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 29న రెండో విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన అభ్యర్థులు ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 5 వరకు ఆయా కాలేజీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో చేరాల్సి ఉంటుందని కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి రాష్ట్రంలో 8730 సీట్లు అందుబాటులో ఉండగా అందులో మొదటి విడతలో 7622 సీట్లను కేటాయించారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించనున్న సర్కారు

### హైకోర్టులో స్టే వెకేట్ పిటిషన్ దాఖలు చేశాం.. నేడు విచారణ

### బిసి సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి కార్యదర్శి బాలమాయదేవి

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వధువుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షి ంచడంతో పాటు అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి బాలమాయదేవి స్పష్టం చేశారు. డబ్ల్యూపి నంబర్ 21732/2026 కేసులో ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టులో స్టే వేకెంట్ పిటిషన్‌ను దాఖలు చేసినట్టు తెలిపారు. పిటిషన్‌పై బుధవారం విచారణ జరగనుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ హాజరై వాదనలు వినిపించనున్నారని ఈ కేసులో సవాలు చేయబడిన 8 ప్రభుత్వ ఉత్తర్వుల చెల్లుబాటు, అమలును బలంగా సమర్థిస్తూ, వాటి పరిరక్షణకు అవసరమైన అన్ని చట్టపరమైన చర్యలను ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా అమలవుతున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఇప్పటికే నమోదు చేసుకున్న సుమారు 1,80,000 మంది వధువుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతగా ఉందన్నారు.
దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ వధువుల సంక్షేమం పట్ల ప్రభుత్వం తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించేందుకు హైకోర్టులో అవసరమైన అన్ని చట్టపరమైన చర్యలను తీసుకుంటుందని తెలిపారు. లబ్ధిదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం బలంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

### యాదాద్రి పవర్ ప్రైవేట్‌కు వ్యతిరేకంగా

## నేడు హైదరాబాద్ విద్యుత్‌సౌధ వద్ద మహాధర్నా

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లోని బూడిద నిర్వహణ ప్లాంట్, బొగ్గు నిర్వహణ ప్లాంట్ విభాగాలను ప్రైవేటీకరించే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ (కెటిపిఎస్) ఉద్యోగులు చేపట్టిన వ్యతిరేకిస్తూ కేటీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన నిరసనలు, ఆందోళనలు మంగళవారం నాటికి 45వ రోజుకు చేరాయి. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్పీఈజేఏసీ) పిలుపు మేరకు ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు.
ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ఎస్.కె. యస్మీన్ మాట్లాడుతూ గత 45 రోజులుగా బూడిద నిర్వహణ, బొగ్గు నిర్వహణ ప్లాంట్లను ప్రైవేటీకరణ నిమిత్తం ఇప్పటికే టెండర్లు పిలిచిందన్నారు. ప్రైవేటీకరణ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులందరినీ కలుపుకొని ఈ నెల 19న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## ప్రిన్సిపాల్ దారుణ హత్య ఘటనను సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్

### నిందితులను అరెస్టుచేసి నివేదిక సమర్పించాలి:

### ఎస్పీకి కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ఆదేశం

**హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 18, ప్రభాతవార్త:** ప్రిన్సిపాల్ దారుణ హత్య ఘటనను రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. నిందితులను అరెస్ట్ చేసి నివేదిక సమర్పించాలని కమిషన్ ఎస్పీని ఆదేశించారు. నల్లగొండ జిల్లా కొండ మల్లేపల్లి మండలం జేబీకాలనీలోని నివాసంలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ కుల్లు రూపారెడ్డి దారుణహత్యకు గురైన ఘటనను మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి ఆందోళన వ్యక్తం చేసారు. ఘటన జరిగి వారంరోజులు గడుస్తున్నప్పటికీ నిందితులను గుర్తించక పోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. మీడియా కథనాలు, ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న మహిళా కమిషన్ ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించింది. మహిళలపై జరిగే ఇలాంటి తీవ్రమైన హింసాత్మక ఘటనలను అత్యంత ప్రాధాన్యతతో విచారించి బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవ సరం ఉందని చైర్‌పర్సన్ అన్నారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిని రాష్ట్ర మహిళా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని, చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి తెలియజేసారు.



రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి

## బినామీ ఆస్తుల జప్తునకు ఐటి శాఖకు ఎసిబి లేఖ

### ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన అధికారులపై

### కఠిన చర్యలకు ఎసిబి నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబికి పట్టుబడ్డ సర్కారీ అధికారుల బినామీ ఆస్తులను జప్తుకు ఐటి శాఖ సన్నాహాలు చేబట్టింది. గడచిన కొన్ని నెలల కాలంలో 20 మంది వరకు అక్రమార్కులు ఎసిబికి పట్టుబడడం విదితమే. వీరి వద్ద వందల కోట్ల రూపాయల ఆస్తులు వెలుగు చూడడం విదితమే. వీరందరిని అరెస్టు చేసిన ఎసిబి అక్రమాస్తుల వివరాల కోసం కస్టడీలోకి తీసుకుని మరీ విచారించడం సంచలనం రేపింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసుల్లో ఎసిబికి పట్టుబడ్డ అధికారులను కస్టడీలోకి తీసు కుని విచారించడం ఇటీవల కాలంలోనే మొదలవడం గమనార్హం. అక్రమార్కుల వద్ద ఎసిబి గుర్తించిన ఆస్తుల్లో సగానికి పైగా బినా మీ ఆస్తులే కావడంతో దీనిపై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై న్యాయ నిపుణులతో ఈ విభాగం అధికారులు చర్చించినట్లు తెలిసింది. దీని తరువాత ఈ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే అక్రమార్కుల వద్ద పట్టుబడ్డ బినామీ ఆస్తులను జప్తు చే సేందుకు ఎసిబి అధికారులు ఐటి శాఖకు లేఖ రాసినట్లు తెలిసింది. ఈ లేఖలో ఇటీవల కాలంలో తాము పట్టుకున్న అక్రమార్కుల వివరాలతో పాటు వారివద్ద వెలుగుచూసిన బినామీ ఆస్తుల చిట్టాను పొందుపరిచినట్లు తెలిసింది. ఎసిబి అధికారులు పంపిన లేఖ ఆధారంగా ఐటి శాఖ ర ంగంలో దిగినట్లు తెలిసింది. అక్రమార్కుల బినామీ ఆస్తులను జప్తు చేసేందుకు ఐటి శాఖ సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. దీనిపై వారం పది రోజుల్లో కార్యాచరణ మొదలవనున్నట్లు సమాచారం.

# క్లీన్ ఎనర్జీ హబ్‌గా తెలంగాణ

## డిజిటల్ నెట్‌వర్క్‌గా విద్యుత్ గ్రిడ్: డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** క్లీన్ ఎనర్జీ హబ్‌గా తెలంగాణను చేయడమే తమ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని తెలిపారు. హైదరాబాద్ హైటెక్స్‌లో రెండు రోజుల పాటు జరగనున్న ఇండియా ఎనర్జీ సమ్మిట్ ఎక్స్ పో 2026 ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే రాష్ట్రమన్నారు. ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామంగా అభివర్ణించారు. మన సమృద్ధిని పంచుకోవడానికి, కలిసి ఎదగడానికి పెట్టుబడిదారులను సాదరంగా అహ్వానిస్తున్నామని చెప్పారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదన్నారు. అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక ప్రక్రియగా పేర్కొన్నారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని కోరారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20000 మెగావాట్లు, 2035 నాటికి 26000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు వివరించారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి కీలకమైన విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని కూడా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా వచ్చే నాలుగేళ్ళ నాటికి 3800 మెగావాట్లు, 2035 నాటికి 8000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. ఐటీ, ఎఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయబోయే ఎఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12000 ఇవి ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, ఎస్‌జిఎస్‌టి రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు, టిజి ఐపాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.



# కోచ్ రాక్షసత్వం.. గోదావరిలోకి ఎఇ కుటుంబం

20 నిమిషాలు ఈదిన పదేళ్ల బాలుడు

ఎఇ మృతి.. భార్య, కుమార్తె కోసం గాలింపు

సాధిక్‌ఖాన్‌పై మరో హత్యకేసు

పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి చంపాడంటూ ఫిర్యాదు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు18,ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నూకరాజు కుటుంబం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినన ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. షూటింగ్ కోచ్ షేక్ సాధిక్‌ఖాన్ వేధింపులు, బెదిరింపులు, ఆర్థిక దోపిడీ కారణంగానే కుటుంబం తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో సాధిక్‌ఖాన్‌పై మరో హత్య కేసు నమోదు కావడం కేసులో కొత్త మలుపుగా మారింది.కాకినాడ అశోక్‌నగర్‌కు చెందిన తిల్లపూడి నూకరాజు (61) పిఠాపురం మండలంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈగా పనిచేస్తున్నారు. వచ్చే జనవరిలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. కొన్నేళ్ల క్రితం ఆయన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఏడాది జూలై 2న ఆయన కుమార్తె సౌజన్య (38) భర్త జగదీశ్‌రెడ్డి మృతి చెందారు. దీంతో భర్తను కోల్పోయిన సౌజన్య తన పదేళ్ల కుమారుడు రియాన్స్ కార్తికేయరెడ్డితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది.

ఈ సమయంలో కాకినాడలో ప్రో రైఫిల్ షూటింగ్ అకాడమీ నిర్వహిస్తున్న షేక్ సాధిక్‌ఖాన్ తో కుటుంబానికి పరిచయం ఏర్పడినట్లు సమాచారం. సౌజన్యకు అండగా ఉంటానని నమ్మించినా నూకరాజు కుటుంబం అంగీకరించక పోవడంతో సాదిక్ ఖాన్ తరువాత వేధింపులకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యుల ఆరోపణలు. కుటుంబాన్ని చంపేస్తానని బెదిరిస్తూ బంగారం, ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, లాకర్ వివరాలు తన ఆధీనంలోకి తీసుకున్నాడని ఆరోపిస్తున్నారు. సౌజన్యపై భౌతిక దాడులకు పాల్పడి తీవ్రంగా వేధించేవాడని పేర్కొంటున్నారు.

సాధిక్‌ఖాన్ వేధింపులను తట్టుకోలేక నూకరాజు కుటుంబం తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి నూకరాజు, ఆయన భార్య మీనా (58), కుమార్తె సౌజన్య, మనుమడు కార్తికేయ కారులో కాకినాడ నుంచి బయలుదేరారు. రాజమహేంద్రవరంకొవ్వూరు ప్రాంతానికి చేరుకున్న అనంతరం డ్రైవర్‌కి డబ్బులు ఇచ్చి వెనక్కి పంపించేశారు. అనంతరం సౌజన్య కారు నడుపుకుంటూ రోడ్డు కం రైలు వంతెనపైకి వెళ్లినట్లు సమాచారం. అక్కడ కారును నిలిపి నలుగురూ ఒకరి చేతులు ఒకరు పట్టుకుని గోదావరిలోకి దూకారు.నీటిలో పడిన వెంటనే పదేళ్ల కార్తికేయ తేరుకుని అసాధారణ ధైర్యం ప్రదర్శించాడు. చిన్నతనంలో నేర్చుకున్న ఈత నైపుణ్యంతో సుమారు 20 నిమిషాల పాటు నదిలో ఈదుతూ "హెల్ప్.. హెల్ప్" అంటూ కేకలు వేశాడు. బాలుడి అరుపులు విన్న సమీప మత్స్యకారులు పడవలో వెళ్లి అతడిని రక్షి ంచి ఒడ్డుకు చేర్చారు. దీంతో బాలుడి ప్రాణాలు దక్కాయి.సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గాలింపు చేపట్టారు. సోమవారం సాయంత్రం డోబీఘాట్ వద్ద నూకరాజు మృతదేహం లభ్యమైంది. మీనా, సౌజన్య ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. జగదీశ్‌రెడ్డి మృతి, సౌజన్యపై జరిగినట్లు చెబుతున్న వేధింపులు, నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు అవసరమని పలువురు కోరుతున్నారు.

**10 ప్రత్యేక బృందాలతో గాలింపు**

ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల ఎస్పీలతో మాట్లాడి సమగ్ర విచారణ జరపాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధిక్‌ఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరారీలో ఉన్న సాధిక్‌ఖాన్ కోసం పోలీసులు పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు సమాచారం. కుటుంబ సమస్యలు, బెదిరింపులు, వేధింపులు ఎదురైనప్పుడు ఆత్మహత్యకు పాల్పడకుండా పోలీసులను, న్యాయవ్యవస్థను ఆశ్రయించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. మరోవైపు, ఈ ఘటనలో పదేళ్ల కార్తికేయ ప్రదర్శించిన ధైర్యం ఇప్పుడు అందరి దృష్టి పడింది. తల్లిదండ్రులను కోల్పోయిన బాలుడి పరిస్థితి హృదయ విదారకంగా మారింది. పూర్తి స్థాయి దర్యాప్తుతో ఈ ఘటన వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# సర్కార్ శాఖల్లో కాంట్రాక్ట్ దోపిడీ

ప్రభుత్వ సొమ్ము రూ.1,000 కోట్లు లూటీ

ఉద్యోగుల పిఎఫ్, ఈఎస్ సొమ్ములో అక్రమాలు

ఉన్నతస్థాయి కమిటీ తనిఖీల్లో వెలుగులోకి

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్న ప్రైవేట్ ఏజెన్సీలు పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములను చెల్లించకుండా భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నాయి. ఈ అక్రమాలు రూ.1000 కోట్లకు పైగా ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారుల ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలపై ప్రభుత్వ అధికారులు దృష్టిసారించిన నేపథ్యంలో తీగలాగితే డొంక కదిలిన చందంగా ప్రైవేటు ఏజెన్సీల దందా బయట పడుతోంది. ఇంకా ఎంత మొత్తంలో ఎగవేతలు జరిగాయనేది తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆర్థిక శాఖ ఉద్యోగుల జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల వివరాలను అడిగినప్పుడు ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1.60 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు, అయితే ప్రభుత్వం నెలకు రూ.352 కోట్లను చెల్లిస్తున్నప్పటికీ, ఈ మొత్తాన్ని ఎలా వినియోగిస్తున్నారో గతంలో ఎలాంటి లెక్కలు లేనట్లు సమాచారం. ఈ అక్రమాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.

# సభా నియమాలను సమీక్షించాల్సిన అవసరం ఉంది

రూల్స్ కమిటీ తొలి సమావేశంలో మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు18:** శాసన మండలిలోని కమిటీ హాల్‌లో రూల్స్ కమిటీ ప్రాథమిక సమావేశం మంగళవారం జరిగింది.ఈ సమావేశానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ హాజరయ్యారు.అలాగే శాసన మండలి సభ్యులు శంకర్ నాయక్, శ్రీపాల్ రెడ్డి, తీన్మార్ మల్లన్న, కోటి రెడ్డి, బస్వరాజు సారయ్య, మల్కా కొమురయ్య, నెల్లికంటి సత్యం, శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతితో పాటు సంబంధిత అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ చట్టసభల గౌరవాన్ని, ఔన్నత్యాన్ని కాపాడటంలో సభా నియమాలు అత్యంత కీలకమైనవి. సభా కార్యక్రమాలు క్రమబద్ధంగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిర్వహించేందుకు రూల్స్ కమిటీ కీలక పాత్ర పోషిస్తుంది.కాలానుగుణంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సభా నియమాలను సమీక్షించాల్సిన అవసరం ఉంది. సభ్యులు ప్రజా సమస్యలను సభలో సమర్థవంతంగా ప్రస్తావించేందుకు, అర్థవంతమైన చర్చలు జరిగేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించేలా నిబంధనలు ఉండాలి. శాసన మండలి సమావేశాలు మరింత సమర్థవంతంగా, సజావుగా జరిగేలా సభ్యులందరి అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు, చేర్పులపై రూల్స్ కమిటీ సమగ్రంగా చర్చించాలి. రూల్స్ కమిటీ సభ్యులు పలు అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలను వెల్లడించారు.

# 27న అన్ని జిల్లా కేంద్రాల్లో ఒకరోజు మహాధర్నా

సెప్టెంబరు 1 పెన్షన్ విద్రోహ దినం,

10న హైదరాబాద్‌లో మహాధర్నా

టిజిఇ-జెఎసి విస్తృతస్థాయి సమావేశంలో తీర్మానం

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి, ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఈ-జేఏసీ) విస్తృత కార్యనిర్వాహక కమిటీ సమావేశం తీర్మానించింది. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని టిఎన్‌జివో భవన్‌లో సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి ఇచ్చిన మూడు హామీలు అమలు కాలేదని కాబట్టి మూడు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి వాటి పరిష్కారానికి ప్రభుత్వాన్ని కోరుతూ స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకున్నట్టు జేఏసీ నేతలు మీడియాకు తెలిపారు. 27న అన్ని జిల్లా కేంద్రాల్లో ఒక రోజు మహాధర్నా నిర్వహించాలని, ఆ రోజు నుంచి పిఆర్‌సి నివేదిక విడుదలయ్యే వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని తీర్మానించింది. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించాలని జేఏసీ తీర్మానించింది.

# అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు

రైతుల చెంతకు ఆధునిక సాంకేతికత

కూరగాయల ఉత్పత్తికి ప్రత్యేక కార్యాచరణ

వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు జరగాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఫలితాలు రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచించారు. తెలంగాణ ఉద్యాన కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్నో విలువైన పరిశోధనలు జరిగినప్పటికీ వాటి ఫలితాలు రైతులకు ఆశించిన స్థాయిలో చేరడం లేదన్నారు. ఈ ఫలితాలను వీడియోలు, షార్ట్ ఫిల్మ్‌లు, సోషల్ మీడియా ద్వారా రైతులకు చేరేలా చూడాలని పేర్కొన్నారు.

వ్యవసాయ భూమిలో ఉద్యాన పంటలు సుమారు 6 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, వ్యవసాయ స్థూల విలువలో వాటి వాటా 26 శాతం మేర సుమారు రూ.30,346 కోట్లుగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తిలో సుమారు 70 శాతం లోటు ఉందని, ఇతర రాష్ట్రాల నుంచి వాటిని దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండటం ఆందోళన కరమని పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న కూరగాయలు, ఉద్యాన పంటలను పండించేలా ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో డెమాన్‌స్ట్రేషన్ ప్లాట్లను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని చిన్న రైతులకు తక్కువ ఖర్చుతో, చిన్న కమతాల్లో అమలు చేయగల సాంకేతికత, యంత్రాలు, సాగు పద్ధతులపై పరిశోధనలు జరగాలని సూచించారు. ప్రభుత్వానికి చెందిన సీడ్ ఫారాలు, ఇతర అందుబాటులో ఉన్న భూములను వినియో గించుకొని జిల్లాల వారీగా పరిశోధన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచిం చారు. రైతులు తమ ప్రాంతంలోనే కొత్త పంటలు, ఆధునిక సాగు పద్ధతులను ప్రత్యక్షంగా చూసి స్వీకరించే అవకాశం కల్పించాలని అన్నారు.

# ఒడిశాలో ఈగల్ పోలీసుల 36 గంటల నాన్‌స్టాప్ ఆపరేషన్

హైదరాబాద్‌లో గూగుల్ మ్యాప్ ద్వారా డెడ్‌డ్రాప్ పద్ధతిలో గంజాయి స్మగ్లర్ల అరెస్టు

నగరంలో వంద మంది వ్యసపరుల అరెస్టు

38 మందిని పునరావాస కేంద్రానికి తరలింపు



ఈగల్ పోలీసులకు పట్టుబడి పునరావాస కేంద్రంలో ఉన్న గంజాయి వ్యసపరులు

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో గూగుల్ మ్యాప్ ద్వారా డెడ్ డ్రాప్ పద్ధతిలో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఒడిషాకు చెందిన ఐదుగురు బడా స్మగ్లర్లను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకోసం ఈగల్ పోలీసులు ఒడిషాలోని కోరాపుట్ అడవుల్లో 36 గంటల పాటు నాన్‌స్టాప్ ఆపరేషన్ నిర్వహించారు. ఇదే సమయంలో ఈ ముఠా బారినపడి వ్యసనపరులుగా మారిన వంద మంది హైదరాబాదీయుల ను అరెస్టు చేసి వీరిలో 38 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా మంగళవారం మీడియాకు వెల్లడించారు. గత జూన్ నెలలో 1908కు ఒక ఫోన్ రాగా ఇందులో కూకట్‌పల్లి ప్రాంతంలో సత్య అవినాష్ (27) అనే వ్యక్తి డ్రగ్స్ అమ్ము తున్నట్లు సమాచారం వుంది. దీని ఆధారంగా రంగంలో దిగిన ఈగల్ పోలీసులు కూకట్‌పల్లిలో స్థానిక పోలీసుల సహ కారంతో దాడులు నిర్వహించారు. సత్య అవినాష్ అనే వ్యక్తి గూగుల్ మ్యాప్ ఆధారంగా డెడ్ డ్రాప్ పద్ధతిలో తన కస్టమర్లకు గంజాయిని అ మ్ముతున్నట్లు ఈగల్ పోలీసుల విచారణలో తేలింది. ఇందుకోసం అతను ఫోన్ పే ద్వారా ముందుగానే వ్యసన పరుల నుంచి డబ్బులు తీసుకుం టున్నట్లు తేలింది. కాగా సత్య అవినాష్‌ను వెంటనే అరెస్టు చేసి విచారించగా ఒడిషాలోని కోరాపుట్ జిల్లా అటవీ ప్రాంతం నుంచి పలు మార్గా లలో పలు పద్ధతుల్లో గంజాయిని అక్కడి బడా స్మగ్లర్లు హైదరాబాద్‌కు స్మగ్లింగ్ చేస్తున్నట్లు తేలింది. ఒడిశా నుంచి విజయనగరంలోని పా చిపెంట్ల మీదుగా గంజాయి హైదరాబాద్‌కు వస్తున్నట్లు తేలింది.

ఈ క్రమంలో ఈగల్ పోలీసులు మొదట నగరంలో పలుచోట్ల దాడులు నిర్వహించి 180ని మొదట అ దుపులోకి తీసుకుని పరీక్షించగా 80 మందికి పాజిటివ్‌గా తేలింది. వీరిలో ఏడుగురు విద్యార్థులు కావడం గమనార్హం. 80 మందిలో తీవ్ర వ్య సపరులుగా తేలిన 38 మందిని వెంటనే పునరావాస కేంద్రానికి తరలించారు. వీరంతా ఈ కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో వున్నారు. మిగతా వారిని వారం రోజుల్లో ఈ కేంద్రానికి తరలిం చనున్నారు. పరారీలో వున్న మిగతా వారిని పట్టుకునేందుకు గా లిస్తున్నారు. కాగా మాదకద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా వెంటనే 1908 లేదా 8712671111 నంబర్‌కు తెలపాలని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా కోరారు.

# వలసకూలీని మింగేసిన మంటలు

సిరిసిల్ల ఫర్నిచర్‌షాప్‌లో అగ్నిప్రమాదం.. సజీవదహనం

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** బతుకుదెరువు కోసం వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన ఒక పేద కూలీని అగ్నిప్రమాదం పొట్టనబెట్టుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి సిరిసిల్ల ప్రాంతానికి వలస వచ్చిన ఒక కూలీ స్థానిక ఫర్నిచర్ దుకాణంలో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలో మహాలక్ష్మి ్మ ఫర్నిచర్ షాప్, దాని అనుబంధ గోదాంలో మంగళవారం ఉదయం ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ విషాద ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక కూలీ మంటల్లో చిక్కుకుని సజీవదహనం కాగా, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మహాలక్ష్మి ్మ ఫర్నిచర్‌షాప్‌తోపాటు దాని గోదాంలో కూడా మంటలు వ్యాపించడంతో ఉద యాన్నే ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకుంది. ప్రమాద సమయంలో షాప్‌లోనే నిద్రిస్తున్న కూలీలు మంటల తీవ్రతను గమనించి భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. అయితే, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక కూలీ మహమ్మద్ ఇస్లాం మంటల బీభత్సానికి లోపలే చిక్కుకుపోవడంతో బయటకు రాలేక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. గోదాం లోపలి భాగం నుండి కూడా అగ్నికీలలు ఎగిసిపడుతుండడంతో, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో గోదాం పక్క గోడలను కూల్చివేసి ఆర్పే ప్రయత్నాలు చేశారు.

# గ్రీన్ వాణిజ్య వాహనాలకు పర్మిట్ 20 యేళ్లకు పెంపు

కేంద్ర రవాణశాఖ ప్రతిపాదనల ముసాయిదా

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** దేశంలో పర్యావరణహిత వాణిజ్య వాహనాల వినియోగాన్ని పెంచేందుకు, రవాణా రంగానికి వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖమోర్త్ విప్లవాత్మక నిర్ణయాన్ని తీసుకుంది. 1989 నాటి కేంద్ర మోటారు వాహన నిబంధనల సవరణ ముసాయిదాలోని రూల్ 88 ప్రకారం బ్యాటరీ, హైడ్రోజన్, సహజ వాయువులతో నడిచే వాణిజ్య వాహనాల నేషనల్ పర్మిట్ పరిమితిని మరో ఐదేళ్ల పాటు పొడిగించాలని కేంద్రం ప్రతిపాదించింది. దీనివల్ల ప్రస్తుతం ఉన్న 12 ఏళ్లు, 15 ఏళ్ల పరిమితి వరుసగా 17, 20 ఏళ్లకు పెరుగుతాయి. ఆపరేటర్లు ఇకపై ప్రతి సంవత్సరం ఆఫీసుల చుట్టూ తిరగకుండా ఒకేసారి ఐదేళ్ల కాలానికి రూ. 82,500 చెల్లించి పర్మిట్ పొందే సౌలభ్యం రానుంది.

తాత్కాలిక ఎన్‌ఒసి ఫ్రేమ్‌వర్క్, సాంకేతిక పరిజ్ఞానాలపై

# క్రెడాయ్, నరెడ్కో సంయుక్త వర్క్‌షాప్

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** అగ్నిమాపక భద్రతా ఆటోమేషన్ కోసం తాత్కాలిక ఎన్‌ఓసి ఫ్రేమ్‌వర్క్, నూతన సాంకేతిక పరిజ్ఞానాలపై వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. బహుళ అంతస్తుల నివాస, రిటైల్, ఆసు పత్రులు, హోటళ్లు, పాఠశాలలు, వాణిజ్య సముదాయాలలో ప్రాణ భద్రతా మౌలిక



సదుపాయాలను ఉన్నతీకరించే క్రమంలో ఎదురయ్యే నియంత్రణపరమైన అడ్డంకులను తొలగించే లక్ష్యంతో, కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్, నారెడ్కో (నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) తెలంగాణ, ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఏఐ) హైదరాబాద్ చాప్టర్, తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖ, తెలంగాణ ప్రభుత్వ సమన్వయంతో ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించాయి.

తాత్కాలిక నిరభ్యంతర పత్రాల(ఎన్‌వోసీ) ఫ్రేమ్‌వర్క్‌ను క్రమబద్ధీక రించడం, నూతన ఆధునిక అగ్నిమాపక భద్రతా సాంకే తికతలను అవలంబించడాన్ని ప్రోత్సహించడం అనే అంశంపై దృష్టి సారించిన ఒక విస్తృత పారిశ్రామిక వర్క్‌షాప్ కోసం కీలక రియల్ ఎస్టేట్ సంస్థలు, ఆర్కిటెక్టులు, స్ట్రక్చరల్ ఇంజనీర్లు, ఎంఈపీ కన్సల్టెంట్లు, అగ్నిమాపక భద్రతా నిపుణులు, ఆడిటర్లు, ప్రభుత్వ అధికారులు మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా-2016ను ఉపసంహరించుకుని, నేషనల్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ స్టాండర్డ్స్ (ఎన్‌బిసిఎస్) 2026ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఈ వర్క్‌షాప్ జరిగింది. నివాస, వ్యాపార, వాణిజ్య, విద్యా సంబంధిత భవనాల కోసం ఆచరణాత్మక చెక్‌లిస్ట్‌లను కలిగి ఉన్న ముసాయిదా తాత్కాలిక ఎన్‌వోసీ పత్రాలను సంబంధిత శాఖ రూపొందించింది. ఒకే ప్రాజెక్టులోని పలు బ్లాక్‌లకు ఒకే తాత్కాలిక ఎన్‌వోసీని అనుమతించే కొత్త సేవను ప్రవేశపెట్టడం ఈ సమావేశంలోని ఒక ప్రధాన అంశం. తెలంగాణ విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్, విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ.. 'తాత్కాలిక ఎన్‌ఓసీలు కేవలం పరిపాలనా లాంఛనాలు మాత్రమే కాదని, నివాస, వాణిజ్య, రిటైల్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ యొక్క నిర్మాణ నిర్మాణంలోనే అగ్నిమాపక భద్రత అంతర్భాగంగా ఉండేలా చూసేందుకు రూపొందించిన కీలకమైన మార్గదర్శకాలన్నారు. తమ లక్ష్యం రెండు విధాలుగా ఉందన్నారు. డిజిటల్ పారదర్శకత ద్వారా ఆమోద యంత్రాంగాలను సరళీకృతం చేయడంతోపాటు ఆధునిక భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయడం. రియల్‌టైమ్ సెన్సార్ పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక సాంకేతికతలను అనుసంధానించడం ద్వారా, పట్టణ అగ్ని ప్రమాదాల నుండి తట్టుకునే సామర్థ్యం, నివారించలేని అగ్నిప్రమాద ప్రాణనష్టం విషయంలో తెలంగాణను ఒక బెంచ్‌మార్క్ రాష్ట్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎన్. జైదీప్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రముఖమైన అభివృద్ధి పనులతో నిలువుగా విస్తరిస్తున్నందున, డెవలపర్లు పాటించాల్సిన నిబంధనలు ప్రపంచ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఏ ప్రాజెక్టుకైనా, దాని అభివృద్ధి దశలన్నింటిలోనూ అగ్నిమాపక భద్రతా నియమాలను ప్రణాళిక చేయడం, అభివృద్ధి చేయడం చాలా అవసరమన్నారు. ఈ సంయుక్త వర్క్‌షాప్, తాత్కాలిక ఎన్‌ఓసి రోడ్‌మ్యాప్‌పై విధానపరమైన స్పష్టతను అందించడానికి, ఆమోద ప్రక్రియలోని అడ్డంకులను తగ్గించడానికి, అదే సమయంలో బిల్డర్లను కఠినమైన భద్రతా నిబంధనలకు జవాబుదారీగా ఉంచడానికి రూపొందించబడిందన్నారు.

# రాష్ట్రంలో రెవెన్యూ పాలన కాదు.. రాబరీ పాలన సాగుతోంది

మంత్రి పొంగులేటి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఆధారాలతో బహిరంగ చర్చకు నేను సిద్ధం: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు18:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆస్తులను కాపాడాల్సింది పోయి, బ్రోకర్ తరహాలో వ్యవహరిస్తూ లక్షల కోట్ల రూపాయల భూదందాకు తెరతీసిందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నేడు రాబరీ మినిస్టర్‌గా మారి ఖజానాను, ప్రజల ఆస్తులను లూటీ చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఎ ప్రకారం పౌరుల ఆస్తి హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేస్తూ, ఇందుకు పూర్తి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. రూపాయి రూపాయి కూడబెట్టుకుని పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసుకున్న 60,100 గజాల స్థలాలను సైతం 22ఏ ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చి వారిని తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు.

నిబంధనల ప్రకారం జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెరా అనుమతులు పొంది, బ్యాంకుల ద్వారా లోన్ అప్రూవల్ అయిన ప్రాపర్టీలను కూడా 22ఎ లో పెట్టడం ప్రభుత్వ దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పదవి చేపట్టకముందు ఆయన ఆస్తులు ఎంత? మంత్రి అయిన తర్వాత సంపాదించిన ఆస్తులెంత? అనే అంశాలపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. గత ప్రభుత్వానికి బినామీగా, బ్రోకర్‌గా పనిచేసిన ఫీనిక్స్ సంస్థ, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ మధ్యవర్తిగా మారి చక్రం తిప్పుతోందని ఆరోపించారు.తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నుంచి కేటాయించిన భూములను సైతం బ్లాక్‌మెయిల్ చేసి తమ కంపెనీల పేరిట మార్చుకున్నారు.

శ్రీశైలం హైవే - కందుకూరు పరిధిలో దాదాపు 400 ఎకరాల భూమిని జోన్ కన్వర్షన్ చేసే ప్రక్రియలో 30శాతం వాటా తీసుకోవడంతో పాటు ఆ భూమిని స్వంత ఖాతాలో వేసుకున్నారు.గాజులరామారంలో వివాదంలో ఉన్న 35 ఎకరాల ప్రభుత్వ భూమిని మంత్రి స్వలాభం కోసం క్లియర్ చేసుకున్నారు. ప్రజల, రైతుల, బడుగు బలహీన వర్గాల భూములను కబ్జా చేస్తూ, రాష్ట్ర ఖజానాను కొల్లగొడుతున్న ఈ అక్రమాలపై తాను అన్ని ఆధారాలు, అధికారిక పత్రాలతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలబడి ఈ భూదందాలను నిరంతరం ఎండగడుతుందని, దోపిడీదారులను చట్టం ముందు నిలబెట్టే వరకు పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఆట



### ప్రపంచ ఛాంపియన్‌షిప్..

# ఆయుష్ సంచలనం

### వరల్డ్ నంబర్ 1 షి యు కీ ఓటమి

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, భారత ఆటగాడు ఆయుష్ శెట్టి అద్భుతమైన సంచలనం సృష్టించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో జరిగిన ఉత్కంఠభరితమైన పోరులో, అతను డిఫెండింగ్ ఛాంపియన్, ప్రపంచ నంబర్ 1 అయిన చైనాకు చెందిన షి యు క్విని 21-14, 13-21, 21-19 తేడాతో ఓడించాడు. నాలుగు మ్యాచ్‌ల తర్వాత షీపై శెట్టికి ఇదే తొలి విజయం. శెట్టి ఆత్మవిశ్వాసంతో మ్యాచ్‌ను ప్రారంభించి, 3-0 ఆధిక్యాన్ని సాధించి, తొలి గేమ్ విరామ సమయానికి 11-5 ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నాడు. విరామం తర్వాత కూడా ర్యాలీలపై తన ఆధిపత్యాన్ని కొనసాగించి, తొలి గేమ్‌ను 21-14 తేడాతో ముగించాడు. రెండో గేమ్‌లో షి పుంజుకుని 3-1 ఆధిక్యంలోకి వెళ్లగా, శెట్టి పోరాడి స్కోరును 4-4తో సమం చేశాడు. ఆ తర్వాత పోరు హోరాహోరీగా సాగగా, ఆధిక్యం పదేపదే చేతులు మారింది. శెట్టి 7-7తో స్కోరును సమం చేసి, కొద్దిసేపు ఆధిక్యంలోకి వెళ్లినప్పటికీ, షి 11-9 ఆధిక్యంతో విరామ సమయానికి వెళ్లాడు. అగ్రశ్రేణి ఆటగాడు తన ఆధిక్యాన్ని మరింత పటిష్టం చేసుకుని, ఐదు పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించాడు. కొన్ని వైడ్ షాట్‌ల వల్ల శెట్టి పాయింట్లు సాధించినప్పటికీ, రెండవ గేమ్‌ను 21-13 తేడాతో గెలిచి నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశాడు. ఆఖరి గేమ్‌లో శెట్టి మళ్లీ ఆధిక్యం సాధించాడు. హోరాహోరీగా ప్రారంభమైనప్పటికీ, అతను 6-3, ఆపై 9-4 ఆధిక్యంతో దూసుకుపోయి, విరామ సమయానికి 11-5 ఆధిక్యాన్ని సాధించాడు. చివరి నిమిషాల్లో షి నాలుగు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నప్పటికీ, శెట్టి సంయమనం కోల్పోకుండా తర్వాతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తన కెరీర్‌లోని అతిపెద్ద విజయాలలో ఒకటి పూర్తి చేసుకున్నాడు.



## జూనియర్ మహిళల హాకీ..

# క్వార్టర్ ఫైనల్స్‌కు చండీగఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మణిపూర్

**న్యూఢిల్లీ:** పూల్ మ్యాచ్‌ల చివరి రోజున విజయాలు సాధించిన చండీగఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మణిపూర్ హాకీ జటున జూనియర్ మహిళల జాతీయ ఛాంపియన్‌షిప్ 2026 క్వార్టర్ ఫైనల్స్‌లో తమ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. మంగళవారం పూల్ ఎ లో చండీగఢ్ జట్టు పంజాబ్‌ను 3 -1 తేడాతో ఓడించి టోర్నమెంట్‌లో తమ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. చండీగఢ్ తరపున దీక్ష (33వ నిమిషం), రవీనా (34), ప్రియా చౌహాన్ (46) గోల్స్ చేయగా, పంజాబ్ తరపున జైస్మీన్ కౌర్ 40వ నిమిషంలో ఒక గోల్ చేసింది. పూల్ బిలో ఒడిశా బెంగాల్‌పై 6-0 తేడాతో ఘన విజయం సాధించింది. ద్రుపతి నాయక్ రెండు గోల్స్ (10వ, 47వ నిమిషాల్లో) చేయగా, అజిత ఎక్కా (29), ఎక్కా సోనాలి (30), బినాటి మింజ్ (44), భోలి డోలి (49) కూడా గోల్స్ సాధించారు. పూల్ డిలో మధ్యప్రదేశ్ హిమాచల్‌ను 6-0 తేడాతో ఓడించి ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్ తరఫున తన్వి (12), కాజల్ (19, 26, 52), మితాలి శర్మ (58), కుద్రత్ (59) గోల్స్ చేశారు. పూల్ సి లో మణిపూర్ మహారాష్ట్రను 3-2 తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్‌లో సల్లు పుఖ్రంబం హ్యాట్రిక్ (21, 43, 47వ నిముషాల్లో) పూర్తి చేశాడు. దీనికి ప్రతిగా మహారాష్ట్ర తరఫున రూబీ రాథోర్ (49), తనిష్క షిండే (53) గోల్స్ చేశారు.

# 288 రన్స్‌ఆధిక్యంతో.. శ్రీలంకపై గెలుపు దిశగా భారత్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(31 నాటౌట్), సోనాల్ దినుషా(25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు. భారత్ విజయానికి 6 వికెట్లు కావాల్సి ఉండగా, శ్రీలంక ఇంకా 288 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా, దేవదత్ పడిక్కల్(44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు, ప్రబాత్ జయసూర్య(3/43) మూడు, కేశర నువాంత ఒక వికెట్, లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది.





నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా యశస్వి జైస్వాల్ మూడో బంతికే డకౌట్ కాగా, కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) పరుగులు చేశారు. రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా, రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.





# నేడే పాకిస్థాన్‌తో భారత్ కీలక పోరు

### గెలవకుంటే టోర్నీ నుండి నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ చేతిలో ఎదురైన 2-4 ఓటమి భారత జట్టు సెమీఫైనల్ ఆశలను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రస్తుతం మూడు పాయింట్లతో పూల్ డి లో రెండో స్థానంలో ఉన్న భారత్, తర్వాతి రౌండ్ దాటాలంటే ఈ నెల 19న పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించడం అత్యవసరం. ఈ ఓటమి ప్రభావం రెండో రౌండ్‌లోనూ కొనసాగే అవకాశం ఉండటం అభిమానులను కలవరపెడుతోంది. ర్యాంకింగ్స్ పరంగా చూస్తే భారత్ 8వ స్థానంలో, పాకిస్తాన్ 12వ స్థానంలో ఉన్నప్పటికీ, మైదానంలో దాయాదుల మధ్య పోరు ఎప్పుడూ ఒత్తిడితో కూడుకున్నదే. ఒకవేళ భారత్ పాకిస్తాన్ చేతిలో ఓడిపోతే టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయమవుతుంది. డ్రా చేసుకుంటే మాత్రం వేల్స్‌పై ఉన్న మెరుగైన రికార్డు ఆధారంగా రెండో రౌండ్‌కు అర్హత సాధించే అవకాశం ఉంటుంది. అయితే ఈసారి హాకీ ప్రపంచకప్‌లో ప్రవేశపెట్టిన కొత్త నియమాలు భారత జట్టుకు పెద్ద సవాలుగా మారాయి. గతంలా క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించకుండా, తొలి రౌండ్ నుంచి అర్హత సాధించిన 8 జట్లను క్రాస్‌ఓవర్ పూల్స్(ఈ, ఎఫ్) పేరిట రెండు గ్రూప్‌లుగా విడదీస్తారు. తొలి రౌండ్‌లో ఎదురైన ఫలితాల పాయింట్లు, గోల్స్ వ్యత్యాసం నేరుగా రెండో రౌండ్‌కు కూడా వర్తిస్తాయి. పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధించి పూల్ డి నుంచి రెండో స్థానంతో ముందంజ వేసినా, పూల్ ఎ లో అగ్రస్థానాల్లో నిలిచే జట్లతో కలసి పూల్ ఈ లో పోరాడాల్సి ఉంటుంది. అక్కడ ఇంగ్లాండ్‌తో మళ్లీ మ్యాచ్ ఉండదు. కానీ ఇంగ్లాండ్ చేతిలో పొందిన ఈ ఓటమి పాయింట్ల పట్టికపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అంటే, పూల్ ఈ లో భారత్ సెమీఫైనల్ బెర్త్ దక్కించుకోవాలంటే తర్వాతి రెండు మ్యాచ్‌ల్లోనూ కచ్చితంగా గెలిచి తీరాలి. ఇక రెండో రౌండ్‌లో భారత్‌కు ఎదురయ్యే ప్రత్యర్థులు సామాన్యమైనవారు కాదు. పూల్ ఎ నుంచి మాజీ ఛాంపియన్ నెదర్లాండ్స్, ఒలింపిక్ విజేత అర్జెంటీనా గ్రూప్ ఈ లోకి అడుగుపెట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో అర్జెంటీనాతో జరిగిన చివరి నాలుగు మ్యాచ్‌ల్లోనూ భారత్ పరాజయం పాలైంది. అలాగే నెదర్లాండ్స్‌పై గడిచిన పది మ్యాచ్‌ల్లో కేవలం మూడు విజయాలు మాత్రమే నమోదు చేయగలిగింది. 1975 తర్వాత మళ్లీ ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరుకోలేకపోయిన భారత్, ఈసారి ఆ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలంటే మైదానంలో అద్భుతాలు చేయాల్సిందే. ఇంగ్లాండ్‌పై చేసిన పొరపాట్లను సరిదిద్దుకుని, వ్యూహాత్మక దృఢత్వంతో ఆడితేనే భారత హాకీ జట్టు ఆశలు సజీవంగా ఉంటాయి.

# సిన్సినాటి ఓపెన్.. జ్వెరెవ్, డి మినార్ ముందంజ

### కోస్టియుక్, స్టేర్న్స్ చేతిలో విలియమ్స్ సిస్టర్స్ ఓటమి

**ఓహియో:** సిన్సినాటి ఓపెన్ 2026లో జ్వెరెవ్, డి మినార్ ముందంజలో ఉండగా, కోస్టియుక్-స్టేర్న్స్ జోడీ చేతిలో విలియమ్స్ సోదరీమణులు ఓటమి చెందారు. టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ పోరాడి నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించగా, సెరెనా-వీనస్ విలియమ్స్ తమ మొదటి డబుల్స్ మ్యాచ్‌లో ఓడిపోయారు. ఈ ఏడాది రోలాండ్ గారోస్ గెలిచి, వింబుల్డన్ రన్నరప్‌గా నిలిచిన జర్మన్ స్టార్ జ్వెరెవ్, టెర్రాన్స్ అట్మాన్‌ను 7-6(4), 7-6(6) తేడాతో ఓడించి, ఈ సీజన్‌లో తన ఏటీపీ కెరీర్‌లో





అత్యుత్తమమైన 46వ మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. జ్వెరెవ్, 2025 సిన్సినాటి సెమీఫైనలిస్ట్ అయిన ఆ ఫ్రెంచ్ ఆటగాడిని బ్యాక్‌హ్యాండ్ షాట్‌తో ఓడించాడు. ఇక 14 గ్రాండ్ స్లామ్ టైటిళ్లు, మూడు ఒలింపిక్ స్వర్ణ పతకాలు సాధించిన విలియమ్స్ సోదరీమణులు వీనస్ విలియమ్స్, సెరెనా విలియమ్స్ అమెరికాకు చెందిన పేటన్ స్టెర్న్-ఉక్రెయిన్‌కు చెందిన మార్టా కోస్టియుక్‌ల చేతిలో 6-2, 1-6, 10-8 తేడాతో ఓడిపోయారు. మొదటి సెట్‌లో తోబుట్టువులు చెరొకసారి తమ సర్వ్‌ను కోల్పోయి, చివరి ఏడు గేమ్‌లలో ఆరింటిని కోల్పోయారు. కానీ, రెండవ సెట్‌లో ఆధిపత్యం చెలాయించి, 10 పాయింట్ల టైబ్రేకర్ మూడవ సెట్‌లో 8-2తో వెనుకబడినప్పటికీ పుంజుకున్నారు. కానీ వీనస్ చేసిన డబుల్ ఫాల్ట్ కారణంగా ఓటమి పాలయ్యారు. అలాగే పురుషుల ఐదవ సీడ్ అలెక్స్ డి మినార్ ఆర్థర్ ఫెరీని 7-5, 7-6 (7/3) తేడాతో ఓడించాడు. 30 నిమిషాల ఆట నిలిచిపోయిన తర్వాత ఈ ఆస్ట్రేలియన్ ఒక సెట్ మరియు 5-1 ఆధిక్యంలో ఉన్నాడు.




# 5జీ టెక్నాలజీలో వరల్డ్ నంబర్‌వన్‌గా మారుతున్న భారత్..!

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** 5జీ టెక్నాలజీ వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుందని, 2030 నాటికి దేశంలో 5జీ స్వీకరణ 62 శాతానికి చేరుకుంటుందని గ్లోబల్ మొబైల్ కమ్యూనికేషన్స్ సిస్టమ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇది ఆసియా పసిఫిక్ ప్రాంత సగటు 50 శాతం కంటే గణనీయంగా ఎక్కువగా ఉంది. బంగ్లాదేశ్, ఇండోనేషియా, పాకిస్థాన్‌లతో పాటు భారత్‌ను కూడా ప్రముఖ దేశంగా జీఎస్ఎంఏ గుర్తించింది. ఒకప్పుడు నెట్‌వర్క్ కవరేజీ పెద్ద సవాల్‌గా ఉండగా, ఇప్పుడు దేశంలో ఆ సమస్య దాదాపు పరిష్కారమైందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం కవరేజీ గ్యాప్ 5 శాతానికి పడిపోవడంతో అసలు సవాల్ కవరేజీ నుంచి వినియోగం, స్వీకరణ వైపు మారిందని తెలిపింది. స్మార్ట్‌ఫోన్ల ధరలు, డిజిటల్ నైపుణ్యాల కొరత, ఆన్‌లైన్ భద్రతపై నమ్మకం వంటివి మొబైల్ ఇంటర్నెట్ వాడకానికి ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని వివరించింది. ఈ సవాళ్లను అధిగమించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను నివేదిక ప్రశంసించింది. భారత్‌నెట్, ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ వంటి పథకాలను ఉదాహరణగా పేర్కొంది. పీఎంజీదిశ ద్వారా ఇప్పటికే 6.4 కోట్ల మంది గ్రామీణ పౌరులకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేసింది. 2026 నాటికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీపై చేసే ఖర్చు 11.7 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. టెక్నాలజీలో స్వావలంబనపై భారత్ దృష్టి సారించిందని, ఖిఆత్మనిర్భర్ భారత్ఖి విధానం ఇందుకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. బీఎస్ఎన్ఎల్ దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ టెక్నాలజీని వాడటం, దానిని 5జీకి అప్‌గ్రేడ్ చేసుకునే వీలుండటం గొప్ప విషయమని తెలిపింది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత్ ఇప్పటికే 6జీ స్పెక్ట్రమ్ రోడ్‌మ్యాప్‌ను కూడా ప్రకటించడం దాని దీర్ఘకాలిక ప్రణాళికకు అద్దం పడుతోందని 5జీ, కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్ వంటివి తయారీ, సేవల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా పెంచుతాయని నివేదిక అంచనా వేసింది.

## వాణిజ్యం

# అక్టోబరు రెండునుంచి 'బ్యాంకింగ్ ఫర్ యూత్'

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** దేశంలోని మరింత మంది యువతను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు యువతకు ఎలాంటి ఛార్జీలు లేకుండా నో ఫ్రిల్స్ బ్యాంకు ఖాతాలను అందించాలని కేంద్ర



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. మంగళవారం జరిగిన పీఎస్బీ కాన్‌క్లేవ్‌లో ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకులు నెల రోజుల పాటు బ్యాంకింగ్ ఫర్ యూత్ ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 16 ఏళ్ల పైబడిన యువతతో పాటు యువ ఉద్యోగులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయనున్నారు. యువతకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడంతో పాటు, వారి ఆర్థిక ప్రయాణంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను భాగస్వాములుగా చేయడం ఈ ప్రచారం ప్రధాన ఉద్దేశం.యువ భారతీయుల ఆర్థిక ప్రయాణంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలక భాగస్వాములుగా మారాలని సీతారామన్ అన్నారు. యువత కోసం చేపట్టే ఈ కార్యక్రమం కేవలం నెల రోజులకే పరిమితం కాకుండా, నిరంతరం కొనసాగిస్తూ యువతను బ్యాంకింగ్ వ్యవస్థలో భాగం చేయాలని సూచించారు.అదే సమయంలో యువతకు అధికారిక రుణ వ్యవస్థపై అవగాహన కల్పించడంపై బ్యాంకులు దృష్టి పెట్టాలని ఆమె చెప్పారు.




# సెన్సెక్స్, నిఫ్టీలకు తప్పని నష్టాలు

### సూచీలపై ఐటి షేర్ల ఒత్తిడి

**ముంబయి, ఆగస్టు 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్‌లోకూడా పతనం కాగా, సెన్సెక్స్ వరుసగా మూడో రోజు నష్టపోయింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 91 డాలర్లను దాటడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. విదేశీ సంస్థాగత మదుపరుల కొనసాగుతున్న అమ్మకాలు, అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం, రూపాయి బలహీనపడటం కూడా మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి.ఐటీ షేర్లలో భారీగా అమ్మకాలు కనిపించగా, ఫార్మా, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు మాత్రమే ప్రధానంగా లాభపడ్డాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 492.70 పాయింట్లు నష్టపోయి 77,235.46 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 132.75 పాయింట్లు క్షీణించి 24,154.90 వద్ద స్థిరపడింది. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 1.08 శాతం, ఆరు సెషన్లలో నిఫ్టీ 1.74 శాతం నష్టపోయాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్ 2.18 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 1.78 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.82 శాతం నష్టపోయి సూచీపై ఒత్తిడిని పెంచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 150 సూచీ 0.35 శాతం పడిపోగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 250 సూచీ 0.19 శాతం లాభపడింది. బీఎస్ఈలో మొత్తం 1,930 షేర్లు లాభపడగా, 2,384 షేర్లు నష్టపోయాయి. మరో 233 షేర్లలో మార్పు లేదు.కమోడిటీ మార్కెట్‌అక్టోబర్ 2026 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బ్రెంట్ ముడిచమురు ఫ్యూచర్స్ ధర 18 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 91.45 డాలర్లకు చేరింది. విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే పాక్షికంగా కన్వర్టబుల్ రూపాయి 95.65 వద్ద ట్రేడవుతుండగా, గత సెషన్‌లో ఇది 95.42 వద్ద ముగిసింది.అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.42 శాతం తగ్గి రూ.1,52,282కు చేరాయి.ఇక షేర్లపరంగా సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. వన్ 97 కమ్యూనికేషన్స్ 2.15 శాతం, నెల్కో 12.62 శాతం పడిపోయాయి.మరోవైపు డీసీఎక్స్ సిస్టమ్స్ 3.19 శాతం, నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా 2.16 శాతం, కేపీఐ గ్రీన్ ఎనర్జీ 1.95 శాతం లాభపడ్డాయి.

# కోరం లేక టాటా సన్స్ ఏజీఎం తొలిసారి వాయిదా

**ముంబయి, ఆగస్టు 17:** టాటా గ్రూప్ చరిత్రలో తొలిసారిగా టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. అవసరమైన స్థాయిలో సభ్యుల ప్రాతినిధ్యం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా, మరికొందరు డైరెక్టర్లు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, డైరెక్టర్ అనితా జార్జ్ మాత్రం బాంబే హౌస్‌కు స్వయంగా హాజరయ్యారు. అయితే అవసరమైన కోరం పూర్తికాకపోవడంతో ఏజీఎంను వాయిదా వేశారు.ప్రస్తుతం సర్ రతన్ టాటా ట్రస్ట్‌పై నియంత్రణపరమైన ఆంక్షలు కొనసాగుతున్నాయి. టాటా సన్స్ ఆర్టికల్ 86 ప్రకారం ఏజీఎంకు కనీసం ఐదుగురు సభ్యులు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది. ఇందులో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లు సంయుక్తంగా నామినేట్ చేసిన ఒక అధీకృత ప్రతినిధి తప్పనిసరిగా ఉండాలి. ట్రస్ట్ బోర్డు కూర్పుపై విచారణ పెండింగ్‌లో



ఉండటంతో మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ ఆదేశాల మేరకు మే 15 నుంచి సర్ రతన్ టాటా ట్రస్ట్ సమావేశాలు నిర్వహించడం లేదా నిర్ణయాలు తీసుకోవడంపై ఆంక్షలు ఉన్నాయి. ఏజీఎంలో టాటా గ్రూప్ భవిష్యత్ నాయకత్వ మార్పు, చంద్రశేఖరన్ వారసుడి ఎంపిక ప్రక్రియ ప్రధానంగా చర్చకు రావాల్సి ఉంది. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన ఓ సీనియర్ అధికారిని కలిసినట్లు సమాచారం. అత్యవసరంగా చంద్రశేఖరన్ వారసుడిని ఎంపికచేయాల్సిన పరిస్థితి ఉంది. లేనిపక్షంలో మార్కెట్లలో టాటాగ్రూప్ ప్రతిష్ట క్షీణించడంతోపాటు లిస్ట్ అయిన షేర్లు భారీ పతనం కూడా చవిచూడక తప్పదు.




# రూ.5వేల కోట్లనుంచి రూ.15 వేలకోట్లకు ఎఫ్‌డిఐ పరిమితులు పెంపు

**న్యూఢిల్లీ,ఆగస్టు 18:** భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఎఫ్డీఐల నిబంధనలను భారీగా సరళీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పెద్ద మొత్తంలో విదేశీ పెట్టుబడులకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, డౌన్‌స్ట్రీమ్ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను కూడా సడలించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ డిపిఐఐటి, ఎఫ్‌డీఐ అనుమతుల ప్రక్రియను క్రమబద్ధీకరించే ప్రతిపాదనను త్వరలో ముందుకు తీసుకురానున్నది.రూ. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం అవసరమయ్యే ఎఫ్‌డీఐ ప్రతిపాదనల పరిమితిని ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ రూ.5,000 కోట్ల పరిమితి 2015 నవంబర్ నుంచి ఇప్పటివరకు మారలేదు.ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే రూ.15,000 కోట్ల వరకు విలువైన విదేశీ పెట్టుబడి ప్రతిపాదనలను సంబంధిత మంత్రిత్వ శాఖలే పరిశీలించి ఆమోదిస్తాయి. ప్రతి ప్రతిపాదనను కేబినెట్‌కమిటీ వద్దకు పంపాల్సిన అవసరం ఉండదు. అనుమతుల ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు, పెట్టుబడిదారులకు ఎదురయ్యే జాప్యం తగ్గే అవకాశం ఉంది.డౌన్‌స్ట్రీమ్ పెట్టుబడులపై కూడా సడలింపులుడౌన్‌స్ట్రీమ్ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనల్లోనూ మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రతిపాదిత విధానం ప్రకారం, ఒక భారతీయ సంస్థకు పరోక్షంగా విదేశీ పెట్టుబడి వచ్చినప్పుడు, పైస్థాయి దేశీయ సంస్థ ఇప్పటికే అవసరమైన ప్రభుత్వ అనుమతి పొందినట్లయితే, ఆ భారతీయ సంస్థకు మరోసారి ప్రత్యేక ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేకపోవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వ అనుమతి మార్గంలో ఉన్న రంగాల్లో డౌన్‌స్ట్రీమ్ పెట్టుబడులు చేయాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి.




# వాల్‌స్ట్రీట్‌లోజేన్‌స్ట్రీట్‌కు రూ.1.25 లక్షలకోట్లనష్టం..!

**న్యూయార్కు, ఆగస్టు 17:** వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్ దిగ్గజం జేన్ స్ట్రీట్ జులై నెలలో భారీ నష్టాలను చవిచూసింది. గత పదేళ్ల కాలంలో తొలిసారిగా ఒక నెలలో సుమారు రూ. 1.25 లక్షల కోట్ల పైచిలుకు నష్టాన్ని నమోదు చేసింది. ఎఐ రంగంపై దృష్టి సారించిన సిచ్యుయేషనల్ అవేర్‌నెస్ అనే హెడ్జ్ ఫండ్‌లో చేసిన పెట్టుబడులే ఈ భారీ నష్టానికి ప్రధాన కారణంగా నిలిచాయి. ఓపెన్ ఏఐ మాజీ పరిశోధకుడు లియోపోల్డ్ అషెన్‌బ్రెన్నర్ స్థాపించిన ఈ హెడ్జ్ ఫండ్, ఏఐ, సెమీకండక్టర్ షేర్ల పతనంతో తీవ్రంగా దెబ్బతింది. జూన్ నాటికి ఈ ఫండ్ శాన్‌డిస్క్‌లో సుమారు 5.7 బిలియన్ డాలర్లు, మైక్రాన్ టెక్నాలజీలో 5.6 బిలియన్ డాలర్ల మేర భారీగా పెట్టుబడులు పెట్టింది. జులైలో శాన్‌డిస్క్ షేర్లు 47 శాతం, మైక్రాన్ షేర్లు 29 శాతం మేర పడిపోవడంతో, ఈ ఫండ్ పోర్ట్‌ఫోలియో విలువ ఏకంగా 67 శాతం క్షీణించింది. మార్జిన్ కాల్స్ ఒత్తిడి పెరగడంతో, ఫండ్‌లోని పబ్లిక్ ఈక్విటీలను సిటాడెల్ సంస్థకు తక్కువ ధరకే విక్రయించాల్సి వచ్చింది. సదరు ఫండ్‌లో గణనీయమైన వాటా కలిగి ఉండటంతో పాటు, ఏఐ సంబంధిత స్టాక్స్‌లో నేరుగా పెట్టుబడులు పెట్టడం వల్ల జేన్ స్ట్రీట్‌కు సుమారు 15 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. ఏడాది మొత్తంగా చూస్తే ఈ పెట్టుబడిపై ఇప్పటికీ సానుకూల ఫలితాలనే పొందుతున్నామని సంస్థ తన ఉద్యోగులకు పంపిన అంతర్గత నోట్‌లో పేర్కొంది. ఈ భారీ నష్టంవచ్చినా జూలై నాటికి ఈ ఏడాదిలో 40 బిలియన్ డాలర్లకు పైగా ట్రేడింగ్ ఆదాయాన్ని ఆర్జించినట్లు సంస్థ వెల్లడించింది. అమెరికాకు చెందిన జేన్ స్ట్రీట్ సంస్థ భారత స్టాక్ మార్కెట్ నిబంధనలను ఉల్లంఘించి,

# ఫ్రిజ్‌ను ఇలా వాడితేసరి !



మారుతోన్న కాలానికి అనుగుణంగా మనలో చాలామంది ఇళ్లలో ఫ్రిజ్ వాడకం పెరిగింది. తాజా పండ్లూ, కూరగాయలూ, పాలు, మిగిలిన కూరలేవైనా సరే.. మొదట వెళ్లేది ఫ్రిజ్‌లోకే కదా! ఆహారం పాడవకుండా ఉంటుందనుకుంటాం కానీ, దానివల్ల కలిగే నష్టాలూ బోలెడు.. వండిన ఆహారమైనా, వండనిదైనా సరే.. ఫ్రిజ్‌లో పెడితే అందులోని పోషకాలు ముఖ్యంగా విటమిన్-సి, బి లు నాశనమవుతాయట. చల్లని వాతావరణంలో బ్యాక్టీరియా వృద్ధిచెందే అవకాశమూ ఎక్కువే. తద్వారా రోగనిరోధక శక్తి తగ్గిపోయి జలుబు, దగ్గు, జ్వరం..లాంటి వైరల్ వ్యాధుల బారినపడతాం. మొదట రుచిలో మార్పు కనిపిస్తుంది. ఆ తరవాత వాసన కూడా మారిపోతుంది. దీర్ఘకాలం ఇలానే తింటుంటే అనారోగ్యం పాలవుతామని చెబుతున్నారు నిపుణులు. ఎలా భద్రపరచామనననదీ ముఖ్యమే.. నిజానికి ఒక్కో ఆహార పదార్థాన్నీ ఒక్కో ఉష్ణోగ్రత వద్ద భద్రపరచాలి. వండినవీ, వండకుండా ఉన్నవీ, పాల ఉత్పత్తులు.. వంటివన్నీ వేటికవే వేరుగా ఉంచాలి. వండిన ఆహారాన్ని గ్లాస్ లేదా మెటల్ డబ్బాల్లో ఉంచడం శ్రేయస్కరం. పచ్చి కూరగాయలూ, పండ్లలో నీటిశాతం తగ్గకుండా జాగ్రత్తపడాలి. ఎక్కువగా ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం తినే వాళ్లు తరచూ అనారోగ్యాలకూ గురవుతున్నారట. కమర్షియల్ కంటే ఇంట్లో రిఫ్రిజిరేటర్ వల్ల ఆహారం కలుషితం అయ్యే అవకాశాలు మూడురెట్లు అధికంగా ఉన్నాయని పరిశోధనలూ చెబుతున్నాయి. కాబట్టి, ఫ్రిజ్‌లోని ఆహారానికి సరిగా మూతలు పెట్టడంతోపాటు ఎక్కువ రోజులు ఆహారం నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఫ్రిజ్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలి. డైరీ ఉత్పత్తులూ, వండిన ఆహారం, వండని కూరగాయలూ, పండ్లూ వంటి వాటిని విడివిడిగా సర్దుకోఆలి. అన్నింటికంటే ముఖ్యంగా ఫ్రిజ్‌లో అవసరముననవీ, లేనివీ పెట్టేసి నింపేయ కూడదు. దానివల్ల పోషక విలువలు తగ్గిపోవడమే కాక, నాణ్యతా తగ్గుతుంది. కాబట్టి, అవసరమైనంత మేరకే వండుకోవడం అలవాటు చేసుకోవాలి. ఒక్కోసారి మిగిలినా, వెంటనే తినడానికి ప్రయత్నించాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉండగలం. □

**35 ఏళ్ల పైబడిన వారిలో జుట్టు తెల్లబడడం** అనేది చాలా సాధారణ అంశం. అయితే చాలామందిలో వంశపారపర్యంగా తెల్లజుట్టు వస్తుంటుంది. అంటే కుటుంబంలో ఎవరికైనా చిన్న వయసులోనే తెల్లజుట్టు వచ్చి ఉంటే తర్వాత తరాల వారికి కూడా వచ్చే అవకాశం ఉంటుంది.

# జుట్టు నెరిసిపోతోందా..



కొంతమందిలో పోషకాహార లోపం వల్ల కూడా జుట్టు తెల్లబడుతుంది. తీసుకునే ఆహారంలో ముఖ్యమైన విటమిన్లు, ప్రొటీన్లు, మినరల్స్ లోపం ఉన్నా జుట్టు తెల్లబడుతుంది. ఇవే కాకుండా గాఢత ఎక్కువగా ఉన్న షాంపూలు ఉపయోగించడం.. జెల్స్, స్టైలింగ్ వల్ల కూడా తొందరగా తెల్లజుట్టు వచ్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ వంశపారంపర్యంగా తెల్లజుట్టు వస్తోందంటే దానికి ఎలాంటి చికిత్స ఉండదు. అది కాకుండా ఏదైనా పోషకాల లోపం వల్ల జుట్టు తెల్లబడుతోందంటే దానికి సంబంధించిన చికిత్స తీసుకోవడం వల్ల జుట్టు తిరిగి నల్లబడే అవకాశం ఉంటుంది. వీటికి తోడు ఒత్తిడి, ఆందోళన సమస్యలను తగ్గించుకోవాలి. తీసుకునే ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండేటట్లు చూసుకోవాలి. అలాగే శరీరానికి సరిపడినంత నిద్ర అవసరం. తగినన్ని నీళ్లు తాగడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల జుట్టు తెల్లబడడాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. □

# కేకోయ్ కేక !



ఏమండోయ్! ఆ ఇద్దరమ్మాయిలు అచ్చం అచ్చు గుద్దినట్లు ఒకేలా ఉన్నారు కదూ! పోనీ కవల పిల్లలు అయి వుంటారా? కావచ్చు. కాక పోనూ వచ్చు. ఎందుకో కొంచెం తేడా ఉన్నట్లు అనిపిస్తోంది. అలా అని.. ఇవేవో మైనపు బొమ్మలని భ్రమ పడేరు. కానీ + కాదండోయ్. వీటిని సెల్ఫీ కేకులంటారండోయ్. ప్రపంచవ్యాప్తంగా ట్రెండీగా వున్న ఒక విచిత్రమైన కళ 'సెల్ఫీ కేకుల' తయారీ గురించి ఇక్కడ మనం చెప్పుకోవాల్సిందే. మనిషిని లేదా వారి ఫోటోను అలా చూశారంటే వారి ఫోటో ఆకృతి అక్కడ జీవం పోసుకుంటుంది. అదన్నమాట విషయం. కేక్ అంటే ఓవెన్ తో కాస్త విభిన్నంగా చేసే వంటకం మనకు తెలిసిందే. కానీ ఇప్పుడు 'సెల్ఫీ కేకుల తయారీ ఓ కళ. ఒక కొత్త ఆలోచనకు రూపకల్పన చేస్తే అదే సెల్ఫీ కేక్ అయి కూర్చుంది. రేపో మాపో ఇదేదో భారత దేశానికి 65 వ కళగా వచ్చేసినా ఆశ్చర్యపోకండి. సహజత్వం వుట్టిపడే వీటిని చూస్తే సెల్ఫీ కేకులని చెప్పినా నమ్మరు. ఇది కేకు అనీ గుర్తుపట్టడం కష్టమే మరి. ఫోటో కేకులు, సిండ్రెల్లా కేకులూ, థీమ్డ్ కేకులు.. ఇలా విభిన్న రూపాల్లో, రంగుల్లో ఆకట్టుకుంటున్నాయి. బేకర్లు కూడా దాన్ని కళ్లు తిప్పుకోలేనంత ఆకర్షణీయంగా రూపుదిద్దడంలో వారి పనితనం మెచ్చు కోదగినది. చూడగానే కట్టిపడేసేంత ప్రత్యేకంగా, ఇవి నిజంగా కేకులేనా అనిపించేంత విభిన్నంగా తయారు చేయ గలుగుతున్నారు. ఇప్పుడు ఒక ఫోటోను దగ్గర పెట్టుకుని వాటితో కళాత్మకంగా మన ఫోటోను అచ్చు గుద్దినట్లు పోత పోసేయచ్చు. ఫోటో ఆధారంగా అచ్చం అదే మనిషిని పోలిన కేకు శిల్పం చెక్కడం ముందు ముందు రోజుల్లోఎంతో ఈజీ. సహజత్వం వుట్టిపడే వీటిని చూస్తే సెల్ఫీ కేకులని చెప్పినా నమ్మరు.

ఇది కేకు అని గుర్తుపట్టలేరు. ఈ కేకు బొమ్మల్ని కట్ చేసి, ఆ తర్వాత తినిపిస్తే కానీ నిజమైన కేకేనని నమ్మరు! చెప్పాలంటే మనిషినీ బొమ్మనూ పక్కపక్కనే పెట్టి ఫొటో తీస్తే ఏది కేకూ, ఏది మనిషీ అన్నది వెంటనే గ్రహించలేనంత జీవకళ ఉట్టిపడే రూపకల్పన ఇది. దాన్ని చూస్తే తినే పదార్థమనే అనిపించదు. ఆనక దాన్ని తినవచ్చునని ఆలోచన కూడా తోచదు. వీటిని సాధారణ కేకుల్లాగే పైనాపిల్, బటర్స్కాచ్, రెడ్వెల్వెట్.. ఇలా రకరకాల ఫ్లేవర్లలో తయారుచేస్తారు. తర్వాత దానిమీద షుగర్ ఫొండెంట్ పొరను కప్పుతారు. బాగా సునిశితంగా రావాలంటే మోడలింగ్ చాకొలెట్గా పిలిచే ఫాండెంట్ తరహా పదార్థాన్ని దీనికోసం వాడతారు. తర్వాత కావలసిన ఫోటోను చూస్తూ చాకుల్లాంటి పదునైన వస్తువులు, కొన్ని ప్రత్యేక పరికరాల సాయంతో ఫొండెంట్ మీద కళ్లూ ముక్కూ నోరు, వెంట్రుకలు వగైరా తీర్చిదిద్దుతారు. దానిమీద ఎడిబుల్ రంగులను అద్ది ఫొటోలో ఉన్నట్టే అచ్చుగుద్దినట్టు బొమ్మను తయారుచేస్తారు. ఎంచుకున్న చిత్రాన్నిబట్టి తయారీకి మూడు నాలుగు రోజులు మొదలు కొన్ని వారాల వరకూ సమయం పడుతుంది. ఖరీదు మాత్రం ఎక్కువ. టర్కీకి చెందిన తుబా గెకల్, అమెరికాకు చెందిన నటాలీ సిడెసెర్ఫ్ సెల్ఫీ కేకుల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి గడించారు. □

# ఆనందంగా తినేయండి !



**ఎవరైనా కోప్పడినా, అసంతృప్తి ఎదురైనా. అంతెందుకు హార్మోనులు పెట్టే చికాకు.. ఇలా మన మూడ్ ఆఫ్ చేయడానికి ఎన్నెన్ని కారణాలో! అవన్నీ పక్కకు పోయి మనసు ఆనందంతో నిండి పోవాలా? ఇంట్లో దొరికే వీటికి ఆ శక్తి ఉందట.. ప్రయత్నించండి.**

వేయించినవైనా, ఉడకబెట్టినవైనా కాలక్షేపానికి శనగలకు మించినవి లేవు. వీటిల్లోని సెలెనియం, జింక్, మెగ్నీషియం ఒత్తిడి, ఆందోళనకు చెక్ పెట్టడమే కాదు, మెదడులోని నరాలపై సానుకూల ప్రభావం చూపి మనసును ప్రశాంతంగా మారుస్తాయట. బాదం, వాల్‌నట్స్, గుమ్మడి గింజలు ట్రిప్టోఫాన్, ఆరోగ్యకరమైన కొవ్వులుంటాయి. ఇవీ మనసును శాంతపరిచేవే. అన్నీ కలిపి గుప్పెడు తినేస్తే సరి. ఓట్స్ కూడా ఈ మాయ చేయగలవు. వేడి పాలు, ఒగ్లాసు మజ్జిగ, పోని కప్పు పెరుగు.. ఏది అందుబాటులో ఉన్నా లాగించేయండి. డెయిరీ ఉత్పత్తుల్లో ఉండే బీటా కాస్మోమార్ఫిన్లు సైరటోనిక్ అదేనండీ అందాన్నిచ్చే హార్మోను విడుదలకు సాయపడతాయట. □

# జీడిపప్పు కీరా సలాడ్



**కావలసినవి :**

కీరా: రెండుజీడిపప్పు: గుప్పెడు పచ్చిమిరపకాయ: ఒకటికొత్తిమీర: నాలుగు రెబ్బలువెల్లుల్లి రెబ్బలు: రెండుపెరుగు: రెండు టేబుల్ స్పూన్లు ఉప్పు: తగినంత

**తయారీ :** జీడిపప్పును వేడి నీళ్లలో గంటసేపు నానబెట్టుకోవాలి. కీరాను శుభ్రంగా కడిగి, చెక్కు తీసి సన్నటి ముక్కలుగా తరిగి పక్కకు పెట్టుకోవాలి. నానిన జీడిపప్పుతోపాటు రెండు వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి, ఉప్పు కలిపి మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. పేస్ట్‌లా వచ్చేందుకు కొద్దిగా నీళ్లు చిలకరించుకొంటే సరి! ఇందులో రుచిని బట్టి మిరపకాయ.. అది వద్దనుకుంటే మిరియాల పొడి (అర టీస్పూన్) వాడుకోవచ్చు. కొత్తిమీరను సన్నగా తరిగి పెట్టుకోవాలి. తినాలనుకునే ముందు కీరాముక్కల్లో ఈ కాజు పేస్ట్‌ను కలుపుకొని కొత్తిమీర చల్లుకోవాలి. చివర్లో పెరుగును కూడా జోడిస్తే మరింత రుచిగా ఉంటుంది. □

# శుభసూచకం

**మాసాలలో** శ్రావణం అత్యంత ఫల ప్రదమైనదని పలువురి నమ్మకం ఈ మాసములో వచ్చే పండుగలు, శుభమూహుర్తాలు మిక్కుటం. నాగపంచమి ఈ మాసంలోనే ఎక్కువగా ఆచరిస్తారు. రక్షాబంధన్ కూడా శ్రావణంలోనే రావడం, అక్కాతమ్ముడుల అపూర్వ బంధనానికి ప్రతీక. ఇక ప్రతి సోమవారంలలో శివాలయాలు కిక్కిరిసి పోతుంటాయి. ఓం నమంః శివాయ అని భక్తులు తమ భక్తిని ప్రదర్శిస్తూ పునీతమైతారు. ప్రతి మంగళవారం గౌరీదేవి పూజలు మగువలు, పెళ్లికాని స్త్రీలు, వివాహ బంధం పటిష్టం కావడానికి ఆలు మగల మధ్య వచ్చే సంఘర్షణలు సమసిపోవాలని గౌరి పూజ చేస్తారు. గౌరి అంటే పార్వతి దేవి ఆ దేవి కటాక్షం ఎల్ల వేళలా ఉండాలని కోరుకుంటారు. భర్త ఉన్న స్త్రీలే కాకుండా కోల్పయిన వారు కూడా గౌరి దేవతను కొలుస్తారు అందరిని కరుణించే స్త్రీ మూర్తి గౌరి. అందుకే మంగళగౌరి వ్రతం ప్రతి వారం అందులో ఈ మాసంలో మంగళ వారం ఆచరిస్తే పుణ్యం ఉంటుందని ఓ విశ్వాసం. చాలామంది స్త్రీలు, యువతులు వారి పేర్లు మంగళ అని మంగళగౌరి అని, గౌరిశ్రీ అని పార్వతి అని ఇలా దేవతల పేర్లు పెట్టుకుం టారు. ఊరికే దేవి పేర్లు పెట్టుకుంటే చాలదు. ఆ దిశలో వారి ప్రవర్తన మాట తీరు కూడా సౌమ్యంగా ఉండాలి. మొత్తానికి స్త్రీలు కోపం ప్రదర్శించకుండ సంయమనం పాటించి సంసారంలో తగిన జాగ్రత్తలు పాలిస్తే అది శ్రావణంలో పాటిస్తే బాగుంటుంది. అది క్రమంగా అలవాటుగా మారి ప్రతి గృహంలో నిత్య శోభ ఉంటుందని విశ్వాసం. □

## తెర

# 'సర్దార్ సర్వాయి పాపన్న' ప్రి రిలీజ్ ఈవెంట్



పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన యానిమేషన్ మూవీ "సర్దార్ సర్వాయి పాపన్న". ఈ సినిమాను వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. ఈ యానిమేషన్ మూవీ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లా డుతూ మేము ఆహ్వానించగానే మా కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని ఈ నెల 21న రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఈ చిత్రాన్ని మా ఆర్కే ఫిలింస్ ద్వారా రిలీజ్ చేస్తున్నాం. దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న 376 జయంతి సందర్భంగా ఈ రోజు మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహిస్తున్నాం. హీరోయిన్ పాయల్ ముఖర్జీ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న మూవీకి సంబం ధించిన కొన్ని సన్నివేశాలను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. ఆ సీన్స్ అన్నీ నాకు బాగా నచ్చాయి. సింగర్ ఏపూరి సోమన్న మాట్లాడుతూ కోట్లాది మంది బహుజనులు ఈ సినిమా చూసేందుకు వేచి ఉన్నారు.ప్రముఖ రచయిత, పాత్రికేయుడు పొన్న రవిచంద్ర మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను చాలా మంది వక్రీకరించారు. కానీ దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేసి ఆయన చరిత్రను నిజంగా ప్రజల ముందుకు తీసుకురాబోతున్నారు.



# ప్రొడక్షన్ నెం.1 క్రేజీ గ్రాండ్‌గా లాంచ్

నిధి అగర్వాల్ హీరోయిన్ గా వరాహ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 1గా తెరకెక్కనున్న కొత్త చిత్రాన్ని ఈరోజు గ్రాండ్‌గా లాంచ్ చేశారు. మైథాలజీ థ్రిల్లర్ గా తెరకెక్కనున్న చిత్రానికి సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పీ. అశోక్, పీ. రేణుక కెమెరా స్విచ్ ఆన్ చేయగా, హుర్మత్ సర్నా క్లాప్ ఇచ్చారు. హీరోయిన్ నిధి అగర్వాల్ తోపాటు చిత్ర యూనిట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. పోస్టర్‌లో నిధి అగర్వాల్ లుక్ చాలా ఇంట్రెస్టింగ్‌గా, ఇప్పటి వరకు ఆమె కనిపించని కొత్త అవతార్‌ను పరిచయం చేసేలా ఉంది. హీరోయిన్ ఓరియం టెడ్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం దర్శకుడు పవర్ఫుల్ కథని సిద్ధం చేశారు.ఈ సినిమా టైటిల్‌తో పాటు మిగతా నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.

# 'ఇరుముడి' కొత్త ఎక్స్‌పీరియన్స్: దర్శకుడు శివ నిర్వాణ



**రామ్ చరణ్ ఈ సినిమాలో కనిపిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. నిజంగా ఆయన కనిపిస్తారా?**

లేదండి. అది సోషల్ మీడియా ప్రచారం మాత్రమే. రామ్‌చరణ్ అయ్యప్ప భక్తులు. ఆయనకు ఆ వైబ్ వుంటుంది. బహుశా అభిమానులు అలా కోరుకున్నారేమో. కానీ ఇందులో చరణ్ కనిపిస్తారని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు.

**'ఇరుముడి' టైటిల్ ప్రకటించినప్పటి నుంచి చాలా అంచనాలు ఉన్నాయి. తర్వాత వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ ఆ అంచనాలను ఇంకా పెంచింది. మరి ఇన్ని భారీ అంచనాలను సినిమా అందుకుంటుందా?**

ఈ సినిమాలో మొత్తం మూడు లేయర్స్ ఉంటాయి. ఒకటి అయ్యప్ప స్వామి మాల నేపథ్యం, అలాగే ఫ్యామిలీ, మరొకటి క్రైమ్ యాంగిల్. ప్రమోషన్స్ కూడా ఆ కంటెంట్‌కు తగ్గట్టే ప్లాన్ చేసుకున్నాను. ఆ ప్లాన్ ప్రకారం ఈ సినిమాకు సంబంధించి ప్రతి ఒక్క విషయాన్ని రివీల్ చేసుకుంటూ వచ్చాము.

**రవితేజని చాలా కొత్తగా చూపించారు. ఆయనను అలా చూపించడానికి మీరు చేసిన ప్రిపరేషన్ ఏమిటి?**

ఎప్పుడైనా ఎవరూ టచ్ చేయని పాయింట్ చెప్పున్నప్పుడు ఒక యాక్టర్ చేస్తే ఒకలా ఉంటుంది. అదే స్టార్ చేస్తే దాని రీచ్ మరోలా ఉంటుంది. అయ్యప్ప స్వామిమాల నేపథ్యం,

**ఫస్ట్ లుక్ రిలీజ్ అయిన తర్వాత మలయాళ మాలికాపుర తో పోలిక వచ్చింది కదా? ఎలా అనిపించింది మీకు?**

అయ్యప్ప స్వామి బ్యాక్‌గ్రౌండ్‌లో, ముఖ్యంగా సౌత్‌లో చాలా తక్కువ సినిమాలు వస్తున్నాయి. గతం లో ఎప్పుడో ఒకసారి అయ్యప్ప స్వామి మహత్యం అనే సినిమా వచ్చింది. ఒక రవితేజలాంటి స్టార్ హీరోతో ఇలాంటి సినిమాని మనం అప్పటివరకు చూడలేదు.

**అయ్యప్ప స్వామి మాల నేపథ్యంలో కథ ఉంటుంది కదా? దీని గురించి మీరు ఎలాంటి హోంవర్క్ చేశారు?**

నేను ఈ కథ అనుకున్న తర్వాత అయ్యప్ప స్వామి మాల గురించి చాలామందిని అడిగి అన్ని విషయాలు తెలుసుకున్నాను.

**ఈ కథ అనుకున్నప్పుడే రవితేజ ని అనుకున్నారా?**

ఈ కథ అనుకున్నప్పుడు ఎవరినీ మనసులో అనుకోలేదు. కాకపోతే ఇది రవితేజకి చెప్పిన తర్వాత ఈ పాత్రకి పర్ఫెక్ట్‌గా సరిపోతారు అనిపించింది.

**మల్లెపూల పల్లకి పాట గురించి?**

మల్లెపూల పల్లకి పాటకి అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. .**ముందే ఇరుముడి టైటిల్ అనుకున్నారా?**

అవునండి. ఇందులో తండ్రికి, కూతురికి... అలాగే అయ్యప్ప భక్తుడికి, మాలకు... అలాగే ఒక క్రైమ్ ఎలిమెంట్ కి ముడి ఉంది. ఈ మూడు ముళ్లను కలిపి ఇరుముడి అని అనుకున్నాను.

# 'సిగ్మా' అక్టోబర్ 2న వరల్డ్‌వైడ్ రిలీజ్



లైకా ప్రొడక్షన్స్ - సుభాస్కరన్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రం తొలి రెండు పాటలకు వచ్చిన రెస్పాన్స్‌తో మరింత పెరిగిన అంచనాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్న సినిమాల్లో"సిగ్మా ఒకటి. లైకా ప్రొడక్షన్స్, ఏ. సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ సినిమా ద్వారా జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆసక్తికరమైన కాస్టింగ్‌తో పాటు ఇప్పటికే విడుదలైన తొలి రెండు పాటలు "సిగ్మా స్టైల్, "అయ్యయ్యో అమ్మాడ్డి సినిమాపై మరింత బజ్ క్రియేట్ చేశాయి. సినిమా కథ, మెయిన్ పాయింట్‌కి సంబంధించిన వివరాలను మేకర్స్ ఇంకా సీక్రెట్‌గానే ఉంచారు. అయితే ఇప్పటికే విడుదలైన రెండు పాటల విజువల్స్ "సిగ్మా ప్రపంచం ఎలా ఉండబోతుందనే దానిపై మంచి క్లూ ఇచ్చాయి. "సిగ్మా స్టైల్ లో కనిపించిన ఎనర్జీకి పూర్తి భిన్నంగా "అయ్యయ్యో అమ్మాడ్డి మెలోడీతో ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ తెరకెక్కిన తీరుపై లైకా ప్రొడక్షన్స్ కూడా సంతృప్తి వ్యక్తం చేసింది. అనుకున్న షెడ్యూల్ ప్రకారం షూటింగ్ పూర్తవ్వడంతో పాటు, జేసన్ సంజయ్ ప్రొఫెషనలిజం, క్లారిటీ, ప్రతి విషయంలో ఆయన చూపించిన పర్ఫెక్షన్‌ను నిర్మాణ సంస్థ ప్రత్యేకంగా ప్రశంసించింది. లైకా ప్రొడక్షన్స్ హెడ్ జి.కె.ఎం. తమిళ్ కుమరన్ మాట్లాడుతూ.. "అక్టోబర్ 2న"సిగ్మా వరల్డ్‌వైడ్ థియేట్రికల్ రిలీజ్ అవుతుందని ప్రకటించడం ఆనందంగా ఉంది. సినిమా చాలా బాగా వచ్చింది. పాటలకు వస్తున్న రెస్పాన్స్ సినిమాపై ఎగ్జైట్‌మెంట్‌ను మరింత పెంచింది. "సిగ్మా కోసం మేకర్స్ వినూత్నమైన ప్రమోషనల్, మార్కెటింగ్ క్యాంపెయిన్‌ను ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే ప్రమోషన్స్ ప్రారంభం కానుండగా, టీజర్, ట్రైలర్, ఆడియో లాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్స్‌ను కూడా త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు.

# పవన్ కళ్యాణ్ నా వర్క్ చూసి పర్సనల్‌గా మాట్లాడారు: సంగీత దర్శకుడు అజయ్ అరసాడ



**మీ నేపథ్యం గురించి చెప్పండి?..**

మా ఫ్యామిలీ, నా రక్తంలోనే ఆర్ట్, మ్యూజిక్ ఉంది. మాది వైజాగ్. టీసీఎస్‌లో ఉద్యోగం కూడా చేశాను. ఏడేళ్లు జాబ్ చేశాను. అలా జాబ్ చేస్తుండగానే రెండు సినిమాలకు పని చేశాను. నాకు దేవీ శ్రీ ప్రసాద్ స్ఫూర్తి. మా అమ్మ, భార్య సపోర్ట్ వల్లే నేను ఈ ఇండస్ట్రీలోకి రాగలిగాను.

**చిన్న చిత్రాల్ని చేస్తుండటంలో మీరు ఎదుర్కొన్న ఛాలెంజెస్ ఏంటి?..**

చిన్న చిత్రాలకు పని చేయడం వల్ల నాకు ఎక్కడా ఇబ్బంది కలగలేదు. మంచి ప్రొడక్షన్స్ కావడం వల్ల ఎప్పుడూ కూడా పేమెంట్స్ విషయంలో తేడా రాలేదు.

**మీకంటూ ఓ ప్రత్యేకత ఏర్పడాలని ప్రయత్ని స్తున్నారా?..**

అన్ని రకాల జానర్లు, కథల్ని చేయాలని అనుకుంటున్నాను. నా వద్దకు వచ్చిన కథకు న్యాయం చేయాలని చూస్తాను.

**బడ్జెట్‌ను పట్టి మ్యూజిక్ మారుతుందా?..**

ఒక్కో సింగర్ ఒక్కోలా ఛార్జ్ చేస్తారు. నా పాటకు ఎవరు సెట్ అవుతారు అని అనుకుంటే వారితోనే ప్రొసీడ్ అవుతాను.

**థియేటర్ కోసం పని చేసినప్పుడు, ఓటీటీ కోసం పని చేసినప్పుడు ఉండే తేడా, మీకు కలిగే ఫీలింగ్ ఏంటి?..**

మేం థియేటర్‌కి సరిపోయేలా మ్యూజిక్, స్కోర్ ఇస్తాం. దాన్ని చివరకు ఓటీటీలోకి తీసుకు వస్తారు.

**మ్యూజిక్ మీద ఏఐ ప్రభావం ఎంత వరకు ఉంటుంది?..**

మ్యూజిక్ మీద ఏఐ ఎలాంటి ప్రభావాన్ని చూపించలేదు. ఏఐలో ఎంత ప్రాంప్టింగ్ ఇచ్చినా కూడా ఒకేలా ఉంటాయి. కొంత మంది నిర్మాతలు ఏఐ నుంచి ట్రాక్స్ పంపి.. ఇలా కావాలని అంటారు.

**రీసెంట్‌గా పవన్ కళ్యాణ్ ని కలిశారు. ఏం మాట్లాడారు?..**

నేను జనసేన కార్యక్రమాలకు మ్యూజిక్ ఇస్తాను. మొన్న మోదీని ఆయన కలిసినప్పుడు ఓ స్కోర్ చేశాను. నా వర్క్ చూసి ఆయన పిలిపించారు. ఆయనతో నాతో పర్సనల్‌గా మాట్లాడారు.

**జన సేన కోసం ఎప్పటి నుంచి పని చేశారు? ఆ అవకాశం ఎలా వచ్చింది?..**

వెంకట్ చిక్కాల అనే నా మిత్రుడు అక్కడ ఎడిటర్‌గా పని చేస్తున్నాడు. అలా నా ఫ్రెండ్ వల్ల ఆ అవకాశం వచ్చింది.

# 'ది మేజ్' నుంచి రివర్స్ టీజర్ రిలీజ్



తొలిసారి రివర్స్ టీజర్ తో సరికొత్త ప్రయత్నం చేసి ఆకట్టుకుంటున్న 'ది మేజ్' మూవీ మేకర్స్ తమిళ, తెలుగు ప్రేక్షకు ల్లో మంచి గుర్తింపు సంపాదించు కున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా 'ది మేజ్'. ఈ మూవీలో ప్రియాంక, ప్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు.'ది మేజ్' సినిమా రివర్స్ టీజర్ ఎలా ఉందో చూస్తే కన్ను మూసి తెరిచే సరికి ఈ ప్రపంచం అతన్ని గతాన్ని మాయం చేసింది..; అతను మాత్రమే నమ్మే నిజాన్ని కలగా మార్చేసింది... అని చెబుతూ ఆసక్తికరంగా టీజర్ ప్రారంభమవుతుంది. నిద్రలో నుంచి ఉలిక్కి పడి లేచిన హీరో మదిలో అనేక సంఘటనలు మెదులుతుంటాయి. ఎవరూ నమ్మని, తను మాత్రమే నమ్మే కొన్ని నిజాలు, వాటి రుజువుల కోసం అతను అన్వేషణ సాగిస్తుంటాడు. కొంతమంది వ్యక్తులను వెంబడిస్తుంటాడు.




Printed and Published by Gireesh Sanghi, CMD, and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. 12, 13A, 13B & 13C Jadcherla Mandal & Village, Mahabubnagar Dist. RNI No. APTEL/2002/9021, Editor: *Damerla Sai Baba, * responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-11